KR01A115

Andhra University Series No. 63

ప్రమాణపద్ధతిపై ప్రసంగము

రెనె డెకార్ట్ ప్రణీతము

అనువాదకులు:

డాక్టర్ కె. సచ్చిదానందమూర్తి,
అధ్యక్షులు, తత్త్వశాస్త్రశాఖ, ఆంధ్రవిశ్వకళాపరిషత్.

డాక్టర్ కె. వి. ఆర్. నరసింహము,
ఉపన్యాసకులు, ఆంధ్రభాషాశాఖ, ఆంధ్రవిశ్వకళాపరిషత్.

ఆంధ్రవిశ్వకళాపరిషత్
వాల్తేరు
1959

A

B

ప్రథమ ముద్రణ

సర్వాధికారములు అనువాదకులవి

©

రాజమహేంద్రవరమున శ్రీ అద్దేపల్లి నాగేశ్వరరావుగారిచే
పరస్వతీ పవర్ ప్రెస్ నందు ముద్రింపబడినది
ఆర్డరు నెం. 342/59

I

PREFACE

One of the principal factors that caused a revolution in the world of thought, exceptional in its force, extent and duration, in seventeenth century Europe was the philosophy of Descartes. Descartes' *Discours de la Mèthode* is an "inimitable logbook of spiritual discovery" and may well be called the phenomenology of the emergence of the Modern Mind. It marks the development in Europe of autonomous creative philosophy subordinate to nothing but reason and founded on universal "good sense."

The Telugu translation of the *Discours* contained in the following pages is perhaps the first translation of this great classic into a non-European language. This translation along with the Introduction by one of us (Dr. Murty) is our humble contribution towards the promotion of an appreciation of modern Western thought by the more than thirty million Telugu-speaking people of India, and it is hoped that it will stimulate to however small a degree rethinking on problems which are as vital and

KRoIA115

important today in India as they were in Descartes' day in Europe, when she was on the threshold of a new era of philosophic and scientific achievement.

We hoped that this book would be published under the auspices of the *Unesco*, as the ideals that motivated us are the same that inspired the *Unesco* Major East-West project. Though the then Director, Department of Cultural Activities, Shri P. N. Kirpal (now Secretary, Education Ministry of India), M. Jacques Havet and M. Roger Caillois of the Translation and East West Major Projects of the *Unesco* recognised the importance of our work and extended to us their full support, for lack of available funds during that year (1957) *Unesco* could not give any financial assistance. But we are grateful to Shri Kirpal, M. Havet and M. Caillois for their appreciation and encouragement.

We have to also record our obligation to Shri T. Viswanatham, former Finance Minister of Andhra, and Chairman of the Indian Company Law Reform Commission, for the great interest he evinced in the publication of this work. Himself a profound student of literature and philosophy, in Shri Viswanatham one is always sure to find discerning support for good causes.

We wish to express our sense of abiding gratitude to our Vice-Chancellor, Dr. V. S. Krishna, in whom are to be found those twin virtues, i. e. "perception of the understanding and the disposition of the will" to do what is judged to be right, mellowed by "a highly perspicacious intellect", which Descartes valued so much in his friend and disciple Princess Palatine Elizabeth, for the encouragement he gave us while we were engaged on this work and for having it published by Andhra University.

In translating the *Discours* we have been immensely helped by Gilson's commentary and the English translations of Veitch, Haldane and Ross, and Kemp Smith.

Andhra University,
WALTAIR.

K. Satchidananda Murty
K. V. R. Narasimham.

సమర్పణ

శ్రీ సింహాచల వరాహనృసింహస్వామికి :

ప్రభూ!

ఇది పాశ్చాత్యభావప్రపంచమందు విప్లవమును తెచ్చిన డెకార్ట్ ప్రమాణమీమాంసపై ఫ్రెంచిభాషలో వ్రాసిన గ్రంథమున కాంధ్రానువాదము. విభిన్న సంస్కృతులకు చెందిన వారు, తమతమ సంస్కృతులయందు జనించిన కళలను, దర్శన శాస్త్రములను, సాహిత్యమునేకాక, భిన్నసంస్కృతులలోని విషయములనుగూడ అవగాహనచేసికొనిననాడే, సర్వమానవ సౌభ్రాతృత్వమును, అన్యసంస్కృతీసహనమును, సమన్వయ మును, సాధ్యపడును. ఈయాశతోడనే దీని నాంధ్రభాష లోనికి పరివర్తనము చేసితిమి. పరమసత్యము ఏకము; అది ఒకానొకజాతియొక్కగాని, మతముయొక్కగాని వారసత్వము గాదు. సద్బుద్ధియు, జిజ్ఞాసయుగల సర్వమానవులకును అది లభించును. అట్లే, ఈశ్వరజ్ఞానమును, ఆత్మజ్ఞానమును గూడ, చింతనముచేయగల ప్రతిమానవునకును లభింపగలవు. వీనికై, ఒకానొక గ్రంథముపై గాని, సంప్రదాయముపై గాని, గురువుపై గాని ఆధారపడవలసిన అవసరము లేదు. ప్రతిమానవునకును నీచే ప్రసాదింపబడిన 'బుద్ధి', లేక, 'సంవిద్' అనునది కలదు. నిష్పాక్షికముగను, అహంకార రహితముగను, దాని

ఉపోద్ఘాతము

డెకార్ట్ జీవితము, కృషి

కె. సచ్చిదానందమూర్తి

జన్మాదులు :

ఫ్రాన్సుదేశపు టురేన్ ప్రాంతమందలి లహేలో 31 మార్చి, 1596 న రెనె డెకార్ట్ జన్మించెను. ఆయన తండ్రి జోయాకిం బ్రిటాని లోక్ సభలో (1585-6) సదస్యుడు; తాత పియిరీ వైద్యుడు. రెనె తల్లిదండ్రులకు రెండవకుమారుడు; రెనె ఆయన మేనమామ పేరు. డెకార్ట్ కుటుంబనామము. వారు మధ్యతరగతి భూస్వాములు. జోయాకిం తదనంతరము ఆయన సంతానము ఆతని పుష్కల సంపత్తికి వారసులైరి; కాబట్టి రెనె డెకార్ట్ లేమి అనునది ఎఱుగకుండ స్వతంత్రముగ జీవించుట సాధ్యపడెను. ఏడాదికి ఆయనకు ఆరేడువేల ఫ్రాంకుల ఆదాయము వచ్చెడిది.

లాటిన్ భాషలో ఆయన పేరు రెనాటస్ కార్టీసియస్. అందుమూలముగానే ఆయన తదుపరి స్థాపించిన దార్శనిక వాదము కార్టీషియన్ మతమని పిలువబడెను.

విద్యాభ్యాసము :

తన 10 వ ఏట డెకార్ట్ 4 వ హెన్రీ రాజుచే స్థాపించబడిన లఫ్లెచ్‌లోని ఏసుసభ (Society of Jesus) వారు

నుపయోగించు ప్రతిమనుజునకును సత్యముయొక్కయు ధర్మముయొక్కయు నిజస్వరూపమభివ్యక్తమగును; కర్తవ్యతాజ్ఞానమును, అర్థకామముల సంప్రాప్తియును, తన్మూలముగ సాధ్యపడును. పై విషయములను, భారతదేశమున అక్షపాదగౌతముడును, వాత్స్యాయన ఉద్యోతకరులును, ఉదయనుడును చెప్పిరి. అట్లే, డేకార్ట్‌కూడ యూరోప్‌లో చెప్పి, "మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ! సర్వశః" అను నీ వచనమును ధృవపరచియున్నాడు. అయితే, ఈభారతీయ దార్శనికులకంటె డేకార్టునకు నీ యనంతమహిమయందును, నీచే సృజింపబడిన మానవుని మేధాశక్తియందును, విశ్వాసమెక్కుడగుటచే, సంప్రదాయ ఆగమముల ప్రామాణ్యమునకంటె, మేధాశక్తికే ఎక్కువ ప్రాధాన్యమునిచ్చెను. అదే సమంజసమేమో! మానవునకు నీవిచ్చిన శక్తిఅపారము. ప్రతిమానవునకును నీవు అత్యంతము సన్నిహితుడవే. అట్టిచో ఆతడు స్వహృదయప్రత్యయమైన అనుభవమువాద మాత్రమే ఆధారపడి, బాహ్యములైన గురుబోధలకును, సంప్రదాయములకును, శాస్త్రములకును పరతంత్రుడు గాకుండుట యుక్తమే గదా!

ఈమహాగ్రంథమునకు, యథాశక్తిగ, ఈపరివర్తనము గావించితిమి. దీనిని నీ పాదపద్మములందుంచి ప్రహ్లాదుల మగుచున్నారము.

అనువాదకులు

స్థాపించిన విద్యాలయములో చేరి తొమ్మిదేండ్లు విద్యాభ్యాసము చేసెను. ఆకాలమందు ఏసుసభ వారి విద్యాలయములలో ఆరేండ్లు మానవీయ శాస్త్రములు (Humanities), మూడేండ్లు దర్శన శాస్త్రమును బోధించెడివారు. ఆ మూడేండ్లలో, మొదటి సంవత్సరము నీతి తర్క-శాస్త్రములు, రెండవ సంవత్సరము గణిత భౌతిక శాస్త్రములు, మూడవ సంవత్సరము తత్త్వశాస్త్రము బోధించెడివారు. మూడేండ్లలోను ఒకేగురువు ఉండెడివాడు. డెకార్ట్ గురువు ఫోర్నెత్. 1614 లో డెకార్ట్ అచట విద్యాభ్యాసము పూర్తిచేసి పొయిటియర్ విశ్వవిద్యాలయములో చేరి, అచట అధ్యయనానంతరము నవంబరు 1616 లో న్యాయశాస్త్ర పట్టభద్రుడాయెను.

తన విద్యాభ్యాసమును గూర్చి ఆయన చేసిన సమీక్ష:

విద్యాభ్యాసదశనుండియు డెకార్ట్‌కు జీవితమున కుపయోగించు ప్రతివిషయమును గూర్చియు స్పష్టము నిశ్చితమునగు జ్ఞానము సంపాదింపవలెనను ఆసక్తి యుండెడిది. గణిత శాస్త్రమందీ గుణములుండుటచే అది ఆయన కానందదాయకముగ ఉండెడిది; ఇతర విషయములందీ స్పష్టత, నిశ్చితత్వము కన్పడక ఆయనకవి అసంతృప్తి కల్గించెడివి. గెలీలియో మున్నగువారు అప్పుడప్పుడే కనుగొనుచున్న విషయములు, భౌతిక శాస్త్రముల ఫ్లెచ్ విద్యాలయములో పరిశీలింప బడుచుండినను, అవి నిశ్చయ జ్ఞానముక్రింద పరిగణింప బడవచ్చునాయను సంశయము డెకార్ట్‌కు ఉండెడిది.

మొత్తముమీద, వ్యవహారమందు స్పష్టమైన పథమును చూపుటకుగాని, జీవితమును నిశ్చింతగా గడుపుకొనుటకుగాని, విద్యాలయములు తన కుపకరింప లేదని డెకార్ట్ తలచెను. లాటిన్, ఫ్రెంచి భాషలలోని గ్రంథములను కూలంకషముగా అధ్యయనము చేయగల్గుటయు రెండు భాషలలోను సుందర శైలిలో వ్రాయగల్గుటయు తప్ప మరొక ప్రయోజనము వాటివలన కలుగ లేదని డెకార్ట్ ఎంచెను. ప్రతిదానిని గూర్చి ఆకర్షకముగా మాట్లాడి తమకన్న తెలియని వారి మన్ననల పొందుట కుపయోగించును తప్ప, అచట బోధింపబడు దర్శనశాస్త్రము ఇంకెందులకును ఉపయోగించదని ఆయన తలచెను. విద్యార్థుల తలలలోని కెక్కువగా బయటనుండి విషయము నెక్కించుటయు, వారి విచారణా వివేక శక్తులకు పని కల్పింప కుండుటయు అచటి లోపములని ఆయన అభిప్రాయము. ప్రాచీన విద్వాంసుల వాదములను విమర్శనా రహితముగా గ్రహించి శబ్ద ప్రమాణమునకే హెచ్చు ఆధిక్యము ఇచ్చుటయు, ఆరిష్టోటిల్ కనిపెట్టిన త్రిఅవయవన్యాయ (Syllopidm) రీతిగ ప్రతిపాదనలు చేసికొని పోవుటయు వ్యాఖ్యాన వివరణములకు నూతనముగా కనిపెట్టబడిన సత్యము లన్నట్లుగా మెరుగుపెట్టి చూపుటయు, సమకాలిక గణిత భౌతిక జీవశాస్త్రములను అవహేళన చేసి కల్పనలు చేసికొని పోవుటయు నాటి తత్త్వశాస్త్ర మందలి లోపములని ఆయన భావించెను.

పుస్తకములపై వైముఖ్యము:

ఇట్లు విమర్శనాదృష్టితో తనవిద్యాభ్యాసమును తనకు బోధింపబడిన విషయములను పర్యవేక్షించిన డెకార్ట్‌కు పుస్తకములన్నను, ప్రాచీనవాదములన్నను జుగుప్సకలిగెను. జీవితసమస్యలపై మననముచేయుటవలన ఏర్పడినట్టి, తమ సిద్ధాంతముల పర్యవసానములను సరకుచేయనట్టి దార్శనిక వాదములు నిష్ప్రయోజనములని ఆయన భావము. అందుకనియే, విద్యాభ్యాసానంతరము ఆయిన ఎన్నడును ఎక్కువగా చదువలేదు; ఏదైనను పుస్తకమును ప్రారంభించినను సాంతముగా చదువువాడు కాడు. అప్పుడుకూడ సమకాలిక శాస్త్రజ్ఞులో దార్శనికులో వ్రాసినట్టియు, తన స్నేహితులు చదువుమని చెప్పినట్టియు పుస్తకములనుతప్ప ఇతరములు చూచెడి వాడుకాదు. అట్లు బలవంతముగా చదువుటకు ప్రారంభించినప్పుడుకూడ ఆ పుస్తకములనుండి ఏదైన నేర్చుకొనవలెనను ఆశతోగాక, తానుపరిశోధించుచున్న, లేక, ఆలోచించుచున్న సమస్యల పరిష్కారమునుగూర్చి అవి ఏమైనను సూచనలు నీయగలవేమో అను ఉద్దేశ్యముతోడనే వాటిని చదువుచుండెడివాడు. గిల్బర్ట్, కెప్లర్, హార్వేలకుతప్ప ఆయన మరెవరికి ఋణపడినట్లుగా చెప్పికొనలేదు; బేకన్‌ను ప్రశంసించినను ఆయననుండి ఏ ఊహాలను డెకార్ట్ గ్రహించలేదు. తదితరుల నాయన లెక్కలోనికే తీసికొనలేదు; వారెవరును తన మనోవికాసమునకు తోడ్పడినట్లుగా తలపలేదు.

డెకార్ట్ వివేకము:

సత్యాసత్యములను బాగుగా వేరుచేసి చూచి సత్యమును మాత్రమే గ్రహింపవలెననెడి డెకార్ట్ వివేకమే ఆయనను రసవాదము జ్యోతిషము ఇత్యాదులకు బానిసగాకుండ కాపాడెను. మహామేధావియగు కెప్లర్ ఒక జ్యోతిష సంబంధమైన దినచర్య పుస్తకమును వ్రాయుచుండెడివాడనియు, జాన్ అను క్రైస్తవ ఋషికి ప్రసాదింపబడిన శ్రుతిని (apocalypse) గణితశాస్త్రప్రకారముగా న్యూటన్ వివరించి తన ఈ ప్రయత్నమును గురుత్వాకర్షణ సూత్రము (Law of Gravitation) ను కనుగొనిన కృషికంటె గొప్పదిగా ఎంచెననియు గురుతుంచుకొందుమేని డెకార్ట్ వివేకశక్తి స్పష్టముకాగలదు.

లోకానుభవ సంగ్రహణ:

తాను విద్యాలయములలో చదివిన గ్రంథము లిచ్చిన జ్ఞానముచే అసంతుష్టుడై, "విశ్వ మనే మహాగ్రంథము" నే చదువగోరియు, రాజ సభలను, సైన్యములను, భిన్న దేశములను చూచుచు అనుభవములను సంపాదింపవలెననియు డెకార్టు 1616 నుండి 1619 వరకు నానాదేశములయందు పర్యటించెను. సైన్యమందు చేరిన ఇట్లు బాగుగా చేయవచ్చునని తలచి, 22 వ ఏట ఆయన నాసో ప్రభువగు మారిస్ సైన్యములో చేరెను.

బీక్ మన్ తో సమావేశము :

నవంబరు 10, 1618 న డెకార్ట్ ఇట్లు జీవితము గడుపు చుండిన దశలో, అతడు హాలండ్ లో ఐశాక్ బీక్ మన్ ను కలిసి కొనుట సంభవించెను. బీక్ మన్ వయస్సులో డెకార్ట్ కంటె ఎనిమిదేండ్లు పెద్ద. వైద్యశాస్త్రమందు ఆచార్యోపాధిని పొందినను భౌతికశాస్త్రములో అతనికి ఆసక్తి మెండు. బీక్ మన్ 1627 లో డోర్ట్ రెక్ట్ కళాశాలకు ప్రధానాచార్యుడాయెను.

బీక్ మన్ తో కలయుట డెకార్ట్ జీవితములో ఒక అపూర్వ నూతనాధ్యాయమునకు దారితీసెను. డెకార్ట్ బీక్ మన్ కు భౌతికశాస్త్రములోని కొన్ని సమస్యలను పరిష్కారము చేయు మార్గములు సూచించెను. బీక్ మన్ డెకార్ట్ ప్రతిభను దాని లోతులను చూచి ఆశ్చర్యచకితుడై అతనికి విశేష ప్రోత్సాహము కల్గించి, అతనిని మేల్కొల్పెను. దానితో డెకార్ట్ యొక్క సోమరితనమును, జీవితములో గమ్యము లేకుండుటయు తొలగిపోయెను. డెకార్ట్ లో ప్రసుప్తముగా ఉన్న ఊహాశక్తులను (Speculative powers) పురిగొల్పి, ఆతడు దాదాపుగా మరచిపోయిన విజ్ఞానమును అతనికిగురుతు చేసిన ఘనత బీక్ మన్ ది. డెకార్ట్ ఆతనిని తన ఆధ్యాత్మిక పిత అనియు, తనకృషికంతకును మూలమాతని సంసర్గమే అనియు వ్రాసెను.

నూతన శాస్త్రజ్ఞాన సృష్టి :

ఈనూతన మైత్రి ఏర్పడిన కొన్ని నెలలలోనే డెకార్ట్ ఒక నూతన శాస్త్రమును (Scientiam penitus novam) కనుగొనెను. అవిరతములు (Continuous) మరియు విరతములు(Discontinuous) అగు అన్నివిధములైన పరిమాణము (Quantity) తో సంబంధముగల అన్ని సమస్యలకు వర్తించు నొక సామాన్య పరిష్కారము దీనివలన లభించెను. మరికొన్ని నెలలకు డెకార్ట్ తన యాంత్రిక సూత్రములను (Principles of mechanics), రేఖాగణితమును (Geometry), ఇతర విషయములను సమన్వయించి తన కృషిని సంపూర్ణము చేయ నాశింపగలైను.

దేశాటనము :

ఏప్రిల్ 1619 లో సైనికోద్యోగము నుండి విరమించు కొని, ఈ శాస్త్రీయ కృషివలన కలిగిన మానసికమగు బడలి కను తీర్చుకొనుటకు దేశాటనముసేయ డెకార్ట్ హాలెండును వీడెను. ఆమ్ స్టెర్డంనుండి ఓడలో బయలుదేరి పోలెండ్, తురింజియా, బొహేమియా, ఆస్ట్రియాలను చూచుకొనుచు ఫ్రాంక్ ఫర్డ్ లో ఫ్రెడరిక్ చక్రవర్తి పట్టాభిషేకోత్సవములను చూచి, తరువాత బవేరియా ప్రభువగు మేక్సిమిలియన్ సైన్య మందుద్యోగము స్వీకరించెను. 1619-20 లో బవేరియాలోనే

ఉన్నట్లుగను, కోపెన్‌హేజన్, డాన్‌జింగ్‌లను కూడ చూచినట్లుగను మనకు తెలియవచ్చుచున్నది.

విచికిత్స – సత్యాన్వేషణము: సంశయపద్ధతి, దాని పర్యవసానము:

నవంబరు 1619 లో డెకార్ట్ తిరిగి శాస్త్రీయ (Scientific) దార్శనిక (Philosophic) సమస్యలపై ఎక్కువగా విచారింప ప్రారంభించెను. తన నానాదేశాటనమువలన కలిగిన ఫలితమేమని ఆయన ప్రశ్నించుకొన దొడగెను. దేశాచారములును, విభిన్న దేశములందలి సంప్రదాయములును, వాని పరస్పర వైరుధ్య వైచిత్ర్యములనుబట్టి వానిలో ఏ ఒక్కటియును స్వసంవేద్య సత్యములనుండి నిగమనము చేయబడినదిగాకపోవుటచేత, అవి ఏవియు ఈశ్వరనిర్దిష్టములుకావని ఆయనకు తేలెను. అయితే జీవితమున కుపయుక్తమగు స్పష్టమైన సంశయమున కాస్కారములేని సత్యదర్శన మెక్కడ లభించును? ప్రాచీనుల ప్రాతలయందు స్వయంసిద్ధసత్యము అనుపలబ్ధమని వాని నీవరకే ఆయన పరిత్యజించి, చుట్టునున్న విశ్వగ్రంథమందలి సత్యము వెదుకబూనెను. బాహ్య విశ్వమును, దేశాచారములను, సాంప్రదాయములను ఎంతగా అవలోకించినను అట్టిసత్యము ఆయనకు భాసింపలేదు. ఒక వేళ సత్యము ఆత్మనిహితమా? స్వాత్మాన్వేషణమువలనను, స్వస్వరూపజ్ఞానమువలనను అట్టి సత్యము లభించునాఏమి?

బాహ్యపరిశీలన నాపి అంతర్వీక్షణముచేసి ప్రయత్నించిన అది లభించునేమో! బహిఃప్రపంచముగాక, ఒకవేళ వ్యక్తిస్వభావమే (Individual Personality) సత్యస్వరూపమును ప్రదర్శించు నేమో! అయితే అంతర్వీక్షణము చేయవలెనన్నచో బాహ్యకారణములవలన వచ్చిన ఏ అనుభూతులపైన ఆధారపడక, స్వయంసిద్ధములుగా కన్పడని ప్రతిఅభిప్రాయమును పరిత్యజించవలెను. పాతబూజును దులిపి, అనాలోచితముగా సంఘమునుండియో, సంప్రదాయమునుండియో, ఇంద్రియానుభూతులవలననో మనకు సంక్రమించిన ప్రతి విశ్వాసమును, అభిప్రాయమును, సంశయించుటకును, విమర్శించుటకును పరీక్షానంతరము నిశ్చితమని తేలినచో అంగీకరించుటకును, లేదా, పరిత్యజించుటకును సంసిద్ధత యుండవలెను. ఏదో ఒక చిక్కు కలుగగనే, దారితెలియక అసలుమార్గమే లేదను సంశయవాదుల అగమ్యగోచరత్వము కాదిది. డెకార్టుకు స్ఫురించిన సంశయపద్ధతి, బుద్ధికి సత్యమును కనుగొనగలశక్తి కలదు అను శ్రద్ధపై ఆధారపడియున్నది. సంశయించుటే ఒక ఘనకార్యమనిభావించి ప్రతివిషయమును సంశయించుట నిరతసంశయవాదమందో, ఆధారరహిత నిషేధవాదమందో పర్యవసించును. డెకార్ట్ అవలంబింపదలచినది సక్రమమగు సంశయపద్ధతి (Methodical Scepticism) ఈపద్ధతి నవలంబించువారు నిష్పక్షపాతబుద్ధితో వివేచన చేయగలిగియుండవలెను. సంప్రదాయసిద్ధమైనట్టియు సంఘముచే స్వీకరింపబడి

నట్టియు, లేదా ఇంద్రియ జ్ఞానజన్యమైనట్టియు ప్రతివిషయమును సత్యముకాదని ఋజువుచేయుటే ప్రయోజనముగా గాని, అట్టి ప్రతివిషయమును సత్యమే అని చాటుటే లక్ష్యముగాగాని కారాదు. మన ఆలోచన నూతనత్వములో పర్యవసింపవలసిన అవసరములేదు. ఆలోచనచే ప్రాచీనకాలమునుండి పరిపాటిగా వచ్చిన కొన్నివిషయములు సనాతనసత్యములుగా ప్రతిపన్న ములుగావచ్చును; లేదా వాని నన్నిటిని నిరాధారములైన విశ్వాసములుగా చూపవచ్చును. అందరును ఇటులచేయలేదు; తొందరపాటుకల్గిన స్థైర్యరహితులకు సంశయపథమందు ప్రవేశించినచో, తిరిగి దానిని పరిత్యజించుటకు వలసిన ఓర్మి, వినయము కలుగకపోవచ్చును. అనుభవముకలవారును, సక్రమ పద్ధతి చూచాయగానైన స్ఫురించుచున్నవారును, నూతన ఆలోచనా ప్రణాళికలను సృష్టించు ప్రతిభకలవారునుమాత్రమే ఇట్టి మార్గమున ఉపక్రమించవలెను. అప్పుడుకూడ, ఇతరులందరకు ఏదో బోధింపవలెనని ఉబలాటముతోడగాక, స్వీయాభివృద్ధి కొరకుమాత్రమే ఈప్రయత్నము చేయవలెను. సత్యదర్శనమున కాధారము చిరకాలీన సంప్రదాయముగాని, వ్యావహారిక సత్యముకాని కాజాలదనియు, వ్యక్తిగతమును క్రమబద్ధమును విమర్శనాత్మకమును అగు విశ్లేషణమైననే (individual's Systematic Critical analysis) సద్దర్శన సంస్థాపన జరుగవలెననియు డెకార్ట్ తీర్మానించుకొనెను. స్వబుద్ధి శక్తియను నికషోపలమును ఉపయోగించి సదసద్వివేచనగావించి, సంప్ర

దాయక, వ్యావహారిక అనుభవమునంతను సమగ్రపరీక్షచేసి, సత్యగ్రహణము, అసత్యపరిత్యాగముచేసి, తనకు తానై బుద్ధిమంతుడు జీవితమునకొక గమ్యస్థానమును తదనుగుణమగు విధానమును ఏర్పరచుకొనవలెను. అదియే నిజమైన దర్శనము, అంతేగాని ప్లేటో, అరిస్టోటిలులో లేదా, తాదృశులగు మరెవరో ప్రాచీనులో, ఆర్వాచీనులో, వాక్రుచ్చినది సద్దర్శనము కాజాలదు. అయితే పరీక్షించి సత్యాసత్య నిర్ణయము చేయుదాక చేయవలసినదేమి? అంతవరకు మనుష్యుడు అనిశ్చితావస్థలో కింకర్తవ్యతా విమూఢుడుగా నుండవలెనా? లేక ఎట్లయినను సరే, తోచినట్లు బ్రతుకుచుండవచ్చునా? దీనికి సమంజసమని డెకార్టుకుతోచిన సమాధానమేదియన: తనకు నిశ్చిత జ్ఞానోపలబ్ధిజరిగి సద్దర్శనము సువ్యవస్థితమగునంతవరకు మనుష్యుడు దేశాచారములను పాటించుచు లోకమందు తనకున్నస్థితితో తృప్తివహించి, తదనుసారము వ్యవహరించవలెను. స్వసంప్రదాయమునొక్కయు, స్వసంఘమునొక్కయు ఆచారములను తాత్కాలికముగ పరిగ్రహించి, వానిని శక్త్యనుసారము వ్యవధినిబట్టి పరీక్షించుటకును విమర్శించుటకును సంసిద్ధుడైయుండవలెను. సమగ్ర పరీక్షానంతరము, స్వయంసిద్ధములైన సంశయమునకేమాత్రము తావులేని అబాధిత సత్యము ప్రాప్తించినదప్పు, దేశాచారములను సంప్రదాయమును ధిక్కరింపరాదు. ఒకపరి ఈపరిశోధనయు, ఈ జిజ్ఞాసయు సంతృప్తికరముగ పర్యవసించినపిదప, ఆ సత్యదృష్టికి

అసమ్మతములైన విషయములను పరిత్యజించుటకుకూడ వెను దీయ్యరాదు. దర్శనమెప్పుడును వ్యక్తికి స్వయంనిష్ఠముగా నుండవలెను. స్వతస్సిద్ధ, సరళ, స్పష్టసత్యములపై ఆధారపడి యుండవలెను. ఇంద్రియప్రత్యక్షముపైననో, (ఇంద్రియజ్ఞానము భ్రాంతికాదని నిశ్చయమెక్కడిది?) శబ్దప్రమాణముపైననో ఆధారపడినదర్శనమునకు సునిశ్చితత్వ మసంభవము.

ప్రమాణ పరీక్షణము: నూతన దర్శన నిర్మాణ వాంఛ: శాస్త్ర ప్రపంచ స్వరూపము:

ఈవిధములైన ఆలోచనలు డెకార్ట్‌ను అక్టోబరు నవంబరు 1619 లో ఎక్కువగా ప్రోద్బలముచేసి, నవంబరు 10 వ తేదీకి ఆయిన నొక నిశ్చయమునకు తెచ్చినవి. అంతవరకు కనిన, వినిన, ఇతర విధములుగా గ్రహించిన, ప్రతి అభిప్రాయమును విశ్వాసమును సమగ్రముగా పరీక్షించవలె ననునదియే ఆనిశ్చయము. అయితే, ఇది ఒక మనుష్యుడు చేయగలపనియా? ఒకని జీవితమందు కొనసాగునా? అనుసంశయ మాయనను బాధించసాగెను. వెంటనే, ఆయనకు మరొక భావము పొడమెను. కళాకారుడొక్కడు తనకు తానై అంతయు స్వయముగా నిర్మించిన వస్తువునందు, పలువురు చేసిన నానాభాగములు కల్గిన వస్తువులలో లేని సంపూర్ణత, సౌందర్యము ఉండును. అట్లే నిర్మింపనున్న దర్శనములో ఒక సామరస్యము, ఏకత, పరిపూర్ణత ఉండవలెనన్న అది ఒకే వ్యక్తియొక్క

సృష్టిగా నుండిననే మంచిదేమో! కాక, సంఖ్యాప్రపంచమంతయు పరస్పరానుబద్ధముగా నున్నట్లే, సత్యమంతయు అవినాభావముగా క్రమబద్ధము కాకుండునా? శాస్త్రములన్నియు పరస్పర సంబద్ధములై (Catenam Scientinum) ఒకానొక సుందరత లేకుండ ఎట్లుండ గలవు? అట్లయినచో, నిస్సంశయమైన స్వతస్సిద్ధ సత్యమొకటి లభింపగానే, తద్ద్వారా తదను బంధితములైన యావత్సత్యమును క్రమముగా మానవుడు తెలిసికొనలేడా? ఈవిధముగా ఆలోచించి కొంతవరకు సమాశ్వాసనము చెందియు, డెకార్ట్ ఆనాడు ఈమహాకృషి ఎట్లగునను ఉద్వేగముతోనే దినమంతయు గాఢ చింతాక్రాంతుడై ఎట్లో రాత్రి శయనించెను. అది 1619 నవంబరు 10 వ తేదీ; దినమంతయు ఆయన బవేరియా ఉల్మ్‌నగర పరిసరములో శీతబాధ బాపుకొను Poel లో నుండి ఇట్లు విచికిత్స జేసి, దానినే మరల మరల ఆలోచించుచు నిదురపోయెను.

డెకార్ట్ స్వప్నములు:

ఆరాత్రి ఆయనకు మూడు స్వప్నములు వచ్చెను. మొదటిదానిలో కొన్ని భూతములను చూచి భీతుడై తిన్నగా నిల్చి నడువలేకపోయినట్లును, అట్లు నడచుటకు ప్రయత్నింపగనే పెద్ద సుడిగాలి వచ్చి తన్ను పరవశుని చేసినట్లును, చివరకు ఒక విద్యాలయము కానుపింపగా అందలి దేవాలయములోనికి

ప్రార్థనకేగ ప్రయత్నించినట్లును ఆయనకు కన్పడెను. ఇంతలో మెలకువవచ్చి, తన పాపఫలితముగా దానిని ఎంచి, రెండు గంటల ప్రార్థనచేసి తిరిగి శయనించగా మరొక స్వప్నము వచ్చెను. అందులో ఉరుములవంటి మహాధ్వని విని భయపడినట్లుగాను, కండ్లు తెరచి చూడగా విస్ఫులింగములు తన చుట్టును గది అంతయు వ్యాపించినట్లుగను కన్పడెను. వెంటనే మేల్కొని, తాను ఎఱుగకయు ఎఱిగియు చేసినపాపములకు తన అంతఃకరణపొందిన పరితాపమే తనకు కలిగిన భయ రూపమును తాల్చెననియు, ఉరుము, సత్యసారము (Spirit of Truth) తన్నావహించుటకు సూచన యనియును, ఊహించు కొనెను. శాంతించి తిరిగి నిదురించగా ఆయనకు మూడవ స్వప్నమువచ్చెను. అందులో, తానెఱుగకుండ ఎవరో తన బల్లపై ఒక పుస్తక ముంచినట్లును, దానినితీసిచూచి అది యొక నిఘంటువని తెలిసికొని అది తనకుపయోగించునని సంతోషించుచుండగా, అకస్మాత్తుగా ఎట్లువచ్చినదో తెలియ కుండగనే అక్కడ మరియొక పుస్తకము కానవచ్చినట్లును, అదియొక కవితా సంగ్రహమైనట్లును కానవచ్చెను. స్వప్న మందే కుతూహలముతో దానిని విప్పిచూడ, ఆయనకు "వ్యజీవితమార్గమును నేనుఅనుసరించవలెను?" (Quod Vitae sectabor iter) అనుపంక్తి దృష్టిగోచరమైనట్లు, అదేసందర్భ మందెవరో అజ్ఞాతుడగు మనుష్యుడు "అవును మరియు కాదు" (Est et non) అను మాటలతో ప్రారంభించు పద్యములను

కొన్నిటిని చూపించినట్లును అతనితో కొంతసేపు సంభాషించినట్లును అనుభవమాయెను. ఇంతలోస్వప్నముపోయి, మేల్కొనకుండగనే, తనకు అనుభవమైనది స్వప్నమా యథార్థమా యని సంశయించి, స్వప్నమే అని నిర్ణయించుకొని, ఆ స్వప్నమున కర్థమేమాయని ఆలోచింపసాగెను. నిఘంటువు శాస్త్రముల సమష్టికిని, కవితాసంగ్రహము దర్శనశాస్త్రమునకును ప్రజ్ఞాదృష్టితోగూడిన జ్ఞానమునకునుగల ఐక్యమునకును ప్రతీకములని ఎంచెను. డార్నికుల రచనలలోకంటె కవిత్వమందే ఎక్కువ సత్యముండుటలో డెకార్టుకు సందేహములేదాయెను. ఈశ్వరప్రేరిత జ్ఞానము దైవికము; భావనాశక్తికున్న ప్రభావ మత్యధికము; ఇవిరెండు ప్రజ్ఞాయుక్తి జ్ఞానమునకు సులభతరముగా దారితీయునని ఆయనతలచెను. ఇవిరెండును కవులకు స్వాయత్తములు. "వీజీవితమార్గమును నేననుసరించ వలెను?" అనుపంక్తి ఒకానొక జ్ఞాని యొక్కయో, ఈశ్వర మీమాంసపై ఆధారపడిన న్యాయశాస్త్రముయొక్కయో ప్రబోధముగా అర్థముచేసికొనెను. ఇంతలో, డెకార్ట్, తాను స్వప్నమందున్నానా లేక మేల్కొని ఆలోచించుచున్నానా యని సంశయముకల్గి మేల్కొనెను. అప్పుడుకూడ తన మూడవ స్వప్నమునే వ్యాఖ్యానించు కొనుచు, కవితా సంగ్రహము కన్పడుటకర్థము శ్రుతి, అంతఃప్రేరణ – ఈ (revelatation, inspiration) రెండును తన కృషి కనుకూలములనియు, "అవును, మరియు కాదు" అనుదానికర్థము

మానవజ్ఞానములోను వ్యావహారికశాస్త్రములలోనుగల సత్యా సత్యములనియు భావించెను. తానుఊహించిన మహాకృషికి — అనగా సమస్త శాస్త్రముల పరస్పర సంబంధమును వెలుగులోనికితెచ్చి, స్వీయప్రజ్ఞతో నూతన దర్శనమును నిర్మించి, తన్మూలముగా సత్యాసత్య నిర్ణయముచేసి జీవితమునకొక నిశ్చిత మార్గము నేర్పరచుట — యోగ్యునిగా ఈశ్వరుడు తన్ను అనుగ్రహించినాడనునదియే ఈమూడు స్వప్నముల తాత్పర్యముగా డెకార్ట్ తలపోసెను.

డెకార్ట్ ప్రొక్కుబడి:

మరునాడు మేల్కొని, డెకార్ట్ తన స్వప్నములను గూర్చియే పరిపరివిధముల ఆలోచించుచు, తన సత్యాన్వేషణను సఫలము చేయుమని భగవంతుని ప్రార్థించుచు, తనకు నిర్దిష్ట విధానమును స్ఫురింపచేయుమని యాచించుచు గడపెను. ఏసుక్రీస్తు తల్లి మేరీనికూడా ఎంతయో యాచించి, తన కార్య సాఫల్యభారము నామెపై వైచి, ఆమె అనుగ్రహమును ఇంకను త్వరితముగా పొందగలందులకై, ఇటలీలోని లొరెటోలోగల యామె దేవాలయమునకు తీర్థాటనము చేసెదననియు, వెనిస్ నగరమునుండి పాదచారిగా లొరెటోకు వెళ్ళెదననియు, ఒకవేళ బడలికవలన నట్లు చేయలేకపోయినచో అతిహీనమైన చినిగిన దుస్తులలో* వెళ్ళి దర్శనము చేసెదననియు

* తిరుమల వెంకటేశ్వర సన్నిధికి ముండనముచేసికొని, బిచ్చమెత్తికొనుచు దీనావస్థలో వెళ్ళినట్లు.

డెకార్ట్ ప్రొక్కుకొనెను. వెంటనే కాకపోయినను, నాలుగేండ్లపిదప 1624 లో డెకార్ట్ ఈ ప్రొక్కు చెల్లించుకొనగలిగెను.

సమస్త శాస్త్రజ్ఞానమునకు మూలము: భగవదస్తిత్వము:

ఇట్లు సమస్త శాస్త్రములు పరస్పర సంబద్ధములనొక మహాద్భుత నూతన శాస్త్ర (Mirabilis Scientiae) ప్రాతిపదికను డెకార్ట్ కనుగొనెను. నాటినుండియు సమన్వయాత్మక మగు నావిశ్వతోముఖ శాస్త్ర స్వరూపమును కరతలామలక మెట్లుచేయవలె ననునదే డెకార్ట్‌కు జీవిత లక్ష్యమాయెను. అయితే తన ఈప్రయత్నము భగవదనుగ్రహమునకు పాత్రమైనదనియు, అందుకు తారాకాణము తన స్వప్నములనియు, తాను వెలువరింపబోవు శాస్త్ర ప్రపంచమున కంతకును భగవంతుడే మూలకందమనియు డెకార్ట్ ఆవేశ తాత్పర్యము. ఆయన ఈ ప్రతిభా దృష్టియే తదుపరి, ఆయన దర్శనము ఈశ్వరాస్తిత్వముపై నిర్మితమగుటకు కారణ మాయెను. ఈ అంతఃప్రేరణ (Inspiration) సుసంబద్ధమగు ఆలోచనా పథకముగా మారుటకు మాత్రము ఎన్నో సంవత్సరములు పట్టెను. కేవలము జ్ఞానసమాహారము దర్శనము కాజాలదు; ప్రతిభాదృష్టితో ఉద్దీపితమైనప్పుడే అనుభవమందలి, ఆలోచనల యందలి నానాత్వము సమన్వయ మొంది సుందర క్రమబద్ధ దర్శనముగా మారునని దీనివల్ల తెలియుచున్నది.

డెకార్ట్ : కవిహృదయము :

డెకార్ట్‌లోని కవిహృదయమును మొదటగా గమనించినవాడు రాత్తార్. డెకార్ట్ విద్యార్థిగా ఉన్నప్పుడు కవిత్వమును ఎక్కువగా చదువుచు ఆనందించెడివాడు. ఆయన రచనలలో శిల్పము, చిత్రలేఖనము, వాస్తువిద్య, రంగస్థలము, నిత్యజీవితములోని దృశ్యములు మొదలగువాని నుండి గ్రహింపబడిన ఎన్నో ఉపమానము లున్నవి. ప్రతిరాత్రి 10 గంటలు నిదురించుచు, వనములు, ఉద్యానములు, మహాసౌధములు – వీని గూర్చిన స్వప్నముల గనుచు, కథలలో నూహింపబడిన సుఖముల ననుభవించుచు నుందుననియు, జాగ్రదావస్థలో కూడ దివాస్వప్నములను నక్తస్వప్నములతో తనకు తెలియకుండగనే సమ్మేళనము చేయుచుందుననియు, ఆయన బాల్యాకుకు ఒకమారు వ్రాసెను. (Colitationes Privalai) "స్వీయ ఆలోచనల" లో మనలో అంతర్నిహితముగా నున్న జ్ఞాన బీజములను దార్శనికులు బుద్ధి వ్యాపారసుపలన వెలికి దెత్తురనియు, భావనాశక్తిచే కవులు వానిని వెలికి దెత్తురనియు, గంభీరార్థ యుక్తములగు ఆలోచనలు (Graves sententias) దార్శనికుల వ్రాతలలోకంటె కవుల వ్రాతలలోనే హెచ్చుగా ఉండుననియు ఆయన వ్రాసియున్నాడు.

ప్రమాణ పద్ధతి స్ఫురణ :

1619 శీతకాలములోను తరువాతను, డెకార్ట్ వాని ఆవిర్భావ (Manifestation) మును, అభివ్యక్తిని, వాహకములను (Media) వ్యావర్తనము చేసి, గణితశాస్త్రీయ పదార్థముల సంబంధములు యుగ్మనిష్పత్తులు (Proportions)-వీనిపై తన ఆలోచనల కేంద్రీకరించి ఎన్నో సమస్యల పరిష్కరించి, విశ్లేషణాత్మక రేఖాగణితము (analytical geometry) ను కనుగొనెను. దాని నేవిషయముతోనైనను అన్వయింపవచ్చునిఎంచి రేఖాగణితముతో అన్వయించెను. సకలశారీరక ప్రక్రియలను గణితశాస్త్రరీత్యా ప్రతిపాదింపవచ్చునని తలచి, కాంతిశాస్త్ర (Optics), శరీర నిర్మాణ శాస్త్రములలో విశేషముగ కృషిచేసెను. ఖగోళ శాస్త్రజ్ఞుల తోడను, కళ్ళద్దములు, శాస్త్రీయ పరికరములు చేయువారి తోడను విశేషించి సహవాస సంభాషణలు చేసెడివాడు. 1620 నవంబరు 10 వ తేదీనాటికి ఒకక్రొత్తపరిశోధనకు ఆధారముల నర్థము చేసికొనసాగెను. వివిధశాస్త్రములలోని సత్యములను కనిపెట్టుపద్ధతి, అనగా బుద్ధిని సక్రమవిధానముగా నడిపించవలసిన పద్ధతి ఆయనకు కొంచెముగా స్ఫురించెనని దీనివలన తోచుచున్నది. సంవత్సరముక్రింపట సాధ్యమని తోచిన సమన్విత విశ్వతోముఖశాస్త్రమును (Unified-science) నిర్మించుటయను ఆదర్శమునకు మార్గమిప్పటికి

ఆయనకు తట్టెను. ఆమార్గమును సుస్పష్టము చేసికొని దానిని విశదీకరించుటకు మరి ఎనిమిదేండ్లు పట్టెను.

విశ్లేషణాత్మక రేఖాగణితము: భౌతికశాస్త్రప్రగతి:

ఇక్కడ విశ్లేషణాత్మక రేఖాగణితమునుగూర్చి వివరించుట యుక్తము. ఒక సమస్యను పరిష్కారము చెందినట్లుగా భావించి, ఆ ఊహాపర్యవసానములను పరీక్షించుట విశ్లేషణ పద్ధతి. ఒక సమతలమందలి బిందువు స్థానమును రెండు స్థిర సరళరేఖలనుండి గలదూరమునుబట్టి నిర్ణయించుటయే సహా నిర్దేశకముల (Co-ordinates) ను ఉపయోగించుట. ఇది డెకార్ట్‌కు పూర్వము యూరప్‌లో ఎవరును చేయలేదు. రేఖాగణిత బీజగణితముల అన్వయమనగా, సంఖ్యాసంబంధములు కల్గిన పరిమాణములన్నిటిని రేఖలతో వ్యక్తపరచుటయే. (All quantities between which numerical relations hold are expressible by lines) గుణభేదములన్నిటిని ఆకార (Shape), పరిమాణ (Dimension) ములతో సంబంధితములుగా (Correlated) చేయవచ్చుననియు, ఈ సంబంధముల నన్నిటిని సంఖ్యారూపకమగు సంకేతముల ద్వారా (Numerical Symbolism) వ్యక్తీకరింపవచ్చు ననియు, సంఖ్యాలక్షణముల ఆకారముల పరిమాణముల పరస్పర సంబంధములు (Relations between properties of numbers) సమీకరణము (Equations) ల ద్వారా వ్యక్తి

కరింపబడవచ్చునియు ఈ పరిశోధనవలన నిర్ధారణ ఆయెను. అంతవరకు ఇతరమార్గములలో అనుసంధానము చేయబడుచున్న భౌతికశాస్త్రమిక అట్లుగాక సంఖ్యలతో—గణిత శాస్త్రముతో—మేళనముచేసినచో విశేషసఫలత సిద్ధించునని తోచుటకు డెకార్ట్ పరిశోధన దారితీసెను. 18వ శతాబ్దము నుండి ఇంతవరకు జరిగిన భౌతికశాస్త్రప్రగతి కిది ఒక ముఖ్య కారణము.

డెకార్ట్ ఫ్రాన్సుకు వచ్చుట: కొన్ని జీవిత సంఘటనలు:

1621 లో బవేరియా సైన్యముతో సంబంధమునూను కొని, ఇతర దేశములు చూచుకొనుచు 1622 లో స్వదేశమగు ఫ్రాన్సుకు చేరెను. తన కుటుంబమునుచూచి, పోయిటోలోగల ఆస్తులనమ్ముకొని, దానినికూడ తన మూలధనమునకు కలుపుకొనెను. దానిపైవచ్చు ఆదాయ మాయన స్వతంత్రముగ జీవించుటకు, శాస్త్రకృషిని జీవనోపాయముగ చేసికొనకుండ ఉండగల్గుటకు ఉపయోగించెను. ఆయనకుటుంబము ఇక ఆయన వివాహితుడై అక్కడే ఉండునని ఆశించెను గాని వివాహచింతనమాత్రము ఆయనకు లేదాయెను. సహ్యమునకున్న సౌందర్యముతో సమానమైన సౌందర్యము ఎక్కడను తనకు కానరాలేదని ఒకసారి ఆయన ఒకసౌందర్యవతితో ననెను. అవివాహితుడయ్యెను, ఆయనకొక కుమార్తె కలుగుటయు, ఆపిల్ల శైశవమేటనే గతించుటయు అదియే తన జీవిత

ములోకెల్ల గొప్ప విషాదకరమగు. సంఘటన యని ఆయన భావించుటయు సంభవించెను. పూర్ణముగా బుద్ధిని అభివృద్ధి చేసికొని విజ్ఞానమును విస్తరించుటకు జీవితమును వినియోగించు స్వాతంత్ర్యమునకు వివాహ మడ్డంకి యని ఆయన విశ్వసించెను.

ఇటలీపర్యటన: తీర్థయాత్ర: పునరాగమనము:

1623 లో తిరిగి దేశాటనమునకై బయలుదేరి స్విట్జర్లాండులో కొంతకాలముండి అక్కడ కొంతవాతావరణాధ్యయనము (Meteogloroical Studies) చేసెను. పెద్దమంచుగడ్డల స్వరూపమును పరిశోధించెను. పర్వతముల ఎత్తులను గుణించెను. తర్వాత ఇటలీ వెళ్ళి అక్కడ కొంతకాలముండెను. అప్పుడే తన లూకెట్ గ్రామొకుక్ తీర్చెను. ఆ దినములలో ఇటలీ, శాస్త్రజ్ఞుల కాటపట్టుగను, శాస్త్రకృషికి విశేషాదరణనిచ్చు దేశముగను ఉండుట చూచి డెకార్ట్ అక్కడే స్థిరనివాస మేర్పరచుకొన దలచెను. గాని, ఇటలీలోని ఉష్ణవాతావరణము ఆరోగ్యమునకును, దేశములోని ప్రభుత్వముయొక్క అవ్యవస్థ శాంతికిని, ప్రాణమునకును భంగకరములని ఎంచి 1625 లో స్వదేశమునకు వచ్చి ప్యారీ నగరమందు నివసింపసాగెను. అక్కడ కార్డినల్ (క్రైస్తవ మహాధికారి) బెరుల్‌తోడను, మెర్సీన్ అను క్రైస్తవ సన్యాసి తోడను, ఖగోళ శాస్త్రజ్ఞులతోడను, యంత్ర శాస్త్రజ్ఞులతోడను (Engineers) సన్నిహితుడుగా ఉండుటయే గాక, సంగీతము, కవలలు, జూదము, కవిత్వము—వీని గోష్ఠిలో కాల

యాపనముచేయు చంచలమనస్కులతో గూడ ఎక్కువకాలము గడపుచుండెను.

డెకార్ట్ తన ఊహాలను బహిరంగపరచుట:

నవంబరు 1628 లో డెకార్ట్ ప్యారీ నగరమందుండగా, అచటి పోపురాజదూత (Papaln uncio) ఇంటనొక సమావేశమున కాహ్వానింపబడెను. భాండో అను నాతడు ఆరిస్టాటిల్ మున్నగు గ్రీకుల, ఎక్వినాస్ మొదలగు మధ్యయుగపు క్రైస్తవచింతకుల దర్శనములను వదిలివేసి ఒకక్రొత్త దర్శనమును నిర్మించితి నని చెప్పుచుండుటచే, దాని ప్రధాన సూత్రము లేవియో తెలిసికొన కుతూహలముతో రాజదూత ఆసమావేశము నేర్పరచి, తానెఱిగిన పండితులను, ద్వారనికుల నందరిని దాని కాహ్వానించెను. అందు భాండో తత్వాలమందు ప్రాధాన్యము నొంది యుండిన దార్శనిక వాదముల నన్నిటిని ఖండించి, తాను క్రొత్తగా నిర్మించుచున్నాడ నని చెప్పుచున్న దర్శనమును విపులముగా వివరించుటకును దాని నూతనత్వమును స్థాపించుటకును ప్రయత్నించెను. డెకార్ట్ తప్ప సమావేశమునకు వచ్చిన ప్రతివాడు దానిని విని భాండోను ఎంతగనో ప్రశంసించిరి; ఆనూతన వాదము వారినందరిని ఆకర్షించెను. డెకార్ట్‌యొక్క తాటస్థ్యమును, ప్రశంసా విముఖత్వమును చూచి, ఆ సమావేశమున కాహ్వానితుడై వచ్చిన కార్డినల్ బెరుల్ డెకార్ట్‌ను గూడ ఆ దర్శనమునుగూర్చి తన

అభిప్రాయము తెలుపుమని అడిగెను. తనకంటె పండితులైన అంతమంది పెద్దలచే ప్రశంసింపబడిన ఆవాదమును గూర్చి తాను చెప్పవలసిన దేమియు లేదని డెకార్ట్ తప్పించుకొనఁ దలచెనుగాని, కార్డినల్, రాజదూత, తదితరులుగూడ బలవంతపెట్టగా డెకార్ట్ ప్రసంగింపవలసివచ్చెను. ఆయన భాండో వాక్చాతుర్యమును అనర్గళధారను ప్రశంసించి, గ్రీకుల, మధ్య కాలీనుల భావపారతంత్ర్యమునుండి తప్పించుకొనుటకు అతడు చేసిన ప్రయత్నమునుగూడ కొనియాడి,సత్యమునకు సత్యాభాసమునకు (Verisimilitude) గల భేదమును గ్రహించిననేతప్ప స్పష్టమైన నిశ్చితజ్ఞాన మేర్పడదనియు,అట్టివివేకము లేనందుననే సత్యాభాసము నంతమంది విద్వాంసు లాదినమున సత్యమని గ్రహించిరనియు చెప్పెను. సత్యమనినమ్మబడిన దేనినైనను అనేకవిధములుగ తర్కములతో ఖండింపవచ్చుననియు, అస్పష్ట అసత్యముగా ఎంచబడినదానినికూడ తర్కములతో బుజువు చేసి సత్యముగా తోపింపచేయవచ్చుననియు దృష్టాంతములతో ఆయన చూపెను. గణితశాస్త్రమం దుపయోగింపబడు పద్ధతి ననుసరించి తక్కిన విషయములందుగూడ స్పష్టము నిశ్చితము నగు జ్ఞానము సంపాదింపగల్గి సందేహమున కేమాత్రము తావులేని జ్ఞానమును సంపాదింపగల్గి సందేహమున కేమాత్రము తావులేని దర్శనమును నిర్మించగలిగినతప్ప, ప్రాచీనదర్శనముల ననిశ్చితములుగా నిరాధారజల్పములుగా త్రోసివేసి తాదృశమైనదే మరొక ఊహాబోధితమగు అనిశ్చితవాదమును నిలువ

దీయుటలో ప్రయోజనములేదని డెకార్ట్ అక్కడనున్న అందరికిని తెలుపగల్గెను. ఎల్లరు డెకార్టుయొక్క తార్కికపటిమను, ప్రతిభను వాగ్ధోరణినిచూచి ముగ్ధులై ఆయన అభిప్రాయముల వైపునకే మ్రొగ్గిరి. అందులో ముఖ్యముగా కార్డినల్ బెరుల్‌కు డెకార్ట్ చెప్పినదంతయు బాగుగా నచ్చుటచే మరొకమారు ఏకాంతమందు విపులముగా ఇదంతయు వినుటకు అవకాశ మీయమని ఆయన డెకార్ట్‌ను కోరెను.

కార్డినల్ బెరుల్ ఆదేశము:—

తర్వాత కొన్ని దినములకు డెకార్ట్ కార్డినల్ బెరుల్ సన్నిధికివెళ్ళి, అంతవరకు దర్శనశాస్త్రమం దుపయోగింపబడు చున్న పద్ధతులు తనకెట్లు అసంతృప్తికరములుగా నున్నదియు, గణితశాస్త్రమం దుపయోగింపబడు పద్ధతినే ఇందుకూడ ఉపయోగించిన ఎట్లు లాభకరమైనదియుచెప్పి, తద్వారా పొందనగు కొన్ని సిద్ధాంతములనుచూపి, వీటిని విస్తరించి వైద్యశాస్త్రమునకు, యంత్రశాస్త్రమునకు (Mechanics) కూడ నన్వయించుటవలన ఆశాస్త్రములు అపారవృద్ధి నొందుననియు, తన్మూలముగా మానవలోకము నిరామయముగా ఆరోగ్యముగా నుండుటకును, శ్రమలేకుండ సుఖజీవితము గడపుటకును వీలగుననియు చెప్పెను. కార్డినల్ బెరుల్ డెకార్ట్ కనిపెట్టిన ప్రమాణపద్ధతి ప్రాముఖ్యమును, దాని ఉపయోగమును గ్రహించి, డెకార్ట్ సర్వవిధముల సమర్థుడని ఎంచి, ఈ మహా

కృషిని నిర్వహించుట ఆతని విధియనియు, ఈశ్వరు డంతటి బుద్ధిసూక్ష్మత, ప్రతిభ ప్రసాదింపగా, వాని నుపయోగింపక మానవలోకమునకు వాని ఫలితముల నంచీయకపోయినచో, అది భగవదపరాధమే అగుననియు డెకార్ట్‌కు నచ్చచెప్పి, అంతఃకరణసాక్షిగా ఈవిధి నిర్వహించుకొనుమని డెకార్ట్‌కు బోధించెను.

బెరుల్ : భక్తిసంప్రదాయము:అగస్టీన్ ప్రభావము:

కార్టినల్ బెరుల్ మహాభక్తుడు. ఆయన 1611 లో ఆరోటూరియను క్రైస్తవ సన్న్యాసుల సంఘమును స్థాపించి, క్రైస్తవ గురువులలో భక్తిప్రచారమును తదనుగుణజీవితమును పెంపొందింపసాగెను. తన్ను తాను మరచి కేవలము ఈశ్వర ప్రత్యర్థమే కర్మలను చేయుట భక్తికి తాత్పర్యమనియు, మనము బ్రతుకుచున్నది భగవదర్థముగాని మనకొరకు గాదనియు, జీవితాదర్శము, గమ్యము భగవంతుడే అని బెరుల్ బోధించెడివాడు. జ్ఞానముకంటె భక్తికి ప్రాధాన్యము, తార్కిక వాదములకంటె అంతర్వీక్షణమునకు ప్రాముఖ్యము, నరుని సేచత్వమును భగవంతుని మహామహిమత్వములు సర్వ శక్తిమత్త్వమును ప్రబోధించు సిద్ధాంతములు కల్గిన బెరుల్, ఆయన అనుచరుడు జిబియుఫ్‌లు ప్రచారముచేసిన సంప్రదాయము స్లేటో, అగస్టీనుల సిద్ధాంతములకు సన్నిహితముగను, అరిస్టోటిల్ తామస్ ఎక్వైనస్‌ల సిద్ధాంతములకు కొంత వ్యతిరేకముగ ఉండుటచే, అరిస్టోటిల్ ఎక్వైనస్‌ల వాదములు ప్రచారములోనున్న ఆ దినములలో ఈ భక్తి సంప్రదాయ స్థాపన పలువురకు కొంచెము క్రొత్తగను అనిష్టముగనుండెను. ఈ సంప్రదాయ స్థాపకుడగు బెరుల్‌తో అతి సన్నిహితసంబంధము, జిబియుఫ్‌తో స్నేహము, డెకార్ట్‌పై అగస్టీను ప్రభావమునకు కారణమాయెను. మానవుడు నిర్ణయమునకు వచ్చుటలో అతనిలోని ఇచ్ఛ, లేదా, సంకల్పము (Will) వహించు ప్రముఖపాత్ర, జ్ఞానోపార్జనలో మనస్సు కేవలము నిష్క్రియమగు స్థాణువుకాదనియు, దానిలో క్రియాశక్తి గలదనియు చెప్పును. "చింతించుచున్నాను కాబట్టి నేనున్నాను" అను నిర్ణయమునకు వచ్చుటలోను డెకార్ట్ దర్శనమందలి అగస్టీను ప్రభావము కన్పడుచున్నది.

మహాభక్తుడును, పుణ్యాత్ముడును అగు బెరుల్ ఆదేశమును శిరసావహించి, నూతనదర్శన స్థాపనచేసి, తన్మూలముగా శాస్త్రవిజ్ఞాన విస్తరణము గావించి లోకహితమునకు పాటుబడుటయే తన జీవితలక్ష్యముగను, విధిగాను, డెకార్ట్ నిశ్చయించుకొనెను. స్వప్నములద్వారా క్రిందట తనకువచ్చిన ఆదేశమును, నేడు బెరుల్‌ద్వారా ఈయబడిన ఆదేశమును కూడ ఈశ్వరాజ్ఞలుగా డెకార్ట్ తలచెను. భగవంతుని తర్వాత బెరుల్ అన్ననే డెకార్టునకు గౌరవము. 1626–8 లలో బెరుల్, జిబియుఫ్‌లతో అత్యంత సన్నిహితుడుగా

నుండి, 1628 లో ఈ ఆదేశమును పొందెను. ఆసంవత్సరము లోనే డెకార్ట్ ఈశ్వరుని గూర్చిన తన భావములను పరిపక్వము చేసికొనెను.

ప్రమాణపద్ధతి కాధారమేది?

1620 నుండి డెకార్ట్ సర్వశాస్త్రములలోను నిశ్చితజ్ఞానము నీయగల ప్రమాణపద్ధతి (Method) ని వెదకుచు కొన్ని నిర్ణయములకు వచ్చినాడని, వానిని గూర్చియే ఆలోచించుచు ఉండెనని చెప్పియున్నాము. 1628–29 సంవత్సరపు శీతాకాలమందు ఈమీమాంసాఫలితమంతయు డెకార్ట్ (Regulae) "నిబంధనలు" అను గ్రంథరూపముగా చాలవరకు వ్రాసెను, కాని దానిని ఆయన పూర్తిచేయుటగాని తన జీవితకాలమందు ప్రచురించుటగాని జరుగలేదు. కాని దాని లిఖితప్రతిని పలువురు విద్వాంసులు చూచుటయు, హాలండులో దానికి విస్తారప్రచారము జరుగుటయు సంభవించెను. సుప్రసిద్ధ బ్రిటిష్ దార్శనికుడు, ఉదారరాజకీయతత్త్వము (Liberal Political Philosophy) నకు, ప్రజాతంత్రము (Democracy) నకు పునాదులు వేసిన లాక్ కూడ దానిని చదివెననుట కాధారముగా దాని ప్రభావము ఆయన వ్రాసిన వ్యాసమందు (Essay) చాలచోట్ల సుస్పష్టముగా కనబడుచున్నది. జ్ఞానమునొక్క స్వభావమెట్టిది? దానికిని జ్ఞేయపు స్వభావమునకును గలసంబంధమెట్టిది? అను

సమస్యను గూర్చియు అంతర్దృష్టి (Intuition) ని గూర్చియు డెకార్ట్‌కు 32 వ ఏడు వచ్చునప్పటికి గల ఊహలు "నిబంధనలు" అను గ్రంథమందు పొందుపరచబడినవి. అందరిచేత నిరభ్యంతరముగా అంగీకరింపబడు సుగమములైన స్వయంసిద్ధ విషయములందే నిశ్చయత్వముండుననియు, కాబట్టి ఆవిషయములు అందరు ఎఱిగిన సనాతన సత్యములనియు, వీటినుండి క్లిష్టవిషయములకు పోవునప్పుడు మనము వేయు ప్రతిముందడుగు సందేహరహితముగా నుండవలెనని డెకార్ట్ అంసిద్ధాంతీకరించెను. అయితే, స్పష్టము, విశదము అయినదే సత్యము అను సూత్రముపై ప్రమాణపద్ధతి ఆధారపడినచే శాస్త్రములలో సద్యఃపురోగతి యుండునని చూపించిన డెకార్ట్‌కు, క్రొత్తసమస్య ఒకటి ఉదయించెను. ఈ సూత్రమును ఋజువుచేయుట ఎటుల? ఇది కేవలము ఊహామాత్రమయినచో, ఆయన ప్రమాణపద్ధతికి గట్టిపునాది యుండదు. కాక, అంతకు కొంచెము పూర్వమే మోన్‌టేన్, చారోన్‌లు నిశ్చితజ్ఞానము అసలు అసంభవమను వాదమును లేవదీసియుండిరి. ఇట్టి పరిస్థితిలో డెకార్ట్ సూత్ర మేయాధారముపై నిలువబడగలదు? ఆయన కనిపెట్టిన ప్రమాణపద్ధతిని తద్ద్వారమునసే ధృవపరచబూనుట అనవస్థాదోషమగును. కాబట్టి, డెకార్ట్ దీనిని గురించి ఇంకను ఆలోచించవలసి వచ్చెను. ఆయన అన్వేషణకు పరిసమాప్తి లేదాయెను.

ఈపాటికే ఆయన "ఒలింపికా", "స్వీయఆలోచనలు" అను రచనలుకూడ చేసెను; వీటియందు ఆయన సత్యాన్వేషణ చరిత్ర, అప్పుడప్పుడు తోచిన భావములు, చేసిన సిద్ధాంతములు ఉండెను. ఇప్పుడవి శిలమైపోయినవి, వాని ఖండములు మాత్రము బెయిలెట్ వ్రాసిన డెకార్ట్ జీవిత చరిత్రలో క్రోఢించి అనువాదములుగను, లైబ్‌నిజ్ అను సుప్రసిద్ధ జర్మన్ తత్త్వవేత్త చూచి వ్రాసికొనిన లాటిన్ మూలప్రతులలోను అవశిష్టములు.

డెకార్ట్ లక్ష్యము:

శాస్త్రములందు పరిశోధనలు, నూతనదర్శనస్థాపన, తన్మూలముగా మానవులు ఐహికసుఖములన్నిటిని విశేషశ్రమ లేకుండ అనుభవింపవలెననునదే తన జీవిత పరమాశయముగా డెకార్ట్ భావించెను. పైగా ఇది భగవంతుడు తనపై వేసిన బాధ్యతయని నమ్మెను. శారీరక, మానసిక రోగరహితులై, వీలైన జరామరణరహితులై, సర్వవిధములగు సౌఖ్యములతో మానవు లుండగల్గుటకు మార్గమేది? ప్రకృతినిజయించి దానికి యజమానుడై మానవు డెట్లు శ్రమరహితముగా జీవించనగును? ఇవియే డెకార్ట్‌కు పరమలక్ష్యములు. అందుచేతనే ఆయన వైద్యశాస్త్రమందు విశేష పరిశోధనలుచేసెను. అయితే, ఆయనదృష్టిలో చికిత్సాశాస్త్రము మాత్రమే వైద్యశాస్త్రము కాదు. మనుష్యులను ఎక్కువ

జ్ఞానవంతులుగా, సమర్థులనుగా చేయగల్గునదియే వైద్యశాస్త్రము. మానసికాభివృద్ధి దేహారోగ్యముపైన, దార్ఢ్యముపైన ఆధారపడియున్నది. శరీరనిర్మాణశాస్త్రము, గర్భశాస్త్రము ఈసమస్యల పరిష్కరించుట కవసరము. పూర్ణమానవుడే నైతికపథమందగ్రసరుడు కాగల్గును; రోగరహితుడు సంతోషచిత్తుడు అయిన మానవుడే పూర్ణమానవుడు. ఇవి జ్ఞానవంతునికే సాధ్యము. అప్పుడేప్రకృతిని జయించి రోగములను, ఈతిబాధలను, కష్టములను నివృత్తిచేసికొనగల్గెదము. ప్రకృతిని జయించుటకును, సునాయాసజీవితము గడపుటకును యంత్రశాస్త్రము ఆవశ్యకము. ఈవిధముగా, వైద్య, యంత్ర నీతిశాస్త్రములు (Medicine, Mechanics, Morals) సమన్వితములగును. ఇది ఆయనను పురిగొల్పిన ఆదర్శము.

సంగపరిత్యాగము: హాలెండుకు వెళ్ళుట:

ఈశాస్త్రీయకృషి, దార్శనిక చింతన నిరాబాధముగా అహర్నిశలు చేసికొవలెనన్న ప్యారీయందుండినచో అక్కడ తనమిత్రులయు, పరిచితులయు, రాకపోకలు, వారితో సరససల్లాపములు, ఇతర కార్యక్రమములు అడ్డంకులగునని ఎంచి, ఏవిధమైన ఉద్యోగములుగాని, పెండ్లిపేరంటములుగాని అపేక్షింపక, సత్యాన్వేషణార్థము, ప్రచారార్థము దేవుడు తనను సృష్టించినాడని నమ్మి, డెకార్ట్ 1628 సంవత్సరపు చివరలో ఫ్రాన్సును వీడి హాలండు దేశమునకు వెళ్ళి అక్కడ

స్థిరనివాస మేర్పరచుకొనెను. హాలెండు వేడి దేశము కానందున దాని శీతోష్ణస్థితి మానసికవ్యాపారమున కనుకూలతను, తగు ఉత్తేజమును ఈయగలదనియు, ఆకాలమందు రాజకీయశాంతి, సుస్థిరప్రభుత్వము కలిగి మతసహనమునకు ఆటపట్టగుటచే, హాలండులో విచారస్వాతంత్ర్య ముండుననియు, ఈకారణములచేతనే పలుదేశములనుండి అచటికి చేరిన విద్వాంసులతోను, శాస్త్రపరిశోధకులతోను సహవాసప్రాప్తి, సంభాషణల కవకాశము దొఅకుననియు డెకార్ట్ హాలండుకువెళ్ళి, అచట సౌఖ్యముగా ఆధ్యాత్మిక అనాసక్తితో నుండసాగెను. 1628 చివరలో వెళ్ళి 1649 వరకు అచటనే ఉండెను.

డెకార్ట్ శాస్త్రీయ ప్రయోగములు: ఫలితములు:

హాలండులోనున్న 20 ఏండ్లు ఆయనకొక ప్రయోగశాల, ఒకతోట ఉండెడివి. అద్దముల, రంగులు, ప్రకాశములను గూర్చి; శరీర నిర్మాణము, గర్భనిర్మాణాభివృద్ధులను గూర్చి; వనస్పతి జీవశాస్త్రము (Science of plant-life) ను గూర్చి పరిశోధనచేయుటకు వలయు సౌకర్యము లీ ప్రయోగశాలయందును, తోటయందును ఉండెడివి. ఆవుల పిండములు, పొదగబడుచున్న కోడిగ్రుడ్లు ఆయన గర్భజీవాభివృద్ధి పరిశోధనల కెక్కువగా ఉపయోగపడెడివి. జంతుశరీరములను మూల్యమునకుకొని, శస్త్రపరీక్ష చేసెడివాడు. కన్ను, మెదడు, ఊపిరితిత్తులు, గుండె – వీనిపై ఆయన హెచ్చుగా పరిశోధ

నముచేసి చూచెను. జీవితపు చివరి ఆరేండ్లలో ఆయన పరిశోధనలు మరింత హెచ్చుగా చేసెను. "జంతువుల ఉత్పత్తి" "మానవ శరీరవర్ణన", "గర్భ నిర్మాణ విధానము" మొదలగు జీవశాస్త్ర విషయిక గ్రంథముల వ్రాసెను.

డెకార్ట్ పనిచేసిన విధము:

ఆయనకు నిత్యము ప్రాతఃకాలమునసే మేల్కొని, దాదాపు మధ్యాహ్నమువరకు శయ్యపైనుండి లేవక పయిం డియే దార్శనిక విషయములను గూర్చి ఏకాగ్రతతో చింతన చేయుటయు, అనుదినము కొన్నిగంటలు మాత్రమే విశేషముగా మానసిక పరిశ్రమచేసి తరువాత కాలమంతయు విశ్రాంతితోను, వినోదములందు గడపుటయు, పరిపాటి. ఏకాగ్రతతో నిట్లు ఆలోచించు సమయములందే ఆయనకు సృజనాత్మకశక్తిగల అనేక నూతన సత్యములు, ఊహాలు హఠాత్తుగా స్ఫురించుచుండెను. తరువాత ఎన్నో నెలలు, సంవత్సరములు వానిని పరిపరి విధముల పరీక్షించి విస్తరించి దార్శనిక సిద్ధాంతములుగనో, శాస్త్రీయసిద్ధాంతములుగనో ప్రవచించుట ఆయనపద్ధతి. ఆ చింతన ప్రగాఢము ఏకాగ్రము కావుననే, ఆయన కొన్నిగంటలసేపు మాత్రమే చింతింప గల్గెడివాడు. నూతన సత్యస్ఫురణము కాకపోవునప్పుడును ఆయన కొన్నిదినముల వరకును ఒకానొక ఆవేశస్థితిలోనే నుండెడివాడు.

"విశ్వ" మను గ్రంథరచన :

హాలెండుకు వెళ్ళిన మొదటి ఒకటిరెండేండ్లు ధార్మనిక విషయములను గూర్చి, తాను కనిపెట్టిన ప్రమాణపద్ధతికి సంశయరహిత ఆధారమునుగూర్చి ఎక్కువగా మననముచేసి కొన్ని నిర్ణయములకు వచ్చుట, వాటిని కొంతవరకు గ్రంథస్థముచేయుట జరిగెను, గాని త్వరలోనే ఆ పని నాపి ఆయన మరొక విషయముపై దృష్టిమరల్చెను. తాను కనిపెట్టిన ప్రమాణపద్ధతి నుపయోగించి భౌతికశాస్త్రనిర్మాణము జరుపు ప్రయత్నమే ఇది. ఈ పద్ధతిని ఇంద్రియ విషయములన్నిటికిని వర్తింపచేసి, విశ్వస్వరూపమెట్టిదో కనుగొని దానిని వివరించుటే కృషిగా పెట్టుకొని, 1633 నాటికి "విశ్వము"(Monde) అను గ్రంథరచన పూర్తిచేసి దానిని ప్రకటింప నాతడు ప్రయత్నింపసాగెను.

అందలిభౌతికశాస్త్రవాదము :

ఈ గ్రంథమందలి వాదమిది : విశ్వమంతయు నిరపవాద నైసర్గిక సూత్రముల ననుసరించి నడచుచున్నది. ప్రకృతిలోని క్రియాశక్తియంతయు గతి (Motion) యే, అది నిర్ధారితనియమములను బట్టియే సాగుచుండును. అదితప్ప ఏకార్యమునకు వేరు కారణములేదు. పదార్థముల చలనము గాని, జంతువులయందలి చరత్వముగాని అంతయు గతివిధానములే. జంతువులన్నియు వేదన (Feeling) గాని, నైతన్య

ముగాని లేనియంత్రములు. మనస్సునకు తనకుదానుగా భావములను సృజించు శక్తిలేదు. దానికి అభివ్యక్తమైన జ్ఞాన "విషయముల" ("Objects" of Knowledge) నది నిష్క్రియమై గ్రహించును. భావనాశక్తియు, స్మృతియుగూడ దీని కపవాదములు కావు. విశ్వమందు ప్రతివస్తువుయొక్క స్థానము, చలనము - అది గ్రహములు, వాని గతులు కానిండు, స్థిరనక్షత్రములు కానిండు, చీమనడక కానిండు— నియంత్రితములే. ఈ విధముగా విశ్వస్వరూపమును సాంగోపాంగముగా విపులరీతిన వర్ణించి, డెకార్ట్ ఆగ్రంథమున కోపర్నికన్ వాదమును — అనగా భూమి సూర్యుని చుట్టు తిరుగుచున్నది, భూమి విశ్వమునకు కేంద్రము కాదు అనుదానిని — బలపరచెను. స్థావరజంగమ సేంద్రియ నిరింద్రియమగు యావద్విశ్వము — మనుష్యుని ఆత్మతప్ప — యంత్రము వంటిదనియు, గతిసూత్రములను బట్టియే (Laws of motion) విశ్వోత్పత్తిని విశ్వప్రక్రియను — జంతువులయు మానవదేహములయు ఉత్పత్తి, అభివృద్ధి ప్రక్రియలనుకూడ — అర్థముచేసికొనవచ్చుననియు, అందు డెకార్ట్ చూపించెను. ఈశ్వరుడు మన మనస్సుచే గ్రాహ్యుడయ్యు, దానిచే సర్వదా అగ్రాహ్యుడు ; మనుష్యునిగూర్చి మనకు తెలిసిన దానినుండి ఈశ్వరునిగూర్చినస్యాదృశ్యజ్ఞానము (Analogical knowledge) అసంభవము; తత్కాలమందు ప్రచారములోనున్న దర్శనములందు 'శాశ్వత సత్యము' (Eternal truths) లనబడునని

(రెండు రెండ్లు నాలుగు ఇత్యాదులు) మనకు నిస్సంశయము లైనను స్వతఃప్రమాణములు కావు; — అను సిద్ధాంతములను గూడ డెకార్ట్ ఆ గ్రంథమందు ప్రతిపాదించెను.

గెలీలియోకు పట్టిన దురవస్థ:

ఈ ఉద్గ్రంథమును ప్రకాశకులకుపంపు సమయమునసే తన స్నేహితుడగు మెర్సీన్ ద్వారా, గెలీలియో వాదములను క్రైస్తవమతసంస్థ సత్యవిరుద్ధములుగా ఘోషించి, ఆయనను శిక్షించినదనియు, ఆయన పుస్తకమును బహిరంగముగా తగులబెట్టినదనియు డెకార్ట్ వినెను. భూమి విశ్వమునకు కేంద్రమను ప్రాచీన ఖగోళశాస్త్రీయవాదమును ఖండించి, దాని నుండి అనేక నిగమనములు చేయుటవలన గెలీలియో కీదురవస్థ ప్రాప్తించెను. ఇట్టి నూతనవాదనలు క్రైస్తవ వేదప్రమాణమునకు విరుద్ధములగుటచే సత్యములు కాజాలవు; అరిస్టోటిల్ చేసినట్టి, మధ్యకాలీన విద్వాంసులచే సమాదరింపబడినట్టి, వాదములకు విరుద్ధములగుటచే గెలీలియో ఇత్యాదుల వాదములు కేవలము మానవబుద్ధిపై నాధారపడిన తర్కమునకుకూడ విరుద్ధములు, అసత్యములు—అని క్రైస్తవధర్మసంస్థ (True Church) తీర్మానించెను.

నాటిమతావేశములు:

డెకార్ట్ ఇది విని ఆశ్చర్యచకితుడాయెను. తానుకూడ ఇట్టి వాదమునే సమర్థించెను కదా; తన పుస్తక ప్రచురణము

జరిగినచో దాని కీగతియే పట్టునని ఆయన తలచెను. గెలీలియో పుస్తకమును బీక్‌మెన్ వద్ద సంపాదించి చదివి చూచి, తాను చేసిన అనేక నిర్ణయములను గెలీలియోకూడ స్వతంత్రముగా చేసి యున్నాడనికూడ గ్రహించెను. డెకార్ట్ నాల్గేండ్లవాడై యుండ, బ్రూనో యను తత్త్వవేత్త తన ఈశ్వరవాదములోనికి కోపర్నికస్ చేసిన సిద్ధాంతముల నిమిడ్చినందులకు, బైబిలులోవర్ణింపబడిన సృష్టిక్రమగాథ పౌరాణికకల్పన యని సూచించినందులకు, ప్రతికియుండగనే రోములో కాల్చివేయబడెను. 20 ఏండ్ల పిదప ఒకానొక విధమగు సహజవాదము (Naturalism) ను ప్రతిపాదించినందులకు ఫ్రాన్సులోని టీలోస్ ప్రాంతమున వీనిని తగులబెట్టబడెను. తరువాత సంవత్సరము మోంట్‌పిల్లియర్‌లో ఫొంటీనియర్‌కు ఈగతియే పట్టెను. నాస్తికులు, అపసిద్ధాంతకర్తలు, ప్రచారకులు అను నెపముతో నెందరో ఇంగ్లాండులో ఎలిజబత్ రాణి, ఒకటవ జేమ్సుల పరిపాలనలో కారాగారబద్ధులైరి.

పుస్తకప్రకటన మానుకొనుటకు కారణములు:

గెలీలియోపై చేయబడిననిర్ణయము క్రైస్తవులెల్లరు అవశ్యము విశ్వసింపవలసిన విషయము (article of faith) కాకపోవుటచే, దానిని నమ్మనివారికి చిత్రవధ శిక్షగా విధింపరని తెలిసియు హాలండులోనున్న తన్ను కెతోలిక్ చర్చివారియు చేయజాలదని తెలిసియు, ఈక్రిందికారణములచే డెకార్ట్ తన

పుస్తక ప్రచురణప్రయత్నము నాపెను: (1) క్రైస్తవ ధర్మ సంస్థకు విధేయుడుగా నుండుట ధర్మము. (2) గెలీలియో సంఘటనకు వెనువెంటనే తనపుస్తకము ప్రచురించినచో దాని వలన తనకు అనవసరముగా విపరీతమగు అపఖ్యాతివచ్చుట తనకుఅనిష్టము. (3) మందబుద్ధులగు జనసామాన్యమునకు సంభ్రాంతి కలిగించుటచే సత్యము చెప్పినను గ్రహింపరు. (4) విరుద్ధపరిస్థితులకు ఎదురీత ఈదుట తనస్వభావముకాదు. (5) తత్కాలమున, తనపుస్తకము వెలువడుటచే రేగు తర్కవితర్కములు, ఖండనమండనము తన మనశ్శాంతికిని నిష్పాక్షికమగు సత్యాన్వేషణకును భంగకరములు - ఇదికాక, (6) ఆయన "మానసిక వికారములు" (Passions) అను గ్రంథములో (Ecxi) చెప్పినట్లు, అగౌరవమునకు పాల్పడకుండ తన్ను తాను రక్షించుకొనుటకు వీలున్నప్పుడు జీవితము పోగొట్టుకొనుట తెలివితక్కువ. పరిస్థితులుఅడ్డము తిరిగినప్పుడు నిశ్చయమరణమును వరించుటకంటె గౌరవముగా వెనుదీయుటయో, కొంతవరకు సమాధానమునకు వచ్చుటయో మంచిది. ఇట్లాలోచించి ఆయనదానిప్రచురణ నాపికొనెను.

బైబిల్ సృష్టిగాథనుగూర్చి నఆయనఅభిప్రాయము:

డెకార్ట్ భాష్యప్రవర్తన ఇట్లున్నను ఆయనస్నేహితులలో రోసిక్రూసియన్ సంప్రదాయమునకు చెందినవారు, నిరీశ్వరవాదులుకూడ నుండిరి. బైబిల్ చెప్పినదంతయు అక్షరశ

నిజముకాదనియు, అందులోని సృష్టిక్రమగాథ నిజము కానేరదనియు, ఆయనతలచెనని తనస్నేహితులకు ఆయనవ్రాసిన ఉత్తరములు తెల్పును. సత్యమునపిహితము చేయవలెను, నేనొక ముసుగుధరించినానుఅని ఆయన చెప్పుచుండెడివాడు.

సత్యము నెట్లు ప్రకటింపవలెనను యోజన:

ఒక్క మారుగా విశ్వమునుగూర్చిన సాంగోపాంగమగు వాదమును ప్రజల ఎదుటఉంచి మతాధికారులకును, జనసామాన్యమునకును బుద్ధిభేదమును కల్గించుటకంటె, ముందు తన ప్రమాణ పద్ధతి నుపయోగించుటవలన వచ్చిన, భిన్నాభిప్రాయములకు తావులేని, ఫలితములను ప్రదర్శించి, తన్మూలముగా తన భౌతికశాస్త్రవాదపు ప్రధానసూత్రముల నెల్లరికి అంగీకారములుగ చేసినచో, తనవాదమంతయు పరస్పరానుబద్ధమగు సిద్ధాంతము కావున, అందలి ఒకభాగ మామోదించి మరొకభాగమును త్యజించుట అసంగతమగును గావున, క్రమముగా తన వాదమంతయు సర్వాంగీణముగ అంగీకరింప బడునుఅని ఆయన యోజించెను. ఈ నిర్ణయము ననుసరించితాను కనుగొనిన కొన్ని శాస్త్రీయ ఫలితములను వెలువరింపదలచెను.

శాస్త్రీయ ప్రయోగముల ఫలితములను ప్రకటింప నిర్ణయించుట:

1629 లో డెకార్ట్ కొన్ని వాతావరణ విషయిక పరిశోధనలు ప్రారంభించి, ఇంద్రధనస్సులోని వర్ణములు,

ద్వినక్షత్రభ్రాంతి (double suns), సూర్యాభాస (Parhelion) అను ఐహలౌకిక (Sublunar) సంఘటనలను వివరించు పుస్తకమును వ్రాయ మొదలిడెను. దానినే "ఉల్కలు" (Meteors) అను పేరుతో, 1635 లో సవరించి వ్రాసి, కొన్ని నూతనవిషయములనుకూడ అందు చేర్చెను. 1630 లో ఆయన వర్ణమునుగూర్చియు, ప్రకాశమునుగూర్చియు ఒక పుస్తకమును ప్రారంభించి, 1635 లో దానిని సవరించి, అందు కాంతికటకములను నిర్మించుటలో తాను కనుగొనిన విషయములనుకూడ చేర్చెను. దీనికాయన "ప్రకాశశాస్త్రము" (Dioptric) అను పేరుంచెను. 1635 లో 'విశ్వ' మను పుస్తక ప్రకటనము ఆపినంతనే, ఈ రెండు గ్రంథములను ఒక ఉపోద్ఘాతముతోకూడ ప్రకటింపవలెననియు, ఉపోద్ఘాతమందు శాస్త్రీయ పరిశోధనలలో తాను ఉపయోగించిన ప్రమాణ పద్ధతిని వివరింపవలెననియు నిశ్చయించెను.

ఉపోద్ఘాత సహితముగా వానిని ప్రకటించుట:

దీని ఫలితముగా 1636 లో "ఉల్కలు?" అను పుస్తకము ముద్రణలో నుండగా, రేఖాగణితముపై డెకార్ట్ ఒక గ్రంథమును వ్రాసెను. అందు కొన్ని గణితశాస్త్రీయ విషయములపై తాను 20 ఏండ్లుగ చేసిన కృషి ఫలితమును వ్యక్తముచేసెను. తన ప్రమాణ పద్ధతి నిజస్వరూపము ఇంకను బాగుగ తెలియుటకు, దీనినికూడ పై రెండు పుస్తకములతో

గలిపి ప్రకటింపవలెనని అప్పటికప్పుడు నిశ్చయించి, అటుల చేసెను. ఆమూడు పుస్తకములను, వీటి కుపోద్ఘాతరూపముగా తాను 1636 – 37 లో వ్రాసిన "ప్రమాణపద్ధతిపై ప్రసంగము"తో గలిపి ఆయన 1637 లో లౌడెన్‌లో ప్రకటించెను. ఇది ఆయన ఫ్రెంచి భాషలో వ్రాసెను. దీని లాటిన్ అనువాదము 1644 లో ఎటియన్ డికోర్సెల్ అను ప్రొటెస్టాంటు క్రైస్తవమతస్థుడు చేసి ప్రకటించెను. ప్రస్తుతము మేము అనువదించిన దీ ఉపోద్ఘాతము మాత్రమే.

"రేఖాగణిత"మను గ్రంథము: గణితశాస్త్రమందు దానికి గల స్థానము:

ఇందు డెకార్ట్ వ్రాసిన "ప్రకాశశాస్త్రము" సంబంధి సిద్ధాంతములను న్యూటన్ కృషియు, డెకార్ట్ "ఉల్కలు" లో చేసిన సిద్ధాంతములను, తర్వాత శాస్త్రీయప్రయోగపద్ధతుల ద్వారా కనుగొనబడిన ఫలితములును మూలకు త్రోసినవి. కాని రేఖాగణితముపై వ్రాసిన గ్రంథము మాత్రము గణితశాస్త్రమందు చిరస్థాయియగు అభివృద్ధిని విప్లవమును తెచ్చుట వలన, శాశ్వతోపాదేయ గ్రంథముగ నున్నది. గణితశాస్త్రము కేవలము విషయాకృతులను మాత్రమే అధ్యయనము చేయు శాస్త్రము (formal science). అందు అధ్యయనము చేయబడునది "సమానత" (equal), "అనుపాతికము" (Proportional to) మొదలగు సంబంధముల కున్న గుణముల

పర్యవసానమేగాని, ఆసంబంధములచే వ్యాప్తములగు రాసుల యొక్క విశేషముల పర్యవసానముకాదు. కాబట్టి, గణిత శాస్త్రమునకు సంబంధితములగు రాసులు (terms) రేఖలైనను, రూపములైనను (figures) సంఖ్యలైనను, పరిమాణములైనను ఒకటియే. అందలిసామాన్యసిద్ధాంతములు(theorems) వీని అన్నిటికి సమానముగ వర్తింపచేయవచ్చును. సంబంధిత పదార్థముల ప్రత్యేక విభిన్న విశేషములపై ఉపపత్తి (Proof) ఆధారపడదనియు, ఒక రకపు సంబంధిత పదార్థముల గూర్చి నిర్ధారితమైన ఫలితములను, మరొకరకపు సంబంధిత పదార్థముల సంబంధమునుగూర్చిన ప్రతిపాదనలుగా పరివర్తనము చేయవచ్చుననియు దీనినిబట్టి తేలుచున్నది. ఉదాహరణకు బీజగణితమందలి, సంఖ్యాగణితమందలి సంబంధములను రేఖాగణితములో వ్యక్తీకరింపవచ్చును. ఇది డెకార్ట్ తన రేఖాగణితముపై వ్రాసిన గ్రంథములో చేసిన సిద్ధాంతముల ఫలితము.

జనభాషలో దార్శనిక శాస్త్రీయ చర్చలు చేయుట: దాని ఫలితము:

ఈమూడు గ్రంథములకు ఉపోద్ఘాతములుగా డెకార్ట్ వ్రాసిన "ప్రమాణపద్ధతిపై ప్రసంగము" నేటికిని దార్శనిక సాహిత్యమందు అమూల్యమగు సంప్రదాయ గ్రంథము (Classic) గా నున్నది. అదివరకు తత్త్వశాస్త్రగ్రంథము

లన్నియు లాటిన్‌లోనే వ్రాయబడుచుండెడివి. బరిస్మ్, కామస్ ఇరువురుదప్ప డెకార్ట్ ముందువారెవరు ఫ్రెంచిలో తాత్త్విక, శాస్త్రీయ వివేచనలు చేయలేదు. పూర్వసంప్రదాయమును, ప్రాచీన మధ్య కాలీన దర్శన శాస్త్రములను తెలిసినవారే దార్శనిక సమాలోచనలు చేయనక్కరలేదు. బుద్ధిమంతుడైన తనకుతానై ఏది సత్యము? దాని నెట్లు పొందనగును? అదిఏది? అను సమస్యలను గురించి చింతించవచ్చును. అట్టి చింతనలను వ్యక్తముచేయు గ్రంథములను చదివి అర్థము చేసికొనవచ్చును, అని నమ్మియే డెకార్ట్ తాత్త్విక సమాలోచనలను ప్రజలభాషలో చేసెను. ఫ్రెంచిభాష సూక్ష్మవిషయములను గూర్చి, శాస్త్రీయ విషయములను గురించి చర్చించుటకు మంచి సాధనమగుటకు, ఫ్రాన్సుదేశమందు నేటికిని గల దర్శన శాస్త్రమన్న గల ప్రేమకును, తత్త్వశాస్త్ర ప్రచారమునకును, డెకార్ట్ వేసిన ఈ బీజమే కారణము.

"ప్రమాణపద్ధతిపై ప్రసంగము"లోని విషయములు:

"ప్రమాణపద్ధతిపై ప్రసంగము" ఆరు భాగములుగా విభక్తము. మొదటిదానిలో డెకార్ట్ తన విద్యాభ్యాసమును, తాను ఆర్జించిన పాండిత్యమును, యౌవనకాలమందలి తన భావములను సమీక్షించినాడు. రెండు, మూడు భాగములలో తర్క, నీతిశాస్త్రములతో సంబంధించిన విషయములును, ఆతడు 23వ ఏట, 1619 లో Poele లో ఉన్ననాడు కలి-

గిన ఆలోచనలును ఇముడ్పబడినవి. 1628 - 29 లో హాలెం డుకు తానువచ్చిన క్రొత్తలో, తన ప్రమాణ పద్ధతి కాధార యోగ్యమగు తత్త్వశాస్త్రముకొరకు తాను చేసిన మనన ఫలి తము నాల్గవభాగమందు కలదు. శారీరిక ప్రక్రియలను, రక్తప్రసరణను, యంత్రశాస్త్రసూత్రానుసారముగా ఐదవ భాగమందు వివరించినాడు. 'విశ్వ' మను గ్రంథములో విపులీకరించిన ప్రకృతిని గూర్చిన భౌతికశాస్త్రవాదము కొంత వరకీభాగమున సంగ్రహింపబడినది. ఆరవభాగము పై విష యాలను సమీక్షించి ఈ పుస్తకమును ప్రకటించుటలోని తన ఉద్దేశ్యమును, తన భవిష్యత్కార్యక్రమమును, మానవ శ్రేయస్సునకును శాస్త్రముల అభివృద్ధికిని చేయవలసిన ప్రణాళికను చెప్పుచున్నది.

క్రీస్తుసభతో వివాదము:

1640 లో ఏసుక్రీస్తు సంఘ సభ్యుడగు బోర్డిన్ క్లేర్ మోంట్ కళాశాలలో తానిచ్చు ఉపన్యాసములో డెకార్ట్ భౌతికశాస్త్రవాదమును ఖండింప ప్రయత్నించెను. దీనివలన డెకార్ట్‌కు కోపోద్రేకము కలిగెను. ఏసుక్రీస్తు సంఘమునంతను రంగమున కీడ్చి ఆతడు తీవ్రవాదోపవాదములలోనికి దిగెను. అరిస్టాటిల్ దర్శనానుయాయులు, డెకార్ట్ అనుచరులు — ఇట్లు రెండుపక్షములేర్పడి ఖండనమండనములు బయలుదేరెను.

స్వపక్షబలముకై ప్రయత్నము:

అరిస్టాటిల్ ప్రమాణమును గ్రహించువారితో తనకు సిద్ధాంతవైరుధ్యము వచ్చుటచే, స్లేటోనుఅగష్టీనును అనుస రించువారితో తాను సన్నిహితుడైనచో, తనపక్షమునకు బలము చేకూరునని, డెకార్టు వారిసిద్ధాంతములనై పుర్మొగ్గు టయు, వానిలో కొన్నిటిని స్వీకరించుటయు ప్రారంభించెను. దీనికి ఆయనకు చిరకాలమునుండి స్నేహితులైన బెరుల్, జిబి యుఫ్‌లుకూడా చాలవరకుకారణము. వారిది స్లేటోఅగష్టీనుల సంప్రదాయమే కదా!

"మననముల"నుగ్రంథావిర్భావము:

1628 - 9 లోనే, తనప్రమాణపద్ధతికి ఒక సుదృఢమైన ఆధారముండవలెననియు, అది తత్త్వశాస్త్రమువలననే దొరుకు ననియు, తెలిసికొని స్పష్టము నిశ్చితము అయినదే ఏలసత్యము? అను సమస్యపై నాలోచించుచు డెకార్ట్ ఒక దార్శనికవాద మును రూపొందించుకొనెను. దానిని కొంతవరకు గ్రంథస్థము చేసెను కాని, 'విశ్వ' మను గ్రంథరచనాకార్యమున మగ్నుడై దానినాపెనని చెప్పినాము. దాని నిప్పుడు బయటికితీసి, అందలి దార్శనిక వాదమును వివరించి వ్రాసి ప్రకటించినచో, బోర్డిన్ మొదలగువారి సంశయములకు, విమర్శలకు తావుండదనియు, తన దర్శనము ఈశ్వర, ఆత్మల అస్తిత్వస్థాపకమగుటచే దాని

నెవ్వరును ఆక్షేపింపజాలరని తలచి, డెకార్ట్ తన తత్త్వశాస్త్రమును "మననములు" (Meditations) అనుపేరుతో వ్రాసి, దాని తొలిప్రతులను పలువురుతత్త్వశాస్త్రవేత్తలకుచూపి వారి విమర్శలను గ్రహించి, వానిని తన సమాధానములతోకూడా ప్రకటింప నిశ్చయించెను. ఈగ్రంథము సోర్బోన్ విశ్వవిద్యాలయమందలి ఈశ్వరమీమాంసా శాస్త్రజ్ఞులకుచూపి వారి అనుమతితో వారికి కృతి నిచ్చిన, వారు అందలి సిద్ధాంతములను బలపరుచుటకు ప్రచారముచేయుటకు ఉత్సాహపడెదరనియు, ఏసు సంఘసభ్యుల వై ముఖ్యమున కిది విరుగుడుమందుగ నుండు ననియు ఎంచి అటులచేసెను. విద్వాంసులకొరకును, విశ్వవిద్యాలయములలో పఠన పాఠనార్థమును వ్రాయ సంకల్పించి ఈగ్రంథము లాటిన్‌లోవ్రాసి 1641లోను, దానిపై విమర్శలను సేకరించి వానికి సమాధానములు వ్రాసి, ఈ విమర్శలతోడను సమాధానములతోడనుగలిపి దానిని 1642లోను ప్రకటించెను. మొదటిముద్రణ ప్యారీయందును,పరిష్కృతగ్రంథము ఆమష్టర్డంలోను ప్రచురింపబడెను. 1642 లో లుయెన్స్ ప్రభువు దీనిని ఫ్రెంచిభాషలోనికి మార్చగా, డెకార్ట్ అది చాలబాగున్నదని ఎంచి తరువాత కొన్నిఏండ్లకు ప్రకటించెను; తరువాత విమర్శలు సమాధానములు కూడా ఫ్రెంచిలోనికి పరివర్తన చేయబడి డెకార్ట్‌చే సంస్కరింపబడి ప్రకటింపబడెను.

"మననములు"లోని దార్శనికసిద్ధాంతములు:

ఏది శంకించుటకు వీలున్నను స్వాత్మాస్తిత్వమును శంకించుట అసంభవము, అసంగతము కాన, అదియే సమస్తజ్ఞానమునకు ప్రథమసోపానము కావలయును. ఆత్మవేదనము అసంశయము, సంశయప్రక్రియయందే ఆత్మాస్తిత్వము ద్యోతిత మగుచున్నది. ఈ ఆత్మ – నేను – ఎవరు? అసంపూర్ణము, పరిసీమితశక్తి జ్ఞానవంతము, నిరతానంద రహితము. కాని ఆత్మకు సంపూర్ణసత్త్వమును(Perfect being) గూర్చిన భావము (Idea) నైసర్గికము. తుచ్ఛుడు, అల్పజ్ఞుడు, అసంపూర్ణుడు, పాపి అయిన ఆత్మవిశుద్ధసంపూర్ణసత్త్వమును గూర్చి చింతింపగల్గినాడన్నచో ఎక్కడినుండి ఈ భావోదయమైనది? అట్టి పదార్థము నూహింప అట్టి ఆత్మకు అవకాశమెక్కడిది, శక్తిఎక్కడిది? అట్టిభావము ఆత్మాంతస్థమైన, అది నిజముగానే విశుద్ధసంపూర్ణసత్త్వముచే ప్రసాదితము కావలసినదే. అసంపూర్ణుడు, పశుసమానుడు నగు ఆత్మ ఇట్టి సుమహత్ సంపూర్ణసత్త్వమునుగూర్చి ఆలోచింపగల్గునట్లు మార్చగలిగిన కారణమే ఈశ్వరుడు. ఆత్మ అపరిపూర్ణుడు, మందశక్తి, అల్పజ్ఞుడు, ఈశ్వరుడో సంపూర్ణుడు, సర్వశక్తి, సర్వజ్ఞుడు, అచింత్యైశ్వర్యవంతుడు, సర్వకళ్యాణగుణాస్పదుడు. అట్టి భగవంతుని, తమ్మునాము తెలిసుకొనుటే ఈశ్వరప్రసాదిత మగు బుద్ధికి పరమావధియనియు, తన పరిశోధనలన్నిటిని అట్లే ప్రారంభించితిననియు, ఈవిధముగ చేయనిచో తన భౌతిక

శాస్త్రమున కాధారము దొఅకెడిది కాదనియు డెకార్ట్ మెర్సీన్‌కు ఒక లేఖలో వ్రాసినాడు. తాదృశుడగు ఈశ్వరుడు మనలను సృజించియుండ, తన్నిర్మితమగు మన ఇంద్రియాదులు సక్రమముగా నడువవలసినదే యనియు, ప్రత్యక్షానుభవము అందుచేత గ్రాహ్యమగు ప్రమాణమే అనియు, అట్లే తదను గ్రహీతమగు మనస్సు చేయు సుసంగతమగు చింతలన్నియు సత్యములు కావలసినదే అనియు డెకార్ట్ సిద్ధాంతీకరించెను. సాధారణులగు శిల్పులు చేసిన యంత్రాదులే మరల ఎప్పుడు వారిసహాయ్య మపేక్షింపక నిర్ణీతక్రమమార్గమున నడచుచుండ, సంపూర్ణుడు, సర్వశక్తిసర్వజ్ఞుడు అగు ఈశ్వరునిచే నిర్మితమగు ఈవిశ్వము ఒకపరి సృజింపబడినతరువాత స్వతంత్రముగా నిర్ణీత విధానమున ఒకమహాయంత్రమువలె తనవ్యాపారము నెందుకు చేసికొనిపోజాలదు? దానిప్రక్రియాప్రభావముల తెలిసికొనుటకు, అర్థముచేసికొనుటకు ప్రతివిషయములోను ఈశ్వరశక్తినిగాని, ఈశ్వరేచ్ఛనుగాని వెదుకనక్కరలేదు. గడియారపు ప్రక్రియను నిర్మాణవిధానమును అధ్యయనము చేసికొనుటకు, దాని నిర్మాతనుగూర్చిన వివరములుగాని, ఉద్దేశ్యములుగాని అనవసరము. భౌతికశాస్త్రవాదముల ప్రామాణ్యము సర్వశాస్త్రములలోను ఉపయోగింపవలసిన ప్రమాణపద్ధతియొక్క ప్రామాణ్యము ఈశ్వరాస్తిత్వముపై ఆధారపడియున్నది; అయితే ప్రమాణమీమాంసతత్త్వశాస్త్రవిచికిత్స జరుగునప్పుడు తప్ప, అతీంద్రియ అబుద్ధిగోచర పదార్థములను

ప్రతిపాదించుటగాని, వానిద్వారా భౌతికప్రక్రియలను అర్థము చేసికోబూనుటగాని అసమంజసము. అట్టితత్త్వశాస్త్రచింతనలలోగూడ సందేహించుటకు అసాధ్యములైన ఈశ్వరాత్మల అస్తిత్వముగాక వేరేదియు ఉన్నట్లు భావించుట అసంగతమే. ఆత్మసంవేదనమే సంవిత్ — (self-consciousness) సర్వజ్ఞానమునకు మూలకందము. మరి ఆత్మాంతర్వీక్షణము అందు అంతర్నిహితమగు ఈశ్వరజ్ఞానమును ప్రదర్శించుచున్నది. ఈశ్వరుడు-సంపూర్ణసత్త్వము-లేకుండుట అసంగతము కాన, అట్టి సత్త్వము లేనిదే తాదృశభావోదయ మసంభవము గాన ఈశ్వరాస్తిత్వ మశంకనీయమే. ఈశ్వరాస్తిత్వము ప్రత్యక్షానుమాన జ్ఞానములకు ప్రామాణ్యము నిచ్చుచున్నది. ఒకపరి ఈనిర్ణయము చేసినపిమ్మట, ప్రత్యక్షానుమానముల ద్వారా జ్ఞానాభివృద్ధి చేసికొని, ప్రకృతికి యజమానులమై వ్యాధిజరామృత్యువులనుగూడ జయించుటకు శ్రమరహితమగు సుఖమయ జీవితము గడుపుటకు మనము యత్నింపవలెను.

క్రీస్తుసభతోను, ఆరెటోరియన్లతోను భిన్నాభిప్రాయములు:

"మననములు" ప్రకటింపబడిన సంవత్సరములోపలనే దానిని సోర్‌బోన్ విశ్వవిద్యాలయము పరిగ్రహింపదనియు, విశ్వవిద్యాలయ పాఠ్యగ్రంథముగా అది ఉండగల్గునని డెకార్ట్ కనినకల వ్యర్థమనియు తేలెను. అందులో క్రైస్తవ సంఘమునా

రిచే పరిగృహీతములగు ఒకటి రెండు సిద్ధాంతముల తీవ్రఖండన ఉండుటచే ఆసభవారు డెకార్ట్‌పట్ల ఎప్పటివలెనే ఉండిరి. పైగా మెర్సీన్‌కు వ్రాసిన ఒకఉత్తరములో బోర్డన్ డెకార్ట్ పని పట్టెదమని భయపెట్టెను. మెర్సీన్ క్రీస్తుసంఘముతో వైరమునూని సంధి చేసికొనుమని డెకార్ట్‌ను బ్రతిమాల సాగెను. ఇంతలో జిబియుఫ్ వ్రాసిన గ్రంథమొకటి ప్రకటింప బడుటయు, డెకార్ట్ అది చదివి తనకును వారికిని ఎన్నో ప్రధాన సిద్ధాంత బేధములున్నవని గ్రహించెను. కాగా, క్రీస్తుసంఘ సిద్ధాంతముల నింకనుబాగుగ అధ్యయనము చేయగా అవి యన్నియు తనకనిష్టములు కావనియు, అందుకొన్ని తనకంగీ కార్యములనియు గ్రహించెను. పైగా, ఆరెటోరియన్లకు క్రీస్తు సంఘమునకుగల సిద్ధాంత వైరుధ్యమునకు తనదార్శనిక సిద్ధాంతమునకు ఎట్టిఅవసర సంబంధము లేదనియు అందొక పక్షమును సమర్థించుటవలన తనకువచ్చులాభము లేదనియు నిర్ణయించుకొనెను.

క్రీస్తుసభ ప్రాపకమునకై ప్రయత్నము :

నూతనదర్శన నిర్మాణముచేసి దానిని ప్రచారము చేయుటే తనలక్ష్యముగాను, భగవంతుడు తనకిచ్చిన ఆశా సనముగాను భావించిన డెకార్ట్, యూరపు నందాకాలమున విద్యాబోధనా కార్యమంతయు ఏసుక్రీస్తుసభ హస్తగతమై యుండుటయు, మంచికళాశాలలు, విశ్వవిద్యాలయము

లన్నియు, వారి యాజమాన్యమున ఉండుటయు, వారికి ప్రతి పక్షులెవరు కార్యరంగమున లేకుండుటయు చూచి, డెకార్ట్ అరిస్టోటిల్ దర్శనమునకు బదులు తన దర్శనము కళాశాలలోను, విశ్వవిద్యాలయములలోను బోధింపబడవలెనన్న, తనదర్శ నము క్రీస్తుసభా సిద్ధాంతములకు విరుద్ధముగా నుండరాదనియు, అది తత్కాలమందు ప్రచలిత బోధనాపద్ధతి కనురూపముగ అరిస్టోటిల్ కనిపెట్టిన న్యాయరూపముగా (Syllogistically) ప్రతిపాదింప బడవలెననియు నిర్ణయించుకొనెను. 1640 నుండి 1644 వరకు 'విశ్వ' మను పుస్తకములో తాను ప్రవచించిన భౌతికశాస్త్రవాదమును లాటిన్‌లో న్యాయరూపముగ వ్రాసి, తత్త్వశాస్త్రవిచారణను కొంచెముగా దాని ప్రారంభమందు మాత్రమే చేసి, 'మననము' లో క్రీస్తుసభ సిద్ధాంతములకు వ్యతిరిక్తముగ చెప్పిన విషయములను వదిలి, ఆసభకుచెందిన కొందరు శాస్త్రజ్ఞులను పొగిడి "తత్త్వశాస్త్ర సూత్రములు" (Principles of Philosophy) అను పేరుతో 1644 లో ఒక గ్రంథమును హాలండ్‌లో ప్రకటించెను. ఇందు క్రీస్తుసభకు మాన్యులగు మధ్యయుగపు దార్శనికుల గ్రంథములనుచదివి, వారి భావములను, పరిభాషను కొంతవరకు స్వీకరించి, వారి శైలిలోనే పూర్వపక్ష సిద్ధాంతరూపముగను, అరిస్టోటిల్ న్యాయముల పద్ధతిలోను దీనిని వ్రాసెను. క్రీస్తు సభవారి ఆమోదము లేకున్న తన దర్శనమునకు తన జీవితకాలములో విజయముండదనియు, విశ్వవిద్యాలయములలో దాని ప్రచా

రము వారి ద్వారానే జరుగగలదనియు డెకార్ట్ తలచుటచే ఇట్లు చేసెను. ఫ్రాన్సులోని ఆ సంఘనాయకునికి సహకారియు తనకుబంధువునగు ఛాన్లెట్ ద్వారా ఆసంఘముతో కొంతరాయ బారముజరిపి, వారు తనకు సుముఖులగునట్లుచేయ ప్రయత్నించెను. కాని 1645 సంవత్సరాంతమునకు ఈ యుద్దేశ్యము నెరవేరదని ధృవపడెను. క్లాడ్ పికోట్ "సూత్రముల" ను ఫ్రెంచిలోకి అనువదించగా డెకార్ట్ దానిని చదివి ఆమోదించి 1647 లో ప్రకటింపచేసెను. ఈఫ్రెంచి అనువాదమునకు తొలి పలుకులుగా డెకార్ట్ పికోట్‌కు వ్రాసిన ఒకదీర్ఘలేఖ ప్రకటింప బడెను. ఇందులో "ప్రమాణపద్ధతిపై ప్రసంగము" లో వలెనే తన లక్ష్యమేమిటో, తాను చేసిన కృషి ఏమిటో, తానిక ముందేమి చేయనున్నది, మున్నగు విషయముల చర్చించెను. ఇందులో తిరిగి దర్శన సంప్రదాయములపట్ల తదనుయాయుల పట్ల అసంతృప్తి వెల్లడించెను. క్రీస్తుసంఘమునుండిగాని ఆరె టోరి సభ్యులనుండిగాని తానపేక్షింపవలసినది లేదని ఈపాటికి తెలియవచ్చెను. 'దాదాపీకాలమందే వ్రాయబడి ఆయన జీవితకాలమం దముద్రితముగా నుండిన "సత్యాన్వేషణము" (Research) లో కూడ ఈదృష్టికోణమే కాననగును.

ఎలిజబెత్‌తో మైత్రి: "మానసిక వికారములు" (Passions) అను గ్రంథరచన:

పెలాటిన్ ప్రభువగు ఐదవ ఫ్రెడరిక్ కూతురగు ఎలిజబెత్ రాకుమారి 1640 లో తనతల్లితో కూడి హేగ్‌లో

నివసించుచుండెను. సౌందర్యము, మేధాశక్తి, స్వతంత్రాలోచనాశక్తి ఈమెలోని సుగుణములు. 1637 లో గ్రంథప్రచురణానంతరము యూరప్ అంతటా విఖ్యాతినొందిన డెకార్ట్‌ను చూడవలెనని ఆమె చాల ఉత్సాహపడెను. డెకార్ట్‌కు హాలెండులో నివాసస్థానమగు లేడెన్ నగరప్రాంతమందు ఎండెజోస్ట్ అను చిన్నకోట హేగ్ నగరానికి కూడ దగ్గరే కావున, డెకార్ట్ వెళ్ళి ఆమెను, ఆమెతల్లిని కలసికొనెను. డెకార్ట్‌ను గురువుగను, స్నేహితునిగను ఎలిజబెత్ సమాదరించి, నాటినుండి ఆయనపద్ధతి నవలంబించియే సత్యాన్వేషణము చేయసాగెను. ఆమె తల్లిదండ్రులయు, బంధువులయు కష్టములు, దేశాంతరవాసము చేయవలసిన గతి ఆమె ఆరోగ్యమునకు భంగకరములుగను, మనస్సునకు అశాంతికరములుగను ఉండెను. దర్శనశాస్త్రము మనుష్యుల కష్టముల కేమియు పరిష్కారము చూపలేదా? అని ఆమె డెకార్ట్‌ను అడిగెను. డెకార్ట్ మానసికోద్రేకములను, ఇచ్ఛాశక్తిని, దేహేంద్రియ ప్రక్రియలను గూర్చి విచారణలు జరిపి నీతిశాస్త్ర సమాలోచనలుచేసి ఏది కర్తవ్యము ఏది అకర్తవ్యము, మానవుడు సంతోషముతోడ నెట్లు జీవింపనగును, అను సమస్యలను 1645-6 శీతకాలమందు వ్రాసి "మానసిక వికారములు" (Passions) అని ఆగ్రంథమునకు నామకరణముచేసి ఏప్రిల్ 1646 లో రాకుమారికి పంపెను. ఆమె దానిని చదివి కొన్ని మార్పులను సూచించెను. 1649 లో అది అమ్‌స్టర్డంలో ప్రకటింపబడెను. 1667 నుండి

ఎలిజబెత్ వెస్ట్‌ఫేలియాలోని హెర్‌ఫోర్డ్‌లో ఒక లూథరన్ మతమున కధికారిణిగా నుండి, దానిని జాతిమతభేదములను పాటింపకుండ దర్శనశాస్త్ర పరిశోధకులందరికి స్థావరమగు స్వతంత్ర పరిషత్తుగా మార్చెను.

"మానసికవికారముల"లోని నీతివాదము:

మనుష్యుడు దేవతకాడు; అతడు శరీరాత్మల సమష్టి రూపము; కాన శరీరముతోకూడ అవినాభావముగ తాదాత్మ్యము చెందియున్నాడు. కాబట్టి నైతికజీవితపు మహాకార్యముల సాధించుటకు, ఆతడు వికారోద్రేకములను బుద్ధితో అనుశాసించుకొని సక్రమముగా వానిని వ్యక్తీకరించుకొనవలెను. కాని, వానిని సంపూర్ణముగా త్రొక్కిపట్టుటగాని, తొలగింప ప్రయత్నించుటకాని వ్యర్థము; అనవసరము; వికారోద్రేకములన్నియు వస్తుతః మంచివే; అన్నియు మనకుశక్తినిచ్చునవియే. అయితే బుద్ధిని వానికి సూత్రధారిగా చేయవలెను. — ఇది డెకార్ట్ ఆగ్రంథములో సూచించిన నీతివాదము.

ప్రొటెస్టెంటులతో వైరుధ్యము:

హాలెండులోని ఉట్రెక్ట్ విశ్వవిద్యాలయములో ఆచార్యుడుగానుండిన రీజియస్ అనునాతడు డెకార్ట్‌కు శిష్యుడై, ఆయన దర్శన సిద్ధాంతానుసారముగా వైద్యశాస్త్రమును, తత్త్వశాస్త్రమును వ్యాఖ్యానించి బోధింపసాగెను. 1641 లో రీజియస్ తన విద్యార్థిచే వ్రాయబడిన ఒకగ్రంథములో అరిస్టాటిల్ తత్త్వశాస్త్రమును, భౌతిక శాస్త్రమును పరిహసింపచేసెను. దీనితో అరిస్టాటిల్ దర్శనానుయాయులు కొందరికి విశేష సంక్షోభముకల్గెను. విశ్వవిద్యాలయ అధ్యక్షుడుగానుండిన వొయెట్ అను కాల్విన్ శాఖకుచెందిన ప్రొటెస్టెంటు మతస్థుడు డెకార్ట్‌కు విరుద్ధముగా కత్తికట్టి, ఒకవైపున ఆయన నిరీశ్వరవాది యనియు, మరొకవైపున ఆయన క్రీస్తుసంఘ శిష్యుడు, వారిగూఢచారి యనియు ప్రచారము చేయసాగెను. 1642 లో ఉట్రెక్ట్ విశ్వవిద్యాలయ సెనేట్ డెకార్ట్‌దర్శనము సత్యవిరుద్ధము అనుపాదేయము అని ఘోషించి, దాని పఠన పాఠములు ఆపవలెనని శాసించెను. దానికి మూడుకారణములు చెప్పబడెను:—(1) డెకార్ట్ దర్శనము ప్రాచీనదర్శన శాస్త్రమునకు విరుద్ధము. (2) అది విద్యార్థులకు ప్రాచీనదర్శనముపై అభిరుచి తగ్గించి, దానిని చదువనీయకుండచేసి వారిఅభివృద్ధికి అడ్డుగా నుండును. (3) డెకార్ట్ దర్శనమునుండి అసత్యములు అనుపన్నములునగు నిర్ణయములు బయల్వెడలును.

ఇంతేకాక, డెకార్ట్ పుస్తకములను గెలీలియో పుస్తకములనువలె బహిరంగముగా కాల్పింపవలెనని కూడ వొయెట్ ప్రయత్నించెను, గాని డెకార్ట్ హాలెండులోని ఫ్రెంచి రాజదూత సహాయముతోడను, ఆరంజి రాజకుమారుని (Prince of Orange) ఆజ్ఞతోడను ఆ ప్రయత్నములు మాన్పించెను.

డెకార్ట్ దర్శన వ్యాప్తి :

గ్రోనింజెన్, బ్రెడా విశ్వవిద్యాలయములలో డెకార్ట్ సిద్ధాంతములు ఆమోదింపబడి బోధింపబడసాగెను. లేడెన్, లావేన్ విశ్వవిద్యాలయములలో ఉట్రెక్ట్‌లో వలెనే డెకార్ట్ పక్షీయులు, అరిస్టోటిల్ పక్షీయులు ఇట్లు ఇరుతెగ లేర్పడెను. జర్మనీలోని హెర్‌బోరన్, డూయిస్‌బర్గ్, ఫ్రాంక్‌ఫోర్ట్, హాల్, లైప్‌జిగ్, మొదలగు విశ్వవిద్యాలయములలో డెకార్ట్ అనుయాయులు ఆచార్యులై ఆయన దర్శన ప్రచారము చేయ సాగిరి. నేపుల్సులో, ఫ్రాన్సులోని ఆకేటరీ సంస్థీయులలో, పోర్ట్‌రాయల్ సంఘములో ఆయన సిద్ధాంతములు మాన్యము లాయెను. డెకార్ట్ సమకాలికుడగు పియర్ బోరెల్, ఆయన మరణించునప్పటికి సముద్రతీరమందలి ఇసుకరేణువులకు, ఆకాశమందలి నక్షత్రములకు డెకార్ట్ శిష్యులు సంఖ్యలో తీసిపోరని చెప్పెను.

హాలెండ్ వాసముపై విసుగు:

యూరప్‌లోని, అన్ని దేశములలోనున్న ఏసుక్రీస్తు సంఘసభ్యులు డెకార్ట్ దర్శనముపట్ల చూపుచున్న వైముఖ్యము, ప్రాచీన సంప్రదాయమే సర్వస్వమని నమ్మి వొయట్ మొదలగు ప్రొటెస్టెంటు మతస్థులు చేసెడి ఆరోపణలు, తన్ను గురువుగా ఎంచి తన దర్శనములే ప్రచారము చేయు చున్నామని చెప్పియు తనను అపార్థముచేసికొనిన రీజియస్

మున్నగువారి వ్యాఖ్యానములు డెకార్ట్‌ను సంక్షోభపెట్టెను. వ్రాయుట మాని, స్వీయాభివృద్ధికొరకు మాత్రమే సత్యాన్వేషణ చేసికొనుట ఉత్తమమేమో అని ఆయనకు అనిపింపసాగెను. హాలెండులో మతసహన ముండునని ఆ దేశములో తావస మేర్పరచుకొనినను, అక్కడ ప్రొటెస్టెంటుల నిందారోపణలు తప్పలేదాయెను. దేశమును వదలి ఫ్రాన్సుకు వెళ్ళిన బాగుండు నని ఆయనకు తోచసాగెను.

సహకార పరిశోధన (Co-operative research) ను గూర్చిన ఆలోచనలు :

ఒక శాస్త్రీయ పరిశోధనా పరిషత్తు నెలకొల్పబడి దానికి తానధ్యక్షుడుగానుండి, వివిధశాస్త్రములలో కృషి చేయు అనేక సహాయకులును, ఈ పరిశోధనల కవసరములగు పరికరములను నిర్మించు శిల్పులును, వీరికి క్రొత్తపరికరములను చేయు పద్ధతులను గూర్చి ఆలోచనలు జరిపి సూచనలు చేయువారును, సమకూడిన శాస్త్రీయ ప్రగతి ఎంతో జరిపింప గలదని ఆయన నమ్మకము. "వికారము"ల, "సూత్రము"ల ఫ్రెంచి అనువాదమునకు వ్రాసిన తొలి పలుకుల లోను, స్నేహితులకు వ్రాసిన ఉత్తరములలోను ఈ ఆశయమును వ్యక్తీకరించెను. ఈ విషయమున ఏమైన జరుగునేమో చూచుటకు ఆయన 1648 లో ఫ్రాన్సుకు వెళ్ళెను. అక్కడ ఆయనకు ప్రభుత్వము సహాయము చేయునట్లు కన్పడలేదు.

ఒక ఉపకారవేతనము మాత్రము ఆయన కిచ్చిరి. ఒక స్నేహితుడు తన ధనముతో అట్టి సంస్థను నెలకొల్పెదనని చెప్పెను గాని, ఫ్రాన్సులోని అస్వస్థమగు రాజకీయ పరిస్థితిచే అది సాధ్యపడలేదు. కాన ఆయన రిక్తహస్తములతో హాలెండుకు తిరిగి వచ్చెను.

స్వీడన్ రాణితో పరిచయము: స్వీడన్‌కు ఆహ్వానము:

ఆ దినములందు స్వీడన్‌కు క్రిష్టినా రాణిగా నుండెడిది. ఈమెకు విద్యావ్యాసంగము, శాస్త్రీయ దార్శనిక విషయములందు జిజ్ఞాస హెచ్చు. స్వీడన్‌కు ఫ్రెంచిరాజదూతగా నుండిన చానట్ డెకార్ట్‌కు స్నేహితుడు, శిష్యుడు. డెకార్ట్ కీర్తిని వినిన క్రిష్టినారాణి చానట్ ద్వారా డెకార్ట్‌కు "ప్రేమ యన నేమి?" "భౌతిక జగత్తు మనలను ఈశ్వరుని ప్రేమింప మని బోధించుచున్నదా?", "ప్రేమ ద్వేషములలో ఏమానసిక సైకల్యము ఎక్కువ చెడ్డది?" ఇత్యాది ప్రశ్నలు పంపుచుండెడిది. డెకార్ట్ విపులముగా నిర్ణీత తర్కపద్ధతిలో సమాధానములు వ్రాసి పంపుచుండెడివాడు. ఆయన సమాధానములు రాణికెంతో సమ్మోదమును కల్గించి, ఆమెకాయనపై గురుభావము జనించుటయు ఆయన వ్రాసిన "సూత్రములు" అధ్యయనము చేయగోరుటయు సాక్షాత్తుగా ఆయనవద్ద దర్శన శాస్త్రము చదువ నారాటపడుటయు కారణముగ ఆయనను 1648 - 9 ప్రాంతమున చాలాసారులు స్వీడన్‌వచ్చి నివసించుడని ఆమె

ఆహ్వానింపసాగెను. అతి శీతలమగు ఆ నూతన విదేశమునకు పోవుటకెంతగానో వెరచియు, అక్కడ కొంతకాలముండి రాజమన్నన లందిన యూరప్‌లోని తనకీర్తి ఇంకను వృద్ధి యగునని, కనీస మప్పుడైనను ఫ్రెంచిప్రభుత్వము తాను కోరిన శాస్త్రీయ పరిశోధనా సంస్థను నెలకొల్పునని ఎలిజబెత్ రాకుమారి, క్రిష్టినా రాణి రాజదూత యగు చానెట్, లుయెన్స్ ప్రభువు మొదలైనవారి ఇతోధిక ప్రాపకమున్న ఆచిరకాలమునసే తన దర్శనము ఇంకను బాగుగా వ్యాపించు నని డెకార్ట్ స్వీడన్‌రాణి ఆహ్వానమును స్వీకరించి 1649 లో ఆమె పంపిన యుద్ధనౌకలో పయనమై వెళ్ళెను.

స్వీడన్‌లో నివాసము: మరణము:

స్వీడన్‌లో ఆయనకు రాజమర్యాదలు జరిగెను. ఆయనను సామంతునిగా నూడ చేయవలెనని రాణి నిశ్చయించెను గాని, ఆయన వలదనెను. ఆయనతో సంప్రదించి ఆమె స్వీడన్ రాజ్య విద్వత్పరిషత్తును ఆయన వీర్పరచిన నియమముల ననుసరించి స్థాపించెను. దాని కాయనను అధ్యక్షునిగా నియమింపదలచెను. గాని ఆయన వలదనెను. ఇన్ని మర్యాదలు జరుగుచున్నను రాజాస్థాన జీవితములోని అస్వాతంత్ర్య మాయనకు పెద్దగా రుచింపలేదని, ఆయన మిత్రులకు వ్రాసిన ఉత్తరములు చెప్పుచున్నవి. పైగా రాణి ఆయనవద్ద దర్శనశాస్త్రమును ప్రాతఃకాలమున 5 గంటల వేళకు చదువుచుండెను. ఆ అత్యంత

శీతలదేశములో ప్రాతఃకాలమున నెప్పుడును లేచుట కలవాటు లేని డెకార్ట్ అంత ప్రొద్దుటివేళ లేవవలసి వచ్చుటచేతను, ఆ అసందర్భపువేళ రాజమందిరమునకు పోయి సిద్ధము కావలసి యుండుటచేతను ఆయన ఆరోగ్యము శిథిలము కాజొచ్చెను. ఒకసారి అట్లు వెళ్ళి వచ్చునప్పుడు శైత్యముచేసి కోలొ్కొన లేక, తన 54 వ ఏట, 1650 ఫిబ్రవరి 11 వ తేదీన మరణించెను.

డెకార్ట్ భౌతికశాస్త్ర కృషి:

డెకార్ట్ శాస్త్రీయ కృషిలోనికెల్ల ఆయన గణిత శాస్త్రములో కనుగొనిన విషయములే అతిముఖ్యములు. రేఖాగణిత బీజగణిత సమానత్వమును కొంతవరకు చాలా కాలమునాడే ఒమార్ ఖయ్యామ్ కనుగొనినప్పటికిని, సహ నిర్దేశక రేఖాగణితమునొక్క ప్రారంభదశ కొంతవరకు ఒరెస్మెకు అర్థమైనప్పటికిని దానిని పరిణతమైన శాస్త్రముగా చేసినది డెకార్ట్. ఇదికాక భౌతికశాస్త్రమందుకూడ కొన్ని క్రొత్త విషయములను కనిపెట్టుటయు, భౌతికశాస్త్ర విషయ ములకు వ్యవస్థీకృతరూపమును ఇచ్చి అరిస్టాటిల్ వ్యవస్థకు బదులుగా యూరప్ ఖండమందు దీనిని ఇంచుమించు అర్ధ శతాబ్దమువరకు ప్రచలితముగా చేయుటయు కూడ డెకార్ట్ ప్రతిభకు నిదర్శనములు.

భౌతిక సంఘటనల ఆదిమకారణమును పరిగణించక యాదృచ్ఛికమైన కొన్ని సంఘటనలను మాత్రమే తీసికొని

వాటిని గణిత శాస్త్రీయముగా వర్ణించుటయే గెలీలియో చేసినాడనియు, గెలీలియోయొక్క పృథక్కరణ పద్ధతి (abstraction) సమంజసమైనదికాదనియు, డెకార్ట్ అభిప్రాయము. 1604 లో గెలీలియో కాలము, వేగము, దూరములకు మధ్య గల సంబంధములను గణిత శాస్త్రీయముగా వ్యక్తీకరించిన విధముగానే 1618 లో డెకార్ట్ స్వతంత్రమార్గమున వ్యక్తీక రించగలిగెను. డెకార్ట్ నిర్మించిన భౌతికశాస్త్రమందు కూడ గతిని గురించిన నియమములు జడత్వము గురించిన ధర్మములు ఉన్నప్పటికిని శూన్యముయొక్క ఉనికినిగురించిగాని, దూరము నుంచి తన ప్రభావమును కనపరచగల ఆకర్షణశక్తియొక్క ఉనికిని గురించిగాని డెకార్ట్‌కు విశ్వాసము లేదాయెను. ఈ అంశమందు డెకార్ట్ గెలీలియో మతమును ఎన్నడును అంగీకరించలేదు. స్థూలప్రకృతి లేనిచోటనెల్ల సూక్ష్మప్రకృతి యొకటి గలదని డెకార్ట్ ప్రతిపాదించెను. తరువాత శూన్యము యొక్క అభావమును బోధపరచుటకై అవకాశమంతటను ఈథర్ అను సూక్ష్మద్రవ్యము వ్యాప్తమై యున్న దను న్యూటన్ ప్రతిపాదన డెకార్ట్ ప్రభావమును చూపుచున్నది. 17 వ శతాబ్దములోని ప్రసిద్ధభౌతికశాస్త్రజ్ఞుడగు క్రిస్టియన్ హ్యూజెన్స్ కృషిలో ఎక్కువ భాగము డెకార్ట్ భావముల చేతనే ప్రేరేపింపబడెను.

కెప్లర్ వలెనే డెకార్ట్‌కూడ సూర్యమండలమందు శక్తి కొక ఉద్భవస్థాన ముండవలెననియు లేనిచో కక్ష్యలయొక్క

తలములు సూర్యునిగుండా పోజాలవనియు, గ్రహగతులలోని మార్పులు అర్థముకావనియు అభిప్రాయపడెను.

తగువిధమగు దీర్ఘమైన పృథక్కరణముద్వారా సమస్త నైసర్గిక సంఘటనలను ఒకేవిధమైన పరిణామరూపమున, అనగా ప్రకృతిగతిరూపమున, నిరూపించవచ్చునను ప్రతిపాదన డెకార్ట్ భౌతికశాస్త్రమునకు పునాది. 17 వ శతాబ్దపు శాస్త్రజ్ఞులందరు ఈ విశ్వాసమును కలిగియుండిరి. డెకార్ట్ అందుచేతనే చలనశాస్త్రమును ప్రధానశాస్త్రముగా చేసెను. 19 వ శతాబ్దములో బయల్వెడలిన గతివాదము డెకార్ట్ భావములనే దృఢపరచుచున్నది. శుద్ధగతిశాస్త్ర ప్రధాన సూత్రములను, అనగా, మూలభావముల నిర్మాణము, దాని కనువైన గణితశాస్త్రీయ పద్ధతులను ప్రసాదించినది గెలీలియో. ఇవియే డెకార్ట్ యొక్క సహనిర్దేశక రేఖాగణిత మందు విస్తరింపబడి గతియందున్న ప్రకృతి గుణములను నిర్వచించుటకు ఉపయోగపడెను. గెలీలియో చేసిన గతియొక్క వర్ణనాత్మక విశ్లేషణ నుపయోగించి భౌతికవిశ్వమును డెకార్ట్ యంత్రశాస్త్రీయభావములద్వారా అర్థము చేసికొనుట ఎట్లను నదే ప్రధానసమస్యగా ఏర్పడెను.

గురుత్వాకర్షణము, అయస్కాంత శక్తి ఇత్యాది రహస్యశక్తుల ప్రతిపాదనను విడనాడి విశ్వమంతయు ప్రకృతిచే పరివ్యాప్తమై, ప్రకృతికణములు అనంతముగా విభావ

యోగ్యములని ప్రతిపాదించి ఒక నిర్దిష్టమగు కణసిద్ధాంతమును లేవదీసి, ప్రకాశము, అయిస్కాంత ప్రక్రియలను, వీనిద్వారా వివరించుటయే డెకార్ట్ తత్త్వశాస్త్రసూత్రములు అను గ్రంథమున చేసెను.

ప్రకాశము ఒక యానకము (Medium) నుండి ఇంకొక యానకమునకుపోవు విధమును గూర్చి డెకార్ట్ చేసిన పరిశ్రమల ద్వారా డెకార్ట్ కిరణ వక్రీభవన సూత్రమును కనిపెట్టెను. రాబర్ట్‌హుకె ఈకృషిని కొనసాగించెను.

కేంబ్రిడ్జ్‌లో చదువుకొను దినములందు న్యూటన్ డెకార్ట్‌ను అధ్యయనము చేసెను. న్యూటన్‌కు డెకార్ట్‌కు విశ్వమునుగురించి ఒకేవిధమైన భావన కలదనియు, న్యూటన్ యొక్క సూత్రములు అను గ్రంథమునందు అవలంబింపబడిన పద్ధతి, డెకార్ట్ సూత్రములు అను గ్రంథమునందు అవలంబింపబడిన పద్ధతియు ఒకటియే అనియు, అయితే న్యూటన్ యొక్క వాదములు డెకార్ట్ వాదములకంటె అధికమగు గణితశాస్త్రీయ పటిమయు, ప్రత్యవేక్షణపైనను, ప్రయోగముపైనను హెచ్చుగా ఆధారపడియుండుటయు కలిగియున్నవి. ఒకవిశిష్ట సమస్యనో సంఘటననో అర్థముచేసికొనుటకు ఒక విశిష్టమైన ప్రతిపాదన చేయుటకంటె యావద్భౌతిక సంఘటనలకు వర్తించగల వాదమును స్థాపించి దాని ద్వారా ప్రత్యేక విషయములను అర్థము చేసికొనుటయే డెకార్ట్

న్యూటనుల పద్ధతి. ఇది గెలీలియో పద్ధతికి భిన్నము. ఇంద్రియానుభూతులపై ఆధారపడి విశ్లేషము చేయబడిన ఇంద్రియ ప్రత్యక్షములన్నిటిని సమన్వయపరచగల జ్ఞానమే సరియగు భౌతికశాస్త్రముగ గెలీలియో అభిప్రాయపడెను. ఇంద్రియానుభూతుల ప్రామాణ్యమును నిర్ధారణచేయుట ఎట్లు? బుద్ధి నిశ్చయముగ నిర్ణయించని భూతార్థములను ఎట్లు అవగాహన చేసికొనగలము? — అను ప్రశ్నలకు మనము ముందు ప్రధానములైన సాధారణ సూత్రములను స్థాపించుకొని వానిని యదార్థ వస్తువులన్నిటికి వర్తింపచేయవలె ననునదియే డెకార్ట్ సమాధానము. అందుచేతనే డెకార్ట్ భౌతికశాస్త్రము గెలీలియో భౌతికశాస్త్రముకంటె ఎక్కువ క్రమబద్ధమై ఒక పరిణతిలేని శాస్త్రనిర్మాణముగా నుండెను. ఇక ఈ నిర్మాణమునకు, ప్రత్యేకసంఘటనలకు గల సంబంధమును కనుగొనుట మాత్రమే పరిశోధనకు అవశిష్టమైన కార్యముగ నుండును.

ఒక నిగమనపద్ధతిలో అంతర్భాగముగ నుండని ఏయో యాదృచ్ఛిక ప్రయోగములచే సూచింపబడిన నిర్ణయములను డెకార్ట్ ఆమోదించలేదు. అందుచేతనే అతడు గెలీలియో కృషిని సమాదరించకపోయెను.

డెకార్ట్‌యొక్క సూత్రములను గ్రంథము అతని అనుయాయులకు ఇంచుమించు ఒక శతాబ్దమువరకు అధ్యయన గ్రంథముగానుండి, ముఖ్యముగా 17 వ శతాబ్దము మధ్యకాల

మందు ఫ్రాన్స్, బ్రిటన్, వాయువ్యయూరప్‌లలో గెలీలియో భౌతికవాదమునకంటె అధికోపాదేయములుగా ఎంచబడెను. ఈ కారణముచేతను యూరప్‌నందు ఆనాటికి బేకన్ పేరు అజ్ఞాతముగా నుండుటచేతను, డెకార్ట్ సిద్ధాంతము ఆరిస్టాటిల్ సిద్ధాంతమునకు ప్రత్యామ్నాయమాయెను. డెకార్ట్ వాదమును పరిగ్రహించుటయే ప్రగతికి సూచకముగా నుండెను. ఉదాహరణమునకు 1650 ప్రాంతమున డెకార్ట్ వాదమును పరిగ్రహించుటచే కేంబ్రిడ్జికంటె ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయము అభ్యుదయగామిగా ఎంచబడెను. 1630 నుండి 1670 వరకు పారిస్ యూరప్‌యొక్క విజ్ఞానకేంద్రముగా ఉండుటకు డెకార్ట్‌యొక్క ప్రజ్ఞయే కారణము. బోయిల్, న్యూటన్‌లు డెకార్ట్ భావములను కృషిని ప్రాతిపదికగా తీసికొనుటయు, ఆయన కృషిని విభిన్నమార్గములలో అభివృద్ధిచేయుటయు జరిగెను.

డెక్కార్ జీవశాస్త్ర కృషి:

హార్వే కనుగొనిన రక్తప్రసరణ సిద్ధాంతములోని అంతర్భావములను ప్రథమమున విస్తృతపరచినది డెకార్ట్. హృదయ కోశము యాంత్రిక ప్రక్రియను యావన్మానవ దేహపు భౌతికత్వమును దానినుండి నిగమనముచేసి ఆలోచనలు తప్ప తక్కిన మానవకార్యములన్నిటిని ఈ భౌతిక దేహమే కొనసాగించుచున్నదని డెకార్ట్ వివరించెను. కిణ్వప్రక్రియ

(Fermentation) లోని ఉష్ణతతో పోల్చదగు స్వాభావిక ఉష్ణత హృదయకోశమం దున్నదనియు, ఇది హృదయకోశ గతి వలన రుజువగుచున్నదనియు, హృదయకోశము అంత ర్జ్వలన యంత్రము (Internal Combustion engine) తో పోల్చదగు ననియు డెకార్ట్ అభిప్రాయపడెను. దేహ కార్య ములలో ఎక్కువ భాగము అప్రయత్న చాలన, ప్రతిక్రియల వలన జరుగుచున్నవనియు, ఇవి నాడీ వ్యవస్థ ద్వారా జరుగు బాహ్య ప్రేరణలకు స్వయం ప్రేరక ప్రతిక్రియలు అనియు డెకార్ట్ అభిప్రాయము. ఇచ్ఛా శక్తికి మానవ కార్యములలో గల స్థానము బహు స్వల్పమనియు, జంతువులలో దానికి అసలే స్థానము లేదనియు డెకార్ట్ వాదము. 19 వ శతా బ్దపు శరీరనిర్మాణ శాస్త్రము ఈవాదము వైపునకే ఎక్కువగా మ్రొగ్గెను. శరీరము సజీవముగా నుండి పని సాగింపగలుగుటకు కారణములు ఒకటిగాని ఎక్కువగాని జీవశక్తులు లేక ఆత్మలు కావనియు, దానికి, ఒక పెద్ద గడియారమందలి విభిన్న భాగముల పరస్పర యాంత్రిక సంబంధములవలెనే, విభిన్న దేహభాగముల యాంత్రిక సంబంధములే కారణములనియు, ఈ భాగములలో సంభవించు లోపములవలన కలుగు దేహ కార్యక్రమముల ఆపుదలయే మృతియనియు డెకార్ట్ జీవ శాస్త్ర సిద్ధాంతము. పరిస్థితులు మారనప్పుడెల్ల, ఒకేరకపు కారణము ఎల్లపుడును ఒకేరకపు కార్యమును సంభవింపచేయు నను సూత్రము శారీరక ప్రక్రియలకు కూడ అన్వయింపనగు ననియు, శరీరమును ఒక యంత్రముగా నెంచి దాని నిర్మాణ

మును ప్రక్రియలను అందు మూలముగా అర్థము చేసికొనవచ్చు ననియు, డెకార్ట్ చెప్పిన ఈ జీవశాస్త్రవాదము 17 వ శతాబ్దపు తరువాతి భాగములో వెలువడిన శరీరశాస్త్ర, శరీర నిర్మాణ శాస్త్రములపై ప్రభావము చూపెను.

శాస్త్రీయ కృషి కాధారము, లక్ష్యము :

డెకార్ట్ దర్శనములో మరిరెండు ముఖ్యమైన భావ ములు కూడా ఇచ్చట పేర్కొనబడదగియున్నవి.

I. శాస్త్రీయ ప్రగతి ఎవరికివారుగా విడివిడిగా పని చేయు శాస్త్రజ్ఞుల కృషిపై నాధారపడక నానాదేశములకు చెందిన శాస్త్రజ్ఞుల పరస్పర అవిచ్ఛిన్న సహకారకృషిపై ఆధారపడి యుండుననుభావము డెకార్ట్‌యొక్క ఈ పుస్తక మందును, లేఖలయందును కాననగును. ఈ భావమును మొద టగా వ్యక్తీకరించి దీనికి ఎక్కువ ప్రాముఖ్యము నిచ్చినవాడు డెకార్ట్. పండితుల, శాస్త్రజ్ఞుల పరిషత్తులు ప్లేటో, అరిస్టాటిల్ కాలమునుండి ఉన్నప్పటికి అవి ఒక వ్యక్తియొక్క దార్శనిక వాదమును బోధించుటకు, ప్రచారము చేయుటకు లేదా ఒక సంప్రదాయమును ఇతోధికముగా అధ్యయనముచేసి దానిని అవగాహన చేసికొనుటకు, లేదా దానిపై వ్యాఖ్యానము రచించుటకు మాత్రమే ఉపయోగపడుచుండెడివి. డెకార్ట్ ఊహించిన శాస్త్రజ్ఞుల సహకార కార్యక్రమము అట్లుగాక

మానసిక, భౌతిక జగత్తులలో ఇంతవరకు తెలియని విషయములను తెలిసికొనుటకును, విజ్ఞానాభివృద్ధికొరకును యోజింపబడెను. ప్రాచీనకాలమునందు కనుగొనబడిన సత్యములను పదిలపరచుట, ప్రచారము చేయుటయేగాక పూర్వమునుండి సత్యములు అని నమ్మబడుచున్న విషయములు ఎంతవరకు సత్యములని పరిశోధన చేయుటకు, ఇంతవరకు మానవకోటికి తెలియరాని నూతనసత్యములను కనుగొనుటకుకూడ శాస్త్రీయ కృషి ఆదర్శముగ నుండవలెనని డెకార్ట్ అభిప్రాయము.

II. గ్రీకు రోమను యుగమందు, మధ్యయుగమందు, శాస్త్రీయకృషి విశ్వమందు సమన్వయాత్మక సామరస్యమును చూడవలెనను కోర్కెతోడనో, లేక ఈశ్వర సంబంధమైన ఊహాలను బలపరచుటకో, అర్థముచేసికొనుటకో, తరచు ఉపయోగపడుచుండెను. కాని, డెకార్ట్ శాస్త్రీయ కృషికి నూతన ధ్యేయము నేర్పరచెను. మానవులు ప్రకృతిని స్వాయత్తము చేసికొనినవారుగను, దానికి యజమానులుగను, ("Comme maîtres et possesseurs de la nature") అగునట్లు చేయుటయే శాస్త్రీయ కృషికి పరమ ప్రయోజనమని డెకార్ట్ అభిప్రాయము.

సాంఖ్యాది భారతీయ దర్శనములలోవలె ప్రకృతినుండి దూరముగా పోవుటవలన, వ్యవహారమునుండి విరమించుకొనుటవలన, ప్రకృతినుండి వేరుపడుట (కైవల్యము) సిద్ధించునేగాని

ప్రకృతిపై జయముగాని, ఆధిపత్యముగాని, దానిని మన ప్రయోజనమునకు ఉపయోగించుటగాని సాధ్యపడదు. ప్రకృతియు తత్కార్యములగు భౌతిక పదార్థములును దోషభూయిష్ఠములు, మన స్వాతంత్ర్యమును సంకుచితముచేయు హేతువులు అని ఎంచినప్పటికిని, వానిలోని దోషములను నిర్మూలనము చేయుటయు, వానిని మనస్వాతంత్ర్యాభివృద్ధికి సాధనములుగా మారునట్లు చేయుటయు పురుషోచిత కార్యముగా నుండును గాని, వానికి భయపడి దూరముగ తొలగి పోవుట యుక్తమగు పురుషార్థము కానేరదు.

పరమ పురుషార్థము:

రోగరహితముగా, శ్రమరహితముగా ఆనందముతో వీలైనంతకాలము ఈ లోకమందు జీవించుటయే పరమ పురుషార్థమని డెకార్ట్ అభిప్రాయము. జీవశాస్త్రము, వైద్యశాస్త్రములు, అందలి పరిశోధనలు మనము రోగరహితులుగా నుండు విధానమును సూచించగలవు. భౌతికశాస్త్రము, గణిత శాస్త్రములును వాటిపై ఆధారపడిన యంత్రశాస్త్రము, సాంకేతిక శాస్త్రములును మానవులు శారీరక శ్రమను వీలైనంతవరకు తగ్గించుకొను విధానమును, ఈలోకమును తమ కిష్టమైన రీతిగా మార్చుకొను విధానమును తెలుపును. ఈ కారణములచేతనే డెకార్ట్ శాస్త్రీయ కృషికి ఎక్కువ ప్రాముఖ్యము నిచ్చెను. ఇటువంటి శాస్త్రీయ కృషికి పునాదిగాను, మార్గనిర్దిష్టకము

గాను ఉండగల్గునది కాబట్టియే దర్శనశాస్త్రమునకు విలువ గలదుగాని, మానవ పరమప్రయోజన సిద్ధికి అనుపయుక్తమగు శుష్క-వాదములతో నిండిన దర్శనములు అప్రయోజకములని డెకార్ట్ అభిప్రాయము.

డెకార్ట్‌యొక్క ఈ అభిప్రాయములు డిడెరో, లమెత్రి బఘా, దోల్‌బాష్ మొదలైన వారి ప్రాతలవలన హెచ్చుగా ప్రచారము చేయబడి ఒకవిధమైన స్వాభావిక వాదమునకు ప్రోవదీసెను. దీనివలన మానవుని గురించియు, విశ్వమును గురించియు చేయబడు పరిశోధనలు పూర్వసంప్రదాయమునకుగాని, మతమునకుగాని లొంగకుండ స్వతంత్రముగా సాగగలుగుటకు వీలగు వాతావరణ మేర్పడెను. ఇదిట్లుండ, శాస్త్రీయ కృషి, మానవుని పరమలక్ష్యములను గూర్చిన డెకార్ట్ అభిప్రాయములను సరకుచేయక ఆయన ఈశ్వరాత్మలను గురించి చేసిన సిద్ధాంతములకే ప్రాముఖ్యము నిచ్చి తద్వారా ఈశ్వరవాదమునకు, క్రైస్తవమతమునకు, భక్తిజీవనమునకు విశేషబలము చేకూర్చిన చింతకులుకూడ యూరప్‌నందు చాలమంది ఉద్భవించిరి. మాలెబ్రాంష్, బోసుయే, ఫెనెలాఁ, ఇత్యాదులిందు ముఖ్యులు.

కె. సచ్చిదానందమూర్తి

ఒకేపరి చదువుట కీ ప్రకరణము సుదీర్ఘముగా తోచినచో దీని నారు భాగములుగా విభజింపవచ్చును. అందు మొదటిదానిలో శాస్త్రములను గూర్చిన వివిధపర్యాలోచనలు గలవు. రెండవదానిలో గ్రంథకర్త కనిపెట్టిన ప్రమాణ పద్ధతియొక్క ముఖ్యసూత్రములును, మూడవ దానిలో ఈ పద్ధతినుండి ఆతడు నిగమనము చేసిన కొన్ని నైతికసూత్రలును, నాల్గవదానిలో ఆతని తత్త్వశాస్త్రమున కాధారములగు నీశ్వర జీవాస్తిత్వములను బుజువు చేయు హేతువులును, అయిదవ దానిలో ఆతడు పరిశోధన చేసినకొన్ని భౌతిక ప్రశ్నలును — ప్రధానముగా హృదయ గతి, వైద్యశాస్త్రము వీనిలోని మరికొన్ని క్లిష్ట సమస్యలు, మానవులయు, జంతువులయు ఆత్మలకున్న భేదములును గలవు; చివరి భాగములో ప్రకృతి పరిశోధనయందు ఇతోధిక గురుతరాభివృద్ధి జరుగుట కేది యావశ్యకమని గ్రంథకర్త నమ్ముచున్నాడో, దానిని వ్రాయుట కాతని ప్రోత్సహించిన కారణములును గన్పట్టును.

ప్రథమభాగము

మానవులయందన్నిటికంటె సద్బుద్ధి అత్యంతము సమానముగ విభక్తమై యున్నది. ఎందుకనగా: ప్రతిమానవుడును తనకది సర్వసమృద్ధిగా కలదనియే తలంచును. కొంద రేవిషయమునందును సంతృప్తిపడుట కష్టసాధ్యము. అట్టివారు కూడ సాధారణముగా తమకున్నదానికంటె నధికముగ నీ గుణమును కోరరు. ఈవిషయమున నందరు పొరపడియుండుట సంభావ్యము కాదు. సరిగా నిర్ధారణ చేయగల శక్తియు, సత్యాసత్యవివేచన చేయగల శక్తియు నైసర్గికముగ మనుష్యులందరియందును సమానముగా నున్నదని యీ విశ్వాసము సూచించును. ఇదియే సద్బుద్ధి లేక వివేకము అని సముచితముగా పిలువబడుచున్నది. కావున, మన అభిప్రాయభేదములకు కారణము మనకున్న వివేకమునందలి తరతమభేదముగాక, మన ఆలోచనలను కేవలము భిన్న మార్గములందు పోనిచ్చుటయు, అందువలననే మనశ్రద్ధ ఒకే వస్తువుపై కేంద్రీకృతము కాకపోవుటయు నైయున్నది. ఏలయన శక్తిమంతమగు మనస్సు కలిగియుండుట చాలదు. ముఖ్యముగా కావలసినది దానిని సరిగా వినియోగించుట. మహామనీషులు అత్యుత్తమ గుణముల సాధింపగలరు. అట్లే అత్యధికలోపములకు లోనగుచుందురు. సరియైన మార్గమును వదలకుండ మెల్ల

మెల్లగ నడచువారు, దారివదలి పరుగెత్తువారికంటె నిజముగా ముందు పోవచ్చును.

సామాన్యుని మనస్సుకంటె నామనస్సు ఎక్కువ పరిపూర్ణమైనదని నేనెన్నడును తలంచుటలేదు. పైగా మరి కొందరివలె వేగముగా నాలోచింపగల్గియు సరిగా, విశదముగా భావింపగల్గియు, లేదా సంపూర్ణముగా, సద్యముగా (Readily) స్మరింపగల్గియు నే నుండవలె నని తరచుగా అభిలషింతును. మనస్సునకు పరిపూర్ణత్వమును గలిగించు నితరగుణములు, ఇవిగాక నేనెరిగినవి లేవు. ఎందుకనగా, మనలను మనుష్యులుగా చేసి, పశువులనుండి వేరుపరచునది వివేకము, లేక బుద్ధియే కావున అది ప్రతివ్యక్తియందును పరిపూర్ణముగా నున్నదనియే నేను విశ్వసించుచున్నాను. ఈవిషయమున తరతమ భేదము అసహజములందే కాని, ఒకేవర్గమునకు చెందిన వ్యక్తుల నైసర్గిక రూపస్వభావములపై నాధారపడి యుండలే దను దార్శనికుల సామాన్యాభిప్రాయమును నే ననుసరించుచున్నాను.

ఎట్టులైనను, నాజీవితమున నతి ప్రారంభదశయందే విశిష్టములగు కొన్ని మార్గములవెంబడి నేను పోవుట నా ప్రత్యేక భాగ్యమని నా విశ్వాసము. ఆ మార్గముల ననుసరించుటవలన కొన్ని విచారణరీతులను, సామాన్యసత్యములను నేను తెలిసికొంటిని. వాని విషయమున నేనొక ప్రమాణ

పద్ధతి నేర్పరచుకొంటిని. తద్ద్వారమున, నాకు తోచిన విధమున నా జ్ఞానమును క్రమక్రమముగా అభివృద్ధిపరచుకొని, కొంచెము కొంచెముగా దానిని విపులీకరించుకొనుచు, సామాన్యమగు నాశక్తికిని, నాస్వల్పజీవితమునకును, అనువగు ఉచ్చస్థాయిని దానిని పొందించితిని. అతిసాహసిగానుండుటకంటె నన్ను నేను సదా పరీక్షించుకొనుటకే యత్నింతును. స్వవిషయమున నిదియే నా నిశ్చితాభిప్రాయము. మానవుల యొక్క వివిధములగు పనులను, సాహస కృత్యములను, దార్శనిక దృష్టితో పర్యవేక్షించునప్పుడు, నిరుపయోగము, వ్యర్థముకాని దెద్దియు గన్పట్టదు. అయినను, అందువలన నేను నిరుత్సాహపడలేదు. కారణము: సత్యాన్వేషణమున, నా ప్రమాణపద్ధతివలన నాకు సమృద్ధమగు ఫలము లభించినది. నే నింతవరకు సాధించిన ప్రగతివలన నాకు సంపూర్ణమగు తృప్తిగలిగినది. కావున భావిపట్ల నాశాపూర్ణుడనైయుండుట నాకు తప్పనిసరి యగుచున్నది. అట్లే, అన్ని వృత్తులయందును మానవులకు కేవలము మానవులుగా, ఉచితమును, నిజముగా మంచిదియు, ముఖ్యమును అగు వృత్తియేదైన నున్నచో, అది నేను గైకొనినదే అని విశ్వసింప సాహసించుచున్నాడను.

ఇంతకు నేను పొరపడియుండుట కవకాశము కలదు. నేను బంగారముగను, వజ్రముగను గ్రహించుచున్నది బహుశః

ఒకచిన్న రాగిముక్కయో, గాజుముక్కయో కావచ్చును. స్వవిషయములందు మనమెంతగా భ్రమకు లోనగుదుమో నే నెరుగుదును. మన మిత్రులు మన పక్షమున మన కిచ్చు నిశ్చయాభిప్రాయము లెంతగా సందేహింపవలసినవో కూడ నే నెరుగుదును. కాని ప్రతివ్యక్తియు తనకుతానే నిశ్చయించు కొనగల్గుటకై చిత్తరువునందువోలె నాజీవితమును చిత్రించుచు నే ననుసరించు మార్గములనుగూర్చి వివరించుటకును ఈప్రకరణ గ్రంథమునందు ప్రయత్నింతును. ఈ వివరణవలని మరొక ప్రయోజనము: ఈ మార్గములయెడ కొన్నియభిప్రాయము లేర్పడియుండును. అవి ప్రస్తుత వార్తలవలన తెలియును. నేను మామూలుగా ఉపయోగించు పద్ధతులకు అవి చేర్పులగును. అందువలన ఆత్మోపదేశ విషయమున నాకు క్రొత్తమార్గమును లభించును.

తన వివేకమును సక్రమముగా నడిపింప ప్రతివ్యక్తియు అనుసరింపవలసిన పద్ధతిని బోధించుట నాప్రస్తుతోద్దేశము కాదు. మరేమన, నావివేకమును నేనెట్లునడిపించుటకు ప్రయత్నించితినో, వివరించుట మాత్రమే. ఒరుల కుపదేశింప సంసిద్ధులగువారు తమ కొరులకంటె నధికమగు మేధ కలదని తలంపవలసినదే. బహు స్వల్పవిషయమునందు వారు పొరపడినను, నిందకు లోనగుదురు. కాని, ఈ చిన్నగ్రంథము కేవల మొక యితిహాసముగానో, కాకున్న, ఒక నీతిబోధకమగు

కథగానో మాత్రమే పరిగణింపనగును. ఇందు అనుసరణ యోగ్యములగు ఉదాహరణములు కొన్నియు, అనుసరణ యోగ్యములుగాని యుదాహరణములు మరికొన్నియు లభింపగలవు. కావున, ఇది ఎవ్వరికిని కష్టదాయకముకాదు, కొందరి కైన నుపయోగకరము. నాస్పష్టవాదిత్వ మందరికిని నామోదకరమే యగును.

శైశవమునుండియు నేను విద్యాభ్యాసమును గావించుచుంటిని. అక్షర సాహాయ్యమున, జీవితోపయోగి సమస్త విషయములను గూర్చియు, స్పష్టము, నిశ్చితమునగు జ్ఞానము గలుగును అను నమ్మకము నాకు కల్గినది. అందువలన నాకు తీవ్రముగా విద్యాజిజ్ఞాస గల్గినది. నావిద్యాభ్యాస మంతయు పూర్తియైనది. సంప్రదాయానుసారముగ నేను పండితసమూహమున చేరవలసియుండెను; అట్టితరి సంపూర్ణముగా నాయభిప్రాయమును నేనుమార్చుకొంటిని. కారణము; నే ననేకములగు సందేహములందును, తప్పులయందును చిక్కుకొని యున్నట్లు తెలిసికొంటిని. పాండిత్యసంపాదన ప్రయత్నమున అమూల్యమగు నకు నాఅజ్ఞానమును కనుగొనుటతప్ప మరెట్టి పురోగమనమును నేను చేయలేకపోతిని. అయినను, నేను చదువుచున్నది ఐరోపా ఖండమునందలి సుప్రసిద్ధ విద్యాపీఠము. పండితులనునా రెచ్చటనైన నున్నచో అందుగలరని నాతలంపు. ఇతరులచట నేర్చిన దంతయు నాకుగూడ బోధింపబడెను. అక్కడ బోధిం

బడు శాస్త్రములతో నేను తృప్తిపడక, మిక్కిలి అరుదైనవి, కుతూహల జనకములైనవి అని ప్రశంసింపబడు శాస్త్రశాఖిల గూర్చి రచింపబడిన గ్రంథముల నన్నిటిని, నాకు లభించినంత వరకు, చదివితిని. నావిషయమున నితరు లేర్పరచుకొనిన నిశ్చితాభిప్రాయముల నేనెరుగుదును. నాసహపాఠులలో కొందరు మాయుపాధ్యాయుల స్థానముల నాక్రమింప నిర్దిష్టులైయున్నను, వారితో సరిసమానముగ నేనును భావింప బడుచుంటిని. మనీషాగరిష్ఠుల నుత్పాదించుట యందును పెంపొందించుటయందును, మనయుగము, గతించిన యే యుగమునకైన సమానముగనే నాకు గన్పట్టినది. ఈవిధముగ, నాయంతట నేనే యితరులందరినిగూర్చి విచారించు స్వాతంత్ర్యమును తీసికొంటిని. శాస్త్రస్వభావమును గూర్చి పూర్వము నా కొక నమ్మకము కలుగునట్లు చేసిరి. అట్టి స్వభావముగల శాస్త్ర మెద్దియును లేదని నిర్ధారణ చేయు స్వాతంత్ర్యమును తీసికొంటిని.

ఎట్లైనను, విద్యాపీఠములందలి చదువులను గౌరవించుచునే యుంటిని. అందు బోధింపబడు భాషలు ప్రాచీనుల రచనల నర్థము చేసికొనుట కావశ్యకములనియు; నీతికథలు మనస్సును రంజింపజేసి ఉత్తేజపరచుననియు; అవిస్మరణీయములగు నైతిహాసిక కార్యకలాపములు మనస్సు నున్నతస్థితికి గొనిపోవుననియు; వివేకముతోడ వానిని చదివినచో

సయ్యవి యొక నిశ్చయాభిప్రాయమునకు దోడ్పడునన్నియు; ఉత్తమగ్రంథపఠనము, పూర్వయుగ మహామనీషులగు తద్రచయితలతోడి సంభాషణవంటిది — అందును శ్రేష్ఠములు మిక్కిలి వరణీయములు అగు వారి భావములను మాత్రమే వ్యక్తము సేయునట్లు నేర్పుగా సాధింపబడిన సంభాషణవంటిది, అనియు— వాగ్మిత్వమునకు అసదృశమైన శక్తియు అందము గలవనియు; కవిత్వమున హృదయంగమమగు ఆకర్షణయు, ఆనందమును గలవనియు; గణితశాస్త్రమునందు మిక్కిలి సూక్ష్మములగు విషయములను కనుగొనిరి; జిజ్ఞాసులను తృప్తిపరచుటకు అవి మిక్కిలి తోడ్పడుచున్నవి; సమస్త మనుష్యశ్రమను తగ్గించుచున్నవి; అనియు; అత్యుపయోగకరములగు పెక్కు బోధలు, ఉపదేశములు నీతిశాస్త్రగ్రంథములలో గలవనియు; ఈశ్వరవిజ్ఞానశాస్త్రము స్వర్గ (మోక్ష) మార్గదర్శకమనియు, సత్యభ్రాంతిని గలిగించురీతిగా, సమస్త విషయములను గూర్చియు ప్రసంగించుశక్తిని మనకు దర్శనశాస్త్రమిచ్చి అపండితుల మెప్పును సంపాదించుననియు, ధర్మశాస్త్రము, వైద్యశాస్త్రము మొదలగునవి తత్సాధకులగు గౌరవసంపదలను లభింపజేయుననియు, నాకు తెలియును.

వాని యన్నిటితోడి పరిచయమును మన కుపయోగకరమే, అంధ విశ్వాసపూర్ణములు, దోషజుష్టములు అయిన వానితోగూడ: అందువలన వాని నిజమైన విలువను మనము

గ్రహింపగలము; అవి మనలను మోసగింపకుండ, మనలను మనము రక్షించుకొనగలము.

భాషల నభ్యసించుటకును, ప్రాచీనుల గ్రంథములను, వారి చరిత్రలను, పురాణములను చదువుటకును, తగుకాలమును ఇదివరకే వినియోగించితినని నానమ్మకము. ఏలన, ఇతర యుగముల వారితో సంభాషించుటయు, వారితో పర్యటన గావించుటయు నించుమించుగా నొక్కటే. విభిన్న దేశముల పద్ధతులనుగూర్చి కొంత తెలిసికొనుట ఉపయోగకరము. మన పద్ధతులను గూర్చిన సరియగు నిశ్చితాభిప్రాయము నేర్పరచు కొనగలుగుటకును, మన ఆచార వ్యవహారములకు విరుద్ధమైన ప్రతివిషయమును హాస్యాస్పదము, అయుక్తము అని తలంపకుండుటకును,-తమ దేశమునుగూర్చిమాత్రమే అనుభవమున్న వారికి సాధారణముగా తోచు పర్యవసానమేయిది—భిన్న దేశజ్ఞాన మవసరము. అది యట్లుండ, పర్యటనయందే హెచ్చుకాలము గడపినచో మన మాతృదేశమునకే మన మపరిచితులు మయ్యెదము. మరియు పూర్వాచారముల విషయమున అతికుతూహలము గలవారమైనచో ఇక్కడ, ఇప్పుడు జరుగుచున్నదాని విషయమున సాధారణముగ నజ్ఞులమై యుందుము. పైగా అసంభావ్యములగు ననేక సంఘటనలను సంభావ్యములుగా పురాణగాథలు వ్యక్తము చేయును. ఇతిహాసము లెంత యథార్థములైన గావచ్చును; విషయమును

పూర్ణముగా అస్తవ్యస్తము గావింపకపోవచ్చును; తమ్మెక్కువ పఠనయోగ్యములుగా చేసికొనుటకై తమప్రాముఖ్యము నతిశయముగా చెప్పకపోవచ్చును. అట్లయ్యు, అవి ఇంచుమించుగా నెల్లప్పుడు, కనీసము, సామాన్యములును ఆకర్షణ శూన్యములును అగు పరిస్థితులనైన విడిచిపెట్టును. కాబట్టి ఆ మిగిలినది సత్యమును చెప్పదు. ఇక వీనినుండి ఉదాహరణములగైకొని, వానిబట్టి తమ ఆచరణమును సంయతము చేసికొనువారు, కల్పిత కథలలోని సాహసిక సైనికులవలె 'అతి' లో పడినవారై తమ శక్తులకు మించిన ప్రణాళికలను వేయుదురు.

వాగ్మిత్వమును నే నెక్కువగా సంభావించితిని. కవితా స్వాదనమున నానందోద్రిక్తుడ నైతిని. కాని అవి రెండును సహజముగా వచ్చు ప్రకృతి ప్రసాదములుగాని అధ్యయనఫలములు కావని తలంచితిని. బుద్ధిబల మధికముగా గలిగియుండి తమ ఆలోచనలను స్పష్టములు సుగమములు అగున ట్లేర్పరచుకొన నేర్పుగలవారు. 'లోయరు బ్రిటానీ' భాషలో మాటలాడినను సంవాదశాస్త్ర సూత్రములతో అపరిచితులైనను తాము ప్రతిపాదించునది సత్యమని యితరు లంగీకరించునట్లు చేయ నెప్పుడును కడు సమర్థులు. అత్యంతము, సంతోషదాయకములైన కల్పనాశక్తులు గలిగి మిక్కిలి ఆకర్షణీయముగా వానిని వ్యక్తీకరింపగలవారు కవితాకళ నభ్యసింపకున్నను ఉత్తమ కవులే.

గణితశాస్త్రమందలి హేతువుల యథార్థత్వ ప్రామాణికత్వములవలన, తచ్ఛాస్త్రముపట్ల నేను విశేషముగా సంతుష్టుడ నైతిని. కాని దాని వాస్తవోపయోగము నాకప్పటికి అవగతము కాలేదు. కేవలము యాంత్రిక కళాభివృద్ధికే గణితశాస్త్రము తోడ్పడునని తలంచి, అంతటి బలీయములు సుదృఢములు నగు పునాదులపై ఇంతకంటె నున్నతతరమగు నుపరినిర్మాణము లేకుండుట కాశ్చర్యపడితిని. ఇంకొకవంక ప్రాచీననీతిశాస్త్రజ్ఞుల గ్రంథములను, ఇసుక, బురద తోడి పునాదులకంటె మంచిపునాదులులేని మహోన్నతవైభవోపేతములగు సౌధములతో పోల్చితిని. వారు సద్గుణముల నత్యధికముగ ప్రశంసింతురు. పృథ్విపై గల యేవస్తువుకంటె నవ్వానిని ప్రశస్తతరములుగా ప్రదర్శింతురు; కాని అవి యెట్టివో తెలిసికొను మార్గమును బోధింపజాలరు. మరియు వారు చక్కని పేరు పెట్టినది తరచుగా వ్యర్థతాటస్థ్యమో, గర్వమో, నిస్పృహయో, పిత్తృహత్యయో అయి యుండును.

మన ఈశ్వరమీమాంసను నేను గౌరవించితిని. ఇతరులకువలెనే నేనును స్వర్లోకమును చేరగోరితిని. మరియు ఆమార్గము మహావిద్వాంసునకును, అత్యంతము, అజ్ఞునకును సమానముగనే అందుబాటులో నుండుననియు, స్వర్గదములగు భగవత్ప్రసాదిత సత్యములు మనబుద్ధి కతీతములనియు, నిశ్చయముగా తెలిసికొని నాబుద్ధ్యశక్తికి వానిని గురిచేయ సాహసింపలేకపోయితిని. మరియు, సమర్థతతో తత్పరీక్షను కొనసాగించుటకు ప్రత్యేకమగు భగవత్సాహాయ్యమును అతిమానవత్వమును ఆవశ్యకములని తలంచితిని.

సుప్రసిద్ధులగువారు తరముల తరబడి దర్శనశాస్త్రమున కృషిచేయుచున్నారు. అయినను తచ్ఛాస్త్రమున వాదగ్రస్తము కానట్టి—కావుననే సంశయాతీతమైనట్టి—విషయమొక్కటియైనలేదు. ఇది చూచిన తరువాత, అందితరుల కంటె నాకెక్కువ విజయము కలుగునని సంభావింప సాహసింపలేకపోయితిని. ఈయొక్క మాటయే దర్శనశాస్త్రవిషయమున నేను చెప్పగలను. మరియు నేవిషయమును గూర్చియైనను సత్యమగు నభిప్రాయ మొక్కటియే యుండుట సాధ్యమైయుండ, విద్వాంసులలో ఒకే విషయమును గూర్చి పరస్పరవిరుద్ధములగు నానాభిప్రాయము లుండుట గమనించి, సంభావ్యమాత్ర మైనదంతయు నించుమించుగా నసత్యమనియే నేను లెక్కించితిని.

ఇక ఇతరశాస్త్రములు: దర్శనశాస్త్రమునుండియే వాని సూత్రములు గైకొనబడినందున, అంతటి బలహీనములగు పునాదులపై లేచిన బహిర్నిర్మాణమెద్దియు దృఢముగా నుండదని నిశ్చయించితిని. వానిలో నేను కృషిచేయ నిశ్చయించుటకు వానివలన కలుగు గౌరవము కాని, లాభముగాని చాలనవికావు. ఎందుకన, నాభాగ్యాభివృద్ధికై శాస్త్రము నొక

విపణివస్తువుగా చేయవలసిన పరిస్థితిలో నేను లేనందులకు భగవంతునకు వందనములు. సమస్తమును హేళనపూర్వకముగ తూలనాడు కొందరు తార్త్వికులవలె ఖ్యాతిని నే నేవగించునట్లు నటింపకపోయినను, కల్పితములగు బిరుదుల ద్వారా మాత్రమే సంపాదింపనగు గౌరవమును మిక్కిలి చులకనగా చూచితిని. ఇక అసచ్ఛాస్త్రములు: రసవాదుల బూటకమునుండి, ఐంద్రజాలకుని తంత్రములనుండి, తెలియని వస్తువులను గూర్చి తమకు తెలిసినట్లు నటించువారి వంచనాప్రగల్భములనుండి, మోసపోకుండ తప్పించుకొనుటకు వలసినంతవరకు, మిథ్యాశాస్త్రముల విలువను తెలిసికొని యుంటినని నాతలంపు.

ఈకారణములచే, వయసువచ్చి బోధకుల అదుపునుండి బయటపడినంతనే, నేను సంపూర్ణముగా విద్యాధ్యయనమును మానివేసితిని. మరియు, నాయొక్కయు, జగత్తను మహాగ్రంథముయొక్కయు జ్ఞానమును తప్ప మరేశాస్త్రమును ఇక అన్వేషింపనని నిశ్చయించుకొంటిని. మిగిలిన నా యౌవ్వన మంతయు పర్యటనయందును రాజసభలను సైన్యములను సందర్శించుట యందును, విభిన్నప్రకృతులు, అధికారములుగల మనుష్యులతో సంభాషించుటయందును, విభిన్నానుభవములను గడించుటయందును, విధివశమున విభిన్నపరిస్థితులలో పడిన నన్ను నేనే పరీక్షించుకొనుటయందును, అన్నిటికంటె మిన్నగా నాయభివృద్ధిని స్థిరపరచుకొనుటకై, అనుభూత విషయములను

మననము చేయుటయందును గడపితిని. కారణము: ఊహా చోదిత విషయములనుగూర్చి తన అధ్యయనకక్ష్యలో పండితుడొకడు హేతువాదములను జరుపును. వ్యావహారికముగ నా హేతువాదములు కొరగానివి. వ్యవహారజ్ఞానమున కెంతదూరమో లైన అంత అధికముగా అవి యాతని వ్యర్థగర్వమును హెంపొందించును. అంతకుతప్ప నితరమగు సంబంధమెద్దియు వానితో ఆతనికిలేదు. అట్టిసమయమున వానిని సంభావ్యములుగా చేయుటకు అధికకళాకౌశల మావశ్యకము. ఇట్టి పండితుని హేతువాదములందుకంటె, ప్రతివ్యక్తియు గావించు హేతువాదములలో, ఎక్కువ సత్యమును కనుగొనగలనని నాకు తోచినది. కారణము: ఈ హేతువాదములలో ఆ వ్యక్తి స్వయముగా నాసక్తుడై యుండును. తప్పు నిర్ణయమును గావించుచో తత్ఫలితముగ తద్ క్షణమే ఆతడు శిక్షింపబడుట కవకాశము గలదు. పైగా జీవితమున సవ్యమార్గమేదో స్పష్టముగా విచక్షణచేసి, విశ్వాసముతో దానియం దగ్రసరుడను అగుటకై, సత్యమును అసత్యమునుండి వేరుపరచుట యెట్లో తెలిసికొనవలె నను నత్యుత్కటమగు జిజ్ఞాస నా కెల్లప్పుడు నుండెను.

ఇతరమనుష్యుల పద్ధతులను, ఆచారములను గమనించుటయందు మాత్రమే, నిమగ్నుడనై యున్నప్పుడు నిశ్చితాభిప్రాయమున కిచ్చటగూడ నెట్టియాధారమును మృగ్య

మని నేను కనుగొంటిని. మరియు ఇందలి వైరుధ్యము, దార్శనికాభిప్రాయములందలి వైరుధ్యమున కేమాత్రమును తక్కువ కాదని గుర్తించితిని. కాబట్టి, మనమనస్సున కెంతయు విపరీతముగను, పరిహాసాస్పదముగను గన్పట్టు విషయములనేకములు ఇతరములగు పెద్దజాతులచే పరిగ్రహింపబడుటయు అంగీకరింపబడుటయు గమనించి, కేవలము ఉదాహరణమూలమున గాని, ఆచారమూలమున గాని సత్యములుగాతోచు నెద్దానినిగూర్చియు సునిశ్చితాభిప్రాయము కలిగియుండరాదని నేర్చుకొంటిని. అదియే నే నీయధ్యయనమువలన పొందిన మహాలాభము. ఈ విధముగ స్వాభావికమగు తన తెలివిని మలీమసముగావింప శక్తిగల్గినవియు, చాలదనుక బుద్ధ్యుపదేశము నాలింప శక్తిలేకుండ మనలను చేయగలిగినవియు అగు తప్పులనుండి మెల్లమెల్లగా తప్పించుకొంటిని. కాని, అనేక సంవత్సరములు ఇట్లు ప్రపంచమను గ్రంథమును అధ్యయనము చేయుటయందును, కొంత అనుభవమును సంపాదింప యత్నించుటయందును, గడపిన పిమ్మట, చిట్టచివరకు నన్నే అధ్యయన విషయముగా చేయ కృతనిశ్చయుడ నైతిని. మరియు నే ననుసరింపవలసిన మార్గముల నెన్నుకొనుటయందే నామనశ్శక్తులనన్నిటిని వినియోగింప నిశ్చయించితిని. నాదేశమును నా పుస్తకములను నే నెన్నడును వదలకుండ నున్నచో కలిగియుండెడి విజయముకంటె అధికతరమగు విజయమునే నేను సాధించితిని.

ద్వితీయ భాగము

అప్పటి కింకను జర్మను దేశమునందలి యుద్ధము లంతము కాలేదు. అయుద్ధములు నన్నాకర్షింపగా నే నాదేశమునందుంటిని. చక్రవర్తియొక్క పట్టాభిషేకమునుండి సైన్యము నకు తిరిగి వచ్చుచుండగా, హేమంతర్తు ప్రవేశము ననొక ప్రదేశమున నరికట్టినది. అందు నన్నాకర్షింపగల సమాజములు లేవు. అదియుగాక, అదృష్టవశమున ఎట్టి చింతలు గాని రోగములుగాని నన్ను బాధింపలేదు. అందువలన దినమంతయు నే నేకాంతమునందే గడపితిని. నా యాలోచనలయందే నా శ్రద్ధను కేంద్రీకరించుట కది పరిపూర్ణమగు నవకాశము. అందు నాకు తట్టిన ఆలోచనలలో మొట్టమొదటిది. సిద్ధహస్తుడగు నొక్కనిచే పూర్తికావింపబడిన పనులయందుండు పరిపూర్ణత భిన్నజనకృతములును, వివిధ భాగనిర్మితములునుఅగు పనులయందుండదు. ప్రారంభమందు ఏవో ప్రయోజనములకై కొందరు గోడలుకట్టిరి. ఆప్రయోజనములను విస్మరించి మరికొందరు ఆ ప్రాత గోడలను గైకొని, మరికొన్ని ప్రయోజనాంతరములతో కట్టడములు కట్టిరి. ఈ కట్టడములకంటె ఒకేస్థపతి యోజనచేసి నిర్మించిన కట్టడములు సామాన్యముగ ఎక్కువ సుందరములు విశాలములు అయి ఉండుట కాననగును. మొట్టమొదట పల్లెలుగానుండి కాలక్రమమున పెద్దపట్టణములుగా మారిన ప్రాచీననగరముల

విషయముగూడ నట్టిదే. స్థాపత్యమే వృత్తిగా గలవాడు, సువిశాలమగు మైదానమున యోజించి సక్రమముగా కట్టిన పట్టణములతో పోల్చినచో అవి సామాన్యముగా అసంబద్ధ ములై యుండును. దీని పర్యవసానము : ప్రాచీననగరము లందలి వివిధసౌధములు దేనికది ప్రత్యేకముగ చూచినచో, అందమున, నవీననగరసౌధములతో సరిగా వచ్చును ; వానిని మించియు నుండవచ్చును. అట్లయ్యు, ఆసౌధము లొక పద్ధ తిలోలేక గుమిగూడి యుండుటయు, ఒకచో పెద్దసౌధమును ఇంకొకచో చిన్నయిల్లును ఉండుటయు, తత్కారణముగ వీధులన్నియు వంకరటింకరగను, క్రమతాహీనముగను ఉండు టయు చూచినచో బుద్ధిచోదితమైన మానవసంకల్పముగాక అసహజమగునది ఎద్దియో అట్టి నిర్మాణమునకు దారితీసి యుండునని చెప్పనగును. అయినను, స్వంతకట్టడములు, నగరాలంకరణ పరిపోషకముగ నుండునట్లు చూచుటకై, ప్రతి కాలమునందును కొందరధికారు లుండెడివారను విషయమును మనము గమనించినచో, ఇతరుల కష్టముపై నాధారపడుచు నిజముగా సంపూర్ణమైనదానిని పొందుట ఎంత కష్ట సాధ్యమో తప్పక మనము గ్రహింపగలము. ఇట్టి యభిప్రా యములే నాకు కొన్ని జాతులయెడ గలవు. అవి ప్రారంభ మున ఇంచుమించుగా బర్బరస్థితియందుండి, మెల్లమెల్లగా పురోగమించుచు నాగరకము లగును : వారి శాసనములు, ప్రత్యేకములగు కొన్ని నేరములకు, తగవులకు సంబంధించిన

బాధలవలన మాత్రమే క్రమక్రమముగా నిర్ణీతములై బలా త్కారముగ వారిపై ప్రయుక్తము లాయెనా అనునట్లుండును.

సంఘములుగా నేర్పడుటకు ప్రారంభించిన నాటినుం డియు కొన్నిజాతులు బుద్ధిశాలియగు నొక ధర్మప్రవర్తకుని కట్టడుల ననుసరించి యుండును. ఇందు, మొదట చెప్పబడిన జాతులయందలి సంస్థలు, రెండవవానియందలి సంస్థలకంటె అసంపూర్ణములై యుండునని, నేనూహించితిని. ఈవిధముగ, ఈశ్వరునినుండి శాసనములు పొందిన సత్యధర్మస్వరూపము తక్కిన యే ధర్మముకంటె అనూనాతిశయము కలిగియుండు ననుట నిశ్చితమే. ఇక మానవసంబంధి విషయములగూర్చి విచారింతము. స్పార్టాయొక్క- పూర్వాధిక్యమునకు, ప్రత్యేక ముగా తద్దేశమునందలి ప్రతి శాసననును మంచిదిగానుండుట కారణము గాక, తచ్ఛాసనములన్నియు నేకవ్యక్తికృతములై యేకైకలక్ష్యప్రవణము లగుటయే కారణమని నా నమ్మ కము. ఏలన, ఆశాసనములలో ననేకములు చాల వింతగను, అతి విరుద్ధముగ నుండును. అదే విధముగ, అనేకవ్యక్తుల అభిప్రాయములను ప్రోగుచేయుటవలన నేర్పడిన గ్రంథము లందలి శాస్త్రములు (నిరూపణ రహితములగు సంభావ్య తర్కములతో నిర్మింపబడినవి కనీసము) సద్బుద్ధి గల మనుష్యుడు, స్వాభావిక నిష్పాక్షికవివేచన నుపయోగించి, స్వానుభవములను గూర్చి చేయు సరళానుమానములకంటె ఎక్కువగా సత్యదూరములని నేను తలంచితిని. మనమందర

మును బాల్యస్థితినుండి ప్రౌఢత్వమును పొందవలసినదే కావు నను, అనివార్యముగా కొంతకాలము ఇంద్రియోద్రేకముల చేతను గురువులచేతను (గురూపదేశములు తరచుగా పరస్పర విరుద్ధములు; బహుశః వారెల్లప్పుడు మన మంచికొరకే ఉపదేశించువారుకారు) పరిపాలింపబడినవారము కావునను, జన్మాదినుండియే మనబుద్ధి పరిపక్వమైయుండి, ఆ బుద్ధి సాహాయ్యముననే మనము పోయినచో, మన నిశ్చయాభిప్రాయము లెంత సుదృఢములుగా నుండెడివో, అంత సుదృఢములుగా ఇప్పు డుండుట దాదాపు అసంభవమనియు నేను తలంచితిని.

పీఠు లందముగా నుండునట్లు వేరువిధమున కట్టుటయే ప్రయోజనముగా, ఒక పట్టణమునందలి యిండ్ల నన్నిటిని పడగొట్టుట ఆచారముకాదు. ఇది సత్యము. కాని ప్రత్యేకవ్యక్తియొకడు, తనయింటిని సరిక్రొత్తగా కట్టుకొనుటకై దానిని పడగొట్టుట తరచుగా జరుగుచుండును. మరియు, ఇండ్లు ప్రాతబడి కూలు నపాయిస్థితియం దున్నప్పుడును, పునాదులు సురక్షితమగు స్థితియందు లేనప్పుడును జనులప్పుడప్పుడు ఇట్లు చేయుట తప్పనిసరియగును. దీనిని ఉదాహరణముగ గైకొని ఒకరాష్ట్రమును సంస్కరింపదలంచి, ఒకప్రత్యేకవ్యక్తి అందున్న వన్నియును మార్చి, దానిని తిరిగి స్థాపించుటకై ఆద్యంతము పడగొట్టుట అసంగతమని ఒప్పుకొంటిని. మఱియు శాస్త్ర స్వరూపమును, లేదా, విద్యాపీఠములలో ప్రతిష్ఠితమైయున్న

బోధనా పద్ధతిని, సంస్కరించుట సంభావ్యము గాదని తలంచితిని. ఇక అప్పటివరకు నేను గ్రహించియున్న అభిప్రాయముల విషయము: వానిని సంపూర్ణముగా పరిత్యజించుటయే సర్వోత్తమమని నేనుతలంచితిని. అందువలన, నాకు పూర్వాభిప్రాయములకంటె సరియగు అభిప్రాయములను గ్రహింప నవకాశముండును, లేదా, వివేకకృత నిశిత పరీక్ష గడచిన తరువాత పూర్వాభిప్రాయములనే గ్రహింపవచ్చును. ప్రాతపునాదులపై ఇండ్లను నిర్మించునట్లు, సత్యమును విచారింపక, యీవనమున, కేవలము నమ్మకముపై గ్రహించిన సూత్రములపై నాధారపడుటకంటె, ఈవిధముగ నా జీవితమును నడుపుకొనుటలో అత్యధిక విజయమును పొందగలనని నేను గట్టిగా నమ్మితిని. ఎందుకనగా, ఈప్రయత్నములోనున్న వివిధకష్టములను నేను గుర్తించితిని. కాని ఇవి అతిక్రమింప నశక్యములుగావు; కాక ప్రజలతో ప్రత్యక్ష సంబంధము గలవానిని, మిక్కిలి సామాన్యముగనైనను, సంస్కరించునపుడు మనకెదురగు కష్టములతో పోల్చదగినవికూడ కావు. ఒకసారి కూల్పబడెనేని, మహాసంస్థలను మరల నిలుపుట అతికష్టము. ఒకసారి ఉద్రూత లూగింపబడినచో వానిని నిలువుగా ఎత్తియుంచుటయు మిక్కిలి కష్టమే. మరియు నట్టివాని పతనము సర్వదా విపత్కరము. ఇక వాని లోపము లేవైన నున్నవేని (అట్టి లోపములనేకములు గలవని మనలను గట్టిగా నమ్మింప వాని బహుత్వమొక్కటియే చాలును) వానిని నిస్సందేహముగా ఆచారము

మిక్కిలి సరిచేసియే యున్నది. ఇచ్ఛాపూర్వకమగు భావనతో నిశితముగా ఎదురొక్కిన నెన్నడును శక్యముగాని అనేకములగు లోపములను సంపూర్ణముగా తుడిచివేసినది; కొన్నిటిని మనకు తెలియకుండగనే సరిదిద్దినది. గండశిలలపై కెక్కుచు, నిర్ఘాతిలోతునకు దిగుచు, తిన్నని మార్గము నన్వేషించుట కంటె నిరంతరోపయోగమువలన క్రమముగ స్నిగ్ధములును, విశాలములును అగు పర్వతమార్గముల ననుసరించుట నయమైనట్లు, పర్యవసానమున, తల్లోపనిర్మ్మలనమున కవసరమగు మార్పుకంటె, ఇంచుమించుగా నెల్లప్పుడును ఆలోపములే సహింపదగినవి.

కావుననే, జన్మచేగాని అదృష్టముచేగాని ప్రజా వ్యవహార నిర్వహణమున పాల్గొన నాహూతులుగాకయు, సదాసంస్కరణములకై అన్వేషించు నింపాదిలేని నిర్వ్యాపార వ్యాపారుల నెంతమాత్రము నే నామోదింపజాలను. మరియు నేనటువంటి పోరపాటు వాతబడితి ననుసందేహమును దృఢపరచునది సుంతైనను ఈ వ్యాసమందు గలదని తలంచితినేని, నేనెవ్విధమునను ఇచ్ఛాపూర్వకముగ దానిప్రకటన కొప్పుకొనను. సంపూర్ణముగ మదీయములగు పునాదులపై నాధారపడియున్న నా స్వంత అభిప్రాయములను సంస్కరించుకొనుటయే నా ఉద్దేశ్యము. నా పరిశ్రమలవలన నాకు సంతృప్తి కలిగినది. వానినిగూర్చి మీకు నేను వివరించుటకు

ఆ సంతృప్తియే కారణము. అట్లయ్యు అట్టి ప్రయత్నములందు అందరును పాల్గొనవలెనని ఉపదేశించు నిచ్ఛ నాకులేదు. భగవదనుగ్రహము సమృద్ధిగా కలవారు బహుశః ఇంతకంటె అత్యుత్కృష్టములగు యోజనలు గావింతురు. కాని అధిక సంఖ్యాకులకు ఇక్కడ నేను ఉపపాటించునది కూడ ప్రమాదభరిత మేమో అని నా భయము. ప్రాతవిశ్వాసములన్నింటి నుండి విముక్తి నందవలె ననుసంకల్పము ప్రతివ్యక్తియు చేయదగినదికాదు. మనుష్యులలో అధిక సంఖ్యాకులు క్రిందిరెండు వర్గములుగా నేర్పడియున్నారు. అందెవరికిని ఇది తగినసంకల్పము కానేరదు. మొదటివర్గము! వీరుతమశక్తులలో తగని విశ్వాసము కలిగియుందురు; శీఘ్రముగా తమ నిర్ణయములకు వత్తురు; తమ ఆలోచనలను క్రమబద్ధము గావించుటకు అవసరమగు నోర్పు వారికుండదు. కావుననే ఈవర్గమువారు పూర్వము వా రంగీకరించిన అభిప్రాయములను సందేహించు స్వాతంత్ర్యమును తీసికొని, క్షుణ్ణమగు రాజమార్గమును వీడినచో, త్వరగా గమ్యస్థానమునకు గొనిపోవు సరియగు త్రోవ కనుగొని అనుసరింపలేరు. ఉపరి అమార్గమునబడి జీవితాంతము పరిభ్రమించుచునే యుందురు. రెండవ వర్గము: సత్యాసత్యములు వివేచించు శక్తిలో తమ్మతిశయించువా రున్నారనియు, వారు తమకు బోధింపదగినవా రనియు, తెలిసికొనుటకు కావలసిన బుద్ధి, లేక వినయము వీరికి కలదు. అట్టివీరు ఇతరుల అభిప్రాయములతోడనే తృప్తివహించుట

యుక్తము; స్వప్రయత్నములలో వానిని సరిచేయ యత్నింపరాదు. ఇక నా విషయము: కేవలము ఒకే ఉపాధ్యాయునివలన విద్య నేర్చుకొని యున్నను, లేక, అనాది కాలమునుండియు మహాపండితులలో నున్న అభిప్రాయభేదములను ఎన్నడు ఎరిగి యుండకపోయినను, నేను నిస్సందేహముగా రెండవవర్గమునకు చెంది యుండవలసినవాడనే, కాని, ఎంతటి అవిశ్వసనీయము, ఎంతటి అసంగతము అయిన అభిప్రాయము నూహించినను, అది ఎవరో ఒక దార్శనికునిచే ప్రతిపాదింపబడియే యున్నదని కళాశాలాజీవితమందుండు నాటికే నాకు తెలిసినది. మనకు జుగుప్సాకరములుగ కానవచ్చు నభిప్రాయములు కలవారందరు, తత్కారణమున బర్బరులును, అడవిమనుష్యులును కానియు, పైగా, వారిలో అనేక జాతులవారు, మనకంటె ఎక్కువగా కాకపోయినను కనీసము సమానముగనైనను తమ బుద్ధి నుపయోగించుచునే యున్నారనియు, తరువాత నా పర్యటనలలో గమనించితిని. బాల్యమాదిగ ఫ్రాన్సుదేశమందో లేక, జర్మనీదేశమందో, పెరిగిన వ్యక్తి నడత ఒకతీరున నుండును. ఆ వ్యక్తియే, బాల్యమాదిగ నైనాదేశస్థుల మధ్యనో లేక మనుష్యాశనులగు అడవి మనుష్యుల మధ్యనో పెరిగినచో, అతని నడత మరొక తీరున నుండును. పదేండ్లక్రితము మనకు సంతోషజనకములైన దుస్తులనైఖరి ఈ క్షణమున సంతోషదాయకము కాకపోవచ్చును; విపరీతముగను, పరిహాసాస్పదము

గను, గన్పట్టవచ్చును. అట్లే పదేండ్లు గడువక ముందే ఆనుకూల్యమును సంపాదింపగల దుస్తులు, ఇప్పుడు విపరీతములుగ పరిహాసజనకములుగ నుండవచ్చును. ఇట్లు మనలను ప్రోత్సహించుశక్తి నిశ్చితజ్ఞానమునందు కంటె ఎక్కువగా, ఆచారమునందును, ఉదాహరణమునందును గలదని నేను గ్రహించితిని. మరియు, మన అభిప్రాయముల కాధారము అట్టిది. అయినను, బహుజనసమ్మతియందు సత్యము తప్పక ఉండునని అనరాదు. ఎందుకనగా: అట్టి సందర్భములయందు బహుజనులుగాక ఒక్కడే సత్యమును కనుగొనుట ఎక్కుడు సంభావ్యము. ఎటులైనను, గ్రాహ్యములగు నభిప్రాయములు గల వ్యక్తిని జనసమూహమునుండి గైకొనలేకపోయితిని. కావున, నా జీవితమును నడపుకొనుటలో నాబుద్ధినే ఉపయోగింప నావశ్యకమాయెను.

కాని, ఒంటరిగా చీకటిలో నడచుచున్నవానివలె, మెల్లగను ముందువెనుకలు చూచుకొనుచు, నడచుటకు నిశ్చయించుకొంటిని. అందువలన, బహుదూరము పోలేకపోయినను, కనీసము, పడకుండనైన నన్ను నేను రక్షించుకొనగలను. వివేకముచే ప్రవేశపెట్టబడక, నామనస్సులో స్థిరీకృతములై యున్న యభిప్రాయములలో నెద్దానినిగూడ వెంటనే వదలుటకైనను నే నిష్టపడలేదు. శిథిలగృహములలో నివసించువారు, దాని స్థానమున మరొక ఇంటికి ప్రణాళిక వేయువరకు, ఆ

మొదటి యింటిని పడగొట్టబోరు. అట్లే మొదట నేను ప్రారంభింపనున్న ప్రణాళికనుగూర్చి యోజించుటకును, నిజమైన పద్ధతిని, అనగా నామనస్సు గ్రహింపగలిగినంతదనుక సమస్త వస్తు జ్ఞానమునకును నాకు మార్గదర్శకము కాగలదని నేను విశ్వసింప దగినదానిని, అన్వేషించి నిశ్చయించుకొనుటకును నాకు కాలవ్యవధి కావలెను.

యౌవన ప్రారంభదశలో దర్శనశాస్త్ర శాఖలయందు తర్కమును, గణితశాస్త్ర శాఖలలో రేఖాగణిత విశ్లేషణమును, బీజగణితమును కొంచమభ్యసించితిని; ఈమూడుకళలు, లేక, శాస్త్రములు నా ఉద్దేశ్యమునకు కొంత దోహదము చేయ వలసినవే. కాని, విచారింపగా, తర్కశాస్త్ర న్యాయములు తదితర బహుళ బోధలు, అజ్ఞాత విషయ పరిశోధనమునందు కంటె, జ్ఞాతవిషయములను ఇతరులకు తెలియజేయుటయందును, లేదా 'లల్లీ' యొక్క కళవలె, మనకు తెలియని వస్తువులనుగూర్చి, నిర్ణయరహితముగా మాటలాడుటయందును ఎక్కువగా పనికివచ్చును. ఈశాస్త్రము సరియగు, మిక్కిలి చక్కని, బోధలు కలిగి యున్నదైనను, వానితోపాటు అనేకములైన అపాయకరములగు, లేదా అనావశ్యకములగు, బోధలను కలిగి ఉండుటచే, అసత్యవిషయములను సత్యవిషయములనుండి విడదీయుట, మోటయిన పాలరాతినుండి ఒక 'డయానా'నో లేక 'మినర్వా' నో వెలికితీయునంతగా దాదాపు

కష్టము. ఇక ప్రాచీనుల విశ్లేషణయు, ఆధునికుల బీజగణితమును: అవి అత్యున్నతములగు అమూర్తవిషయములను, ఉపయోగము లేనట్టి బాహిర విషయములను ఆకళించుకొనును. అంతేకాక, అందు మొదటిది ప్రత్యేకించి రేఖాచిత్రముల పర్యాలోచనకే సీమాబద్ధమగుటచే భావనాశక్తిని మిక్కిలి అలయింపక, అర్థగ్రహణశక్తిని ప్రవర్తింపనీయదు. ఇక రెండవది: అయ్యది కొన్ని నిబంధనలకును, ఆవశ్యకతలకును సంపూర్ణముగా లోబడియుండును. అందువలన మనస్సును అభివృద్ధిపరచుటకు సహకరించు శాస్త్రమునకు బదులుగా, మనోగతిని అడ్డగించునట్టి అస్పష్టమును, క్లిష్టమును అగు కళయే పర్యవసించుచున్నది. ఈ యోజనలచే, ఈమూడింటి లాభములును గలిగి, వానిదోషములనుండి విడివడిన పద్ధతిని మరొక దాని నన్వేషింప ప్రోత్సహింపబడితిని. శాసన బహుత్వము తరచు న్యాయనిరోధకమగును. కావున, కొలది శాసనములు మాత్రమే కలిగి, వానిని కఠినముగా ఆచరణలోనికి తెచ్చిన రాష్ట్రము చక్కగా పరిపాలింపబడును. ఆ విధముగనే తర్కశాస్త్రనిర్మాణమునకు ఉపకరించిన అతిసంఖ్యాకములగు బోధలకు బదులుగా, ఈక్రింది నాల్గునియమములును నాకుచాలునని నేను నమ్మితిని. దీని కొక నియమము: ఎప్పుడును, ఒక్క పర్యాయముకూడ వాని ననుసరించుటలో అశ్రద్ధచేయను అను దృఢమును అచంచలమును అగు నిశ్చయమును చేసికొనవలెను.

నాకు స్పష్టముగా సత్యమని తెలియని దానిని దేనిని సత్యముగా, నే నెన్నడు పరిగ్రహింపను, అనునది మొదటిది. అనగా తొందరపాటును, పక్షపాతమును కచ్చితముగా విడనాడుట; మరియు సందేహాస్పదమగున దంతయు త్రోసిపుచ్చి, నామనస్సునకు స్పష్టముగను, విశదముగను తట్టిన వానిని తప్ప మరెద్దానిని నా నిశ్చితాభిప్రాయమునందు చేర్పకుండుట.

నేను పరీక్షించుచున్న చిక్కులలో ఒక్కొక్కదానిని, తత్సముచిత పరిష్కారమున కవసరమగు నన్ని భాగములుగ, విభజించుట అనునది రెండవది.

ఒకదానివెంట ఒకటిగా, మెల్లెల్లికినట్లు కొంచెము కొంచెముగా, క్లిష్టతరవిషయములను గూర్చి తెలిసికొనుటకు, చిక్కులి సులభములును, సరళములును అగువానితో ప్రారంభించి నా ఆలోచనలను ఒక క్రమములో నుంచుటయు, అట్లు చేయుటలో స్వభావమునంజే, పూర్వాపరక్రమరహితములగు వస్తుపులకుగూడ ఒక ఆలోచనాక్రమమును ఏర్పరచుటయు మూడవది.

మరియు: ఎద్దియు విడువబడలేదు అను ఆత్మవిశ్వాసము నాకు గల్గుటకుగాను, ప్రతి సందర్భమునందును పరిగణనము పూర్తిగా చేయుటయు, సమీక్షను సర్వాంకషముగా చేయుటయు అనునది చివరది.

రేఖాగణితజ్ఞులు బహుక్లిష్టములగు నిరూపణలందు గూడ సరళములు, సులభములు అగు దీర్ఘహేతువాదపరంపరలను ఉపయోగింతురు. మనుష్యయోగ్యములైన జ్ఞానవిషయములన్నియు పరస్పరసంబంధము కలిగియున్నవనియు, సత్యమునకు బదులు, మనము, అసత్యమును పరిగ్రహించుట మాత్రము మానివేసి, ఒక సత్యమును మరొక సత్యమునుండి అనుమానించుట కవసరమగు పద్ధతిలో మన ఆలోచనల నెల్లప్పుడు పదిలపరచుకొనినచో, మన అందుబాటునకు దూరముగను, మన మన్వేషణము చేయలేనంత ప్రచ్ఛన్నముగను ఏదియు లేదనియు నేను భావించునట్లుగా అవి చేసినవి. మరియు, అత్యంతసరళములు, సులభములు అగు వానితో ప్రారంభింపవలెనను ఆలోచనకు ఈవరకే వచ్చినవాడ నగుటచే, ఎద్దానితో ప్రారంభించుటవసరము అను విషయమును నిర్ణయించుటలో నాకు స్వల్పకష్టమే కల్గెను. మరియు శాస్త్రములందు సత్యాన్వేషణము చేసిన వారందరిలో గణితశాస్త్రజ్ఞులు మాత్రమే నిరూపణలను, అనగా నిశ్చితములును, స్పష్టములును అగు హేతువులను, కనుగొనగల్గిరని గమనింపగా, వారి పరిశోధనాపద్ధతియు ఇట్టిదే అయిఉండునను విషయమున నాకు సందేహము కలుగలేదు. కావున, అతిసాధారణములగు వస్తువుల పరీక్షతోడనే ప్రారంభించుటకు సంకల్పించితిని. సత్యమును ప్రేమించుటయందును, పెంపొం

దించుటయందును, సరికాని హేతువుల నిరసించుటయందును, నా మనస్సు నలవాటు పరచుటకంటె ఇతరమగు లాభము నెద్దానిని ఇందు నే నాసింపలేదు. కాని, ఇందు నిమిత్తముగా 'గణితశాస్త్రము అను పేరిట సామాన్యముగా వ్యవహృత మగు ప్రత్యేక శాస్త్రము లన్నిటి సాధనకై ప్రయత్నించు నుద్దేశము నాకు లేదు. కాని, వాని విషయము లెంత భిన్నములై యున్నను, తద్విషయగత వివిధ సంబంధములను, లేదా, నిష్పత్తులను, గూర్చిమాత్రమే ఆలోచించునపుడు, అవి యన్నియు నేకమగుట చూచి, మిక్కిలి సామాన్యమగు రీతిని ఈనిష్పత్తులనుగూర్చి విచారించుట నాప్రయోజనమునకు చాల మంచిదని తలంచితిని. ఈ విచారణలో, సంబంధములయొక్క, లేదా నిష్పత్తులయొక్క జ్ఞానమునకు అత్యంతము సహాకరించు వానిని తప్పించి, ప్రత్యేకముగా ఏ విషయములకును ఈ నిష్పత్తుల నన్వయింపను. అందును, అవి న్యాయముగా చెందుటకు వీలగు ప్రతివస్తువర్గమునకు వానిని చెందునట్లు బాగుగా తరువాత చేయగల్గుటకుగాను, వాని నీ వస్తువులకు మాత్రమే సీమాబద్ధము చేసికొను తలంపు నాకు లేదు. ఆపైని, ఈసంబంధముల నర్థముచేసికొనగల్గుటకుగాను, కొన్నిసారులు వాని నొకదాని తర్వాత నొకటిగా పర్యాలోచింపవల్సియు ననియు, కొన్నిసారులు వానిని మనస్సులో ధారణ మాత్రమే చేయవలెననియు, లేదా,

వానిని సమష్టిగా ఆకళింప చేసికొనవలెననియు తెలిసికొని, వైయక్తికముగా వానిని సమ్యగాలోచన చేయుటకు, అంతకంటె సాధారణ వస్తువులను నేను కనుగొనలేకపోవుట వలనను, అంతేకంటె నాభావనకును ఇంద్రియములకును విశదముగా ఉపపన్నములైన విషయములు లేనందువలనను, సరళరేఖలమధ్య మాత్రమే ఆ సంబంధము లున్నట్లుగా చూడవలెనని తలంచితిని; మరియు వేరొకప్రక్క వానిని స్మృతిలో నుంచుకొనగల్గుటకును, లేదా, పెక్కింటి సమష్టిని ఆకళించుకొన గల్గుటకును, వీలైనంత సంక్షిప్తములైన కొన్ని విశిష్ట చిహ్నములద్వారా, వానిని వ్యక్తము చేయవలెనని తలంచితిని. ఈవిధముగ, రేఖాగణిత విశ్లేషణలోను, బీజగణితములోను, ఉన్న శ్రేష్ఠమగు విషయమంతయు సంగ్రహింపగల్గెదననియు, ఒకదానిలోని దోషములను రెండవదాని సాహాయ్యమున దిద్దగలననియు నమ్మితిని.

మరియు, వస్తుతః, ఈ కొలదిబోధలను సరిగా అవలంబించుటవలన, వాని పరీక్షకై వినియోగించిన రెండుమూడు నెలలలో, అదివరకు అతికష్టములని తలంచిన ప్రశ్నలకు సమాధానమును పొందుటయే కాక, అటుతరువాతకూడ నాకు సమాధానము లభింపకుండ నుండెడి ప్రశ్నలకు కూడ సమాధానములను నిర్ణయింపనగు సాధనములను కనుగొనగల్గితిని.

అతి సాధారణములును, అతిసామాన్యములును అగు సత్యము లతో నేను ప్రారంభించినందువలననే, కనుగొనిన ప్రతి సత్యమును తరువాతి వానిని కనుగొనుటలో ఒక నిబంధ నగా ఉపలబ్ధమైన దను సందర్భమునకే ఈ ఫలితముల నారో పింపవచ్చును. ఏ ప్రత్యేకాంశమునకు సంబంధించిన సత్యమైనను ఒకటియే యై యుండును. కావున, ఆ సత్యమును గ్రహిం చినవాఁడు, ఆయంశముపై తెలిసికొనుటకు వీలైనదంతయు తెలిసికొనును అను నంశము గమనింపబడనిచో, ఇందులో నేనెక్కుడుగా అహంకారినైనట్లు బహుశః కన్పట్టును. ఇందుల కొక యుదాహరణము: సంఖ్యాగణిత మూలసూత్రములు బోధింపబడిన యొక బాలుడు, నిబంధన ప్రకారముగా ఒక ప్రత్యేకమగు కూడిక చేసెనేని, ఆ సంఖ్యల కూడికకు సంబం ధించినంతవరకు, ఈ దృష్టాంతములో మానవప్రతిభ కందు బాటులో నున్నదంతయు పొందినాడని నమ్మకముగా వానికి చెప్పనచ్చును. ఇక, పర్యవసానమున, సరియైన క్రమము ననువర్తించుటయును, అన్వేషిత వస్తువుయొక్క స్థితిగతుల నన్నిటిని తు.చ. తప్పకుండ పరిగణించుటయును బోధించుపద్ధతిలో సంఖ్యాగణిత నిబంధనలకు నిశ్చితవిశ్వాసము నిచ్చునదంతయు నంతర్గతమే.

కాని, నిర్విశేష పరిపూర్ణతతో కాకపోయినను, కనీసము నాకు లభించుటకు వీలగునంతటి సంపూర్ణతతో

నైనను, అన్ని విషయములందును నాబుద్ధిని ప్రవర్తింప జేయ గలను అను విశ్వాసమే ఈ పద్ధతివలన నాకు గలిగిన తృప్తికి ముఖ్యకారణము. పైగా, దాని యుపయోగముచే, నామనస్సు క్రమముగా, విషయములయొక్క స్పష్టతర విశదతర భావన లకు అలవాటుపడుచున్నదని తోచెను. మరియు, నేను ప్రత్యేక మగు నేవిషయమునకు ఈపద్ధతిని సీమాబద్ధము చేయనందున దానిని, బీజగణితసఫలతకు తీసిపోని సఫలతతో, ఇతర శాస్త్ర క్లిష్టతలకు గూడ అనువర్తింప నాశించితిని. ఎట్టులైనను, ఈనిమిత్తముగా, శాస్త్రములలో న న్నెదుర్కొనిన క్లిష్టతల నన్నిటిని తత్క్షణమే పరీక్షించుటకు సాహసింపరాదు కదా! ఎందుకనగా అది పద్ధతియందు నిర్ణయింపబడిన క్రమమునకు విరుద్ధ మగును. కాని, దర్శన శాస్త్రమునుండి గైకొనబడిన సూత్రములపైనే అట్టివాని జ్ఞాన మాధారపడి యుండునని గమనించి, ఆ దర్శన శాస్త్రమందు సునిశ్చితమైన దేదియు నాకు దొరకనందున ప్రప్రథమముగా తత్సూత్రములనే స్థాపించుటకు ప్రయత్నింప నవసరమున్నదని తలంచితిని. అదియునుగాక, ఇతరములగు పనులన్నిటికంటె ఇట్టి గవేషణయే అత్యధికముగా ప్రస్తుతమనియు, తొందరపడి నిర్ణయ ములకు వచ్చుటయు, నిర్ణయములకొరకెదురు చూచుటయు నిందుభయజనకములనియు, గమనించితిని కావున పరిణత వయస్కుడ నగువరకు (అప్పటికి నా వయస్సు ఇరువదిమూడేం

డ్లగుటచే) దాని దరి కేగకూడదని తలంచితిని. మరియు, ఆ క్షణమువరకు పరిగ్రహించిన తప్పుడు అభిప్రాయముల నన్నిటిని నామనస్సునుండి నిర్మూలము చేయుటతోపాటు, నాయుక్తులకు విషయములను స్వీకరించుటకుగాను వివిధములగు అనుభవములను సంగ్రహించుటకును, దానిని అనువర్తింప జేయుటలో అధికతర సామర్థ్యమును దృష్టియందుంచుకొని, నేనెంచుకొనిన పద్ధతిలో నిర్విరామముగా నన్ను నేను ప్రవర్తింప జేసికొనుటకును, మొట్టమొదట నాకుగల కాలములో అధికభాగమును కార్యసన్నాహమున వినియోగించితిని.

తృతీయభాగము

మనము నివసించుచున్న గృహమును తిరిగి కట్టనారంభించుటకు ముందుగా, దానిని పడగొట్టుటయు, సామగ్రిని, కట్టువారిని సిద్ధముచేసికొనుటయు చాలదు; ముందుగా మనము జాగరూకతతో తయారు చేసికొనిన నమూనా ప్రకారము, మనమే స్వంతముగా పనిలో దిగుటయు చాలదు. ఈ వ్యవహారసంతయు జరుగుచుండగా మనము సావకాశముగా నుండ వేరొక యిల్లుండుటకూడ అవసరమే. అట్లే తాత్కాలికముగా నానిశ్చితాభిప్రాయములను ఆప్రబుద్ధ నాబుద్ధి నన్ను నిర్బంధించియుండగా, నాపనులలో నేను అస్థిర సంకల్పుడనై యుండకుండుటకును, అట్టిపైనిగూడ సాధ్యమగునంతవరకు ఆనందమయమగు జీవితమును ఆతంకరహితముగా గడపగల్గుటకును, సామాన్యసత్యములు మూడు నాల్గింటిచే నిర్మింపబడిన తాత్కాలిక నైతిక నిబంధనలను ఏర్పరచుకొంటిని. వానిని మీకు పరిచయము చేయవలెనని నా కోరిక.

ఈశ్వరానుగ్రహమున బాల్యమునుండియు, నేను శిష్టితుడనైన ధర్మమును అచంచలముగా అవలంబించుచు, నాదేశముయొక్క శాసనములకును సంప్రదాయములకును విధేయుడనై యుండుట మొదటిది. మరియు, నాచుట్టు నివసించువారిలో మిక్కిలి మేధావులగువారి ఆచరణయందు

సామాన్యముగా ఉదాహరణ యోగ్యములగునట్టియు, 'అతి' నుండి సుదూరముగా వేరుచేయబడినట్టియు, అత్యంతము మితములగునట్టియు అభిప్రాయముల ప్రకారము తదితరవిషయములందు నాప్రవర్తనను క్రమబద్ధము చేసికొందును. ఎందుకనగా, నా అభిప్రాయములనన్నిటిని పరీక్షింపగోరితిని కావున, ఆ సమయమునుండియు వానిపై నే నాధారపడ నుద్దేశింపలేదు. కావున మిక్కిలి విశ్వసనీయులగు వారి అభిప్రాయముల ననుసరించుటకంటె శ్రేయసమగున దెద్దియు ఈలోగా నేను చేయలేనని విశ్వసించితిని; పరిషియా, క్రైనా దేశీయులలోగూడ బహుశః మనలో నున్నట్లుగనే ఇటువంటి విశ్వసనీయులున్నను, నే నెవరిమధ్య నివసింపవలయునో వారి యభిప్రాయముల కనుగుణముగానే నాఆచరణను నియంత్రితముచేసికొనుటయుక్తతరమని నాకు తోచెను. మరియు అట్టివారి వాస్తవికాభిప్రాయములను నిశ్చితముగా కనుగొనుటకు వారు చెప్పుచున్నదానిని గాక, వా రాచరించుచున్నదానినే నేను యోజనలోనికి తీసికోవలసినదిగా నాకు తోచెను. కారణము, మన మనఃకల్పలమువలన తాము నమ్మిన దాని నంతటిని వ్యక్తముసేయుట కిష్టపడువారు కొలదిమంది ఉండుటయేకాక, వాస్తవముగా తా మేమి నమ్ముచున్నారో ఎరుకలేనివా రనేకులు గలరు. ఎందుకనగా: ఒక వస్తువును నమ్ముటలోనున్న, మానసిక వ్యాపారము వేరు. మనము నమ్ముచున్నామని తెలిసికొనుటలోనున్న మానసికవ్యాపారము వేరు. ఈ రెండు

వ్యాపారములును భిన్నములు కావున ఒకటి లేకుండగనే, రెండవది తరచుగా ఉపలబ్ధమగుచున్నది. మరియు, సమానముగా గౌరవింపబడుచున్న వివిధాభిప్రాయముల నుండి నే నెల్లప్పుడును అత్యంతము మితముగా నుండువానినే యెన్నుకొంటిని. కారణము: ఆచరించుట కివి యెల్లప్పుడును అతిసుకరములు; బహుశః అత్యుత్తమములు; (అతిమాత్ర మంతయు సామాన్యముగ ప్రమాదకరమే కావున) ఇంతేకాదు. నేను పొరపడుట సంభవించినచో, అతిమాత్రములలో ఒకదాని నెన్నుకొని తరువాత నా ఎన్నికలో పొరపడితినని కనుగొనినప్పటికంటె అట్టి యెన్నికవలన సత్యమున కనతిదూరములో ఉండగలను. మన స్వాతంత్ర్యమును ఎవ్విధమునైనను సంకుచితపరచు ఒప్పందనముల నన్నిటిని అతిమాత్రముల వర్గములోనే చేర్చితిని. ఇట్లనుటచే నాకు శాసనముల యెడ నిరసనభావము కలదని తలంపరాదు. మన దృక్పథము నందున్న విషయము మంచిదైనప్పుడు, దుర్బలమనస్కులను అస్థిరత్వమునుండి రక్షించుటకై కొన్ని శపథములను గాని, ఒడంబడికలను గాని అనుమతించు శాసనములపట్ల గాని, సదుద్దేశము అను ప్రశ్నయే జనింపని వాణిజ్యవ్యవహారములను సంరక్షించుటకై అట్టి ఒడంబడికల ననుమతించు చట్టములపట్లగాని నాకు నిరసనభావములేదు. కాని మార్పునకు లోనుగానిదెద్దియు భూమిపై నేను చూడనందునను, నా నిశ్చితాభిప్రాయములను శిథిలములు గాకుండ, క్రమముగ, నిర్లోపము

లుగ చేసికొనుటయందు నిమగ్నుడనై యున్నందునను, ఏదైన ప్రత్యేకసమయమున నా సమ్మతిని బడసిన దను కారణ ముచే ఒక దానిని తరువాతకూడ — బహుశః శ్రేష్ఠత్వమును గోల్పోయిన తరువాత, లేదా, దానిని అట్లు నేను గణించుట మానిన తరువాత, కూడ — శ్రేష్ఠముగా నెంచుట సద్బుద్ధిపట్ల ఘోరమగు అపరాధమని నేను తలంచితిని.

నా కార్యములలో, శక్తి గలంతవరకు అచంచలుడు గను, దృఢసంకల్పుడుగను ఉండుటయు, ఒకసారి గ్రహింపబడిన పిమ్మట, సందేహాస్పదములైన అభిప్రాయములను గూడ, సునిశ్చితములవలెనే, సరియగు స్థైర్యముతో అవలంబించు టయు నారెండవ సూత్రము. అడవిలో దారితప్పిన బాట సారులు — వారి ప్రప్రథమ వరణమును బహుశః నిర్ణయించి నది కేవలము యాదృచ్ఛిక సన్నివేశమే అయినను — ఇటునటు తిరుగుటయు, ఒకచోట నిల్చియుండుటయు మాని, స్వల్ప కారణములకు తమ మార్గమును మార్చుకొనక, వీలగునంత తిన్నగా, ఎచటను ఆగకుండ పోవలయును. ఈ బాటసారుల యుదాహరణమే ఇట నాకు అనుసరణీయము. ఎందుకనగా, వా రీమార్గము ననుసరించినచో, సరిగా తాముకోరిన ప్రదేశ మునే చేరలేకపోయినను, అరణ్యమధ్యమున నుండుటకంటె, బహుశః మేలైన ప్రదేశము నేదో ఒకదానినైనను, కనీసము, చివరకు చేరగలరు. ఈ విధముగనే తరచు జీవితమునందలి

పనులలో ప్రత్యక్ష జీవితమందు కార్యావసరములపట్ల ఆలస్యము సమ్మతము కాదు. కావున, సర్వథా సత్యమెద్దియో మనము నిర్ణయింపలేనప్పుడు, అత్యంత సంభావ్యమైన దాని ప్రకారమే మన మాచరింపవలసియుండుట సునిశ్చితము; మరియు ఒక అభిప్రాయములోకంటె మరొక అభిప్రాయములో మనము హెచ్చు సంభావ్యతను గమనింపక పోయినను, ఏదియో ఒక దానిని మనము ఎంచుకొనవలసినదే. తరువాత, ఆచరణకు సంబంధించినంతవరకు దానిని నిస్సంశయముగ, స్పష్టముగ, సత్యము, నిశ్చితము అని పరిగణింపవలెను. ఎందుకనగా, ఈ వరణమును నిర్ణయించిన మనబుద్ధి ఈ గుణమును గలిగి యున్నది. స్పష్టము, నిశ్చితము అగు వరణసూత్రములేక, ఒకనాడు ఒక మాదిరి కార్యాచరణము శ్రేష్ఠమని అవలం బించుటకును, మరునాడు దానినివీడి తద్విరుద్ధము శ్రేష్ఠమని అవలంబించుటకును, తమకుతామై పాల్పడు, బలహీనచంచల మనస్కులయొక్క ధర్మాధర్మవివేచనాబుద్ధిని మామూలుగా ఆందోళనపరచునట్టి పశ్చాత్తాపపరివేదన లన్నిటినుండియు నన్ను నేను విముక్తుని చేసికొనుటకు ఈ సూత్రము పర్యాప్త మాయెను.

మనకు బాహిరములగు వస్తువులపట్ల చేతనైనంత బాగుగా మనము వర్తించిన పిమ్మట, మనకు జయము లభింప నిచో అది మన లోపముకాదు అని తెలిసికొనుటకై అదృష్ట

మనుగాక నన్ను నేనే జయించుకొనుటకునుఁ జగద్వ్యవస్థను గాక, నాఇచ్ఛలనే నేను మార్పుచేసికొనుటకును, మన స్వంత ఆలోచనలుగాక మఱేదియు సంపూర్ణముగా మనశక్తిలో లేదని విశ్వసింప నలవాటుపడుటకును, ఎల్లప్పుడు ప్రయత్నించుట నామూడవసూత్రము; నేను పొందజాలని దాని నెద్దానిని భవిష్యత్తులో నేను కోరకుండ నన్ను నిరోధించి, తన్మూలముగా నన్ను తృప్తుని గావించుటకు ఈయొక్క సూత్రమే పర్యాప్తమై కన్పట్టెను. ఎందుకన: ఏదో ఒక విధమున ఉపయుక్త సాధ్యములుగా మన యెదుటచే ప్రస్థాపితములైన విషయములను మాత్రమే మన ఇచ్ఛాశక్తి సహజముగా అన్వేషించును గావున, సమస్త బాహ్యవస్తువులును సమానముగనే మనశక్తి కతీతములని పరిగణించినచో, సైనా లేక మెక్సికో రాజ్యములు మన అధీనమున లేనందువలన మనమెట్లు విచారింపమో, అట్లే మన తప్పేమియు లేకయేపోయినచో మన జన్మస్వత్వములుగా చూపట్టు వస్తువుల లేమికికూడ ఎక్కువగా మనము విచారింపమనుట తెల్లము. మరియు, ఆవశ్యకతనే గుణముగా చేసికొని, వజ్రములవలె అచ్ఛేద్యములగు దేహములనుగాని, పక్షులవలె ఎగురుటకు రెక్కలనుగాని ఇప్పుడు కోరనియట్లు, రోగమం దారోగ్యమునుగాని, కారాబంధము నందు స్వాతంత్ర్యమునుగాని కోరము. అయినను ఈ భావమునే అన్ని పరిస్థితులందును దృఢముగా అవలంబించుటకు దీర్ఘమగు క్రమశిక్షణయు, తరచుగా, మననము చేయుటయు

అవసరమని ఒప్పుకొనుచున్నాడను. మరియు విధి ప్రభావమునుగూడ నధిగమింప శక్తులై, దుఃఖదారిద్ర్యములలో నున్నను, దేవతలతోకూడ పోటీపడదగిన ఆనందము ననుభవించిన ప్రాచీనదార్శనికుల శక్తిరహస్యము ముఖ్యముగా ఇందులోనే ఇమిడియున్నదని నమ్ముచున్నాడను. ఎందుకనగా: స్వభావముచే, తమశక్తికి నిర్ణయింపబడిన సీమలను గూర్చి నిర్విరామచింతనామగ్నులై యున్నవారు తమ స్వాధీనమందు తమ ఆలోచనలు తప్ప మఱేమియు లేవని పూర్తిగా నమ్ముటవలన, ఈ విశ్వాసమే వారు మఱే యితర విషయములను కోరకుండ ఆపుటకు చాలినదాయెను; మరియు, స్వభావముచేతను, విధిచేతను ఎంతగా అనుగ్రహింపబడినను, సమస్తేచ్ఛా పూర్తిని ఎన్నడును స్వాయత్తము చేసికొనలేని దర్శనరహితులగు తదితర మానవులకంటె, తమ ఆలోచనలపై అద్వితీయమగు నాధిపత్యమును సంపాదించుకొనిన దార్శనికులు, తమ్ము ఎక్కువ శక్తిమంతులుగ, ఎక్కువ స్వతంత్రులుగ, ఎక్కువ సౌఖ్యవంతులుగ భావించుకొనుట కొంతవరకు సహేతుకమే.

తుదకు, ఈనైతికచట్టమును పరిసమాప్తముచేయుటకై, జీవితమునందు మనుష్యులవలంబించు వివిధములగు వృత్తులయం దుత్తమోత్తమమగు దానిని ఎంచుకొను దృష్టితో, వానిని సమీక్షింపదలచితిని. మరియు, ఇతరవృత్తులగూర్చి

యేమియు నభిలషింపకుండ నేను నిమగ్నుడనైయున్న దానినే కొనసాగించుటకంటె మేల్తరమగు దానిని చేయఁజాల నని తలంచితిని. అనగా: నాజీవితమంతయు నా వివేకము నభివృద్ధి పరుప వినియోగించుటకును, స్వయంనిర్ణీతమగు నాపద్ధతి కను గుణముగ, సాధ్యమగునంతదనుక సత్యమును తెలిసి కొనుటయందు పురోగమించుటకును అనుట. ఈపద్ధతి నుప యోగింప నారంభించినదిమొదలు, నేనెంతో సంతృప్తి నను భవించితిని. అంతకంటె మధురతరము, పవిత్రతరముఅగు సంతృప్తి ఈ జీవితమున లభ్యమగునన నేను నమ్మను. ఆ పద్ధతి వలన ప్రతిదినము కొన్నిసత్యములను కనుగొనువాడను. ఇతరులు సామాన్యముగా వానిని గణింపకున్నను నా కవి చాలినంత ప్రధానములుగనే తోచెడివి. దానివలన గలిగిన సంతృప్తి నా మనసంతయు నాక్రమించినది. దానితో నుపమింప నన్యములెవ్వియు గణనీయములుగా తోపలేదు. పైగా, ముందుచెప్పఁబడిన బోధత్రయము ఆత్మశిక్షణ కార్యమును కొనసాగింపవలె ననుకేవలోద్దేశ్యముపైనే స్థాపింపబడెను. అసత్యమునుండి సత్యమును విభేచించుటకు మనలోప్రతివానికిని ఈశ్వరుడుకొంత బుద్ధిప్రకాశమును ప్రసాదించినాడు కావున, ఇతరుల యభిప్రాయములతో తృప్తిపడుచు ఒక్కక్షణకాలము గూడ నే నుండవలెను అని నేను నమ్మలేకపోయితిని. తగు సమయమున, వారి యభిప్రాయములను పరీక్షించుటయందు నానిశ్చాయక బుద్ధిని వినియోగించు దృష్టి నా కున్నప్పుడు

మాత్రము, ఇతరుల అభిప్రాయములతో తృప్తిపడుచుంటిని. వాని నట్లంగీకరించుటలో, అంతకంటె ప్రశస్తతరములగు నభిప్రాయములను — అట్టివి యున్నచో — కనుగొను నవకాశ మును పోగొట్టుకొందునని నేను భావించినచో సందేహ రహితుడనై నే నుండలేకపోయెడివాడను. ఎంతటిజ్ఞానసంపాద నకు నేను సమర్థుడనో, ప్రశస్తతరములగు వస్తువుల నెన్నిటిని పొందనాకు శక్తిగలదో, అంతటి జ్ఞానమును, అన్నివస్తువులను నేను పొందుట సునిశ్చితముగావించు మార్గమును నే ననుస రింపనిచో, నా యభిలాషను అరికట్టుకొనుటకుగాని, తృప్తుడనుగా నుండుటకుగాని, నేను సమర్థుడనుగాక పోయెడివాడనే. మన తెలివి, మంచిదనియో చెడ్డదనియో, వివరింపనంత వరకు, మన మే వస్తువును కోరుట గాని, వర్జించుట గాని చేయముగాన, ఉచితాచరణకు ఆవశ్యకమైనదంతయు ఉచిత మగు నిశ్చాయకబుద్ధి మాత్రమే. మరియు, అత్యంతము ఉచితమగు నాచరణకు, మిక్కిలి సరియైన నిశ్చాయకబుద్ధి మాత్రమే అవసరము. నిజముగా విలువైనట్టియు, మన అందు బాటులో నున్నట్టియు, ఇతరవస్తువు లన్నిటితోపాటు, సర్వ సుగుణ సముపలబ్ధికి ఇదియే చాలును. మరియు, అట్టి సముప లబ్ధి యున్నదను దృఢవిశ్వాసము మనలను తృప్తులను చేయు మానదు.

ఇట్లీ నైతికబోధలయెడ సునిశ్చితుడనై, నా విశ్వా

సములో ఎల్లప్పుడును ప్రథమస్థానము నాక్రమించిన మత సంబంధి సత్యములతో పాటు, వానినికూడ ఒకవంక నుంచు కొని, ఇక నా అభిప్రాయములలో మిగిలిన వానిని స్వేచ్ఛగా వదులుకొనవచ్చునను పర్యవసానమునకు వచ్చితిని. నాకీ యాలోచనలు గలిగిన విజనావాసములోనే ఇంకను ఎక్కువ కాలము గుప్తముగా నుండుటకంటె ప్రజలతో సంబంధ వ్యవహారములను పెట్టుకొనుటవలననే నే నీ కార్యమును యత్రపదముగా ముగింపగలనని ఆశించుటచే, శీతకాలము బాగుగా ముగియకముందే తిరిగి పర్యటించుటకు ప్రారంభించి తిని. ఇక తరువాత తొమ్మిదేండ్లలోను ప్రపంచ రంగస్థల ముపై ప్రదర్శింపబడుచున్న జీవితనాటకములలో నటుడుగా గాక ప్రేక్షకుడుగా నుండగోరిన వాడనై ఒకచోటినుండి మరొకచోటికి ద్రిమ్మరుట తప్ప మరేమియు నేను చేయ లేదు. మరియు, ప్రతి పరిస్థితియందును సందేహాస్పదముగా తోచునట్టియు, మోసమునకు మూలకారణము కాదగినట్టియు, దానిని గురించి ముఖ్యముగా చింతింప ప్రయత్నించు చుంటిని కావున, నామనస్సులో నిదివరకు ప్రవేశించిన దోష ముల నన్నిటిని క్రమముగా నిర్మూలించితిని. కేవలము సందే హించుట కొరకే సందేహించుచు, అనిశ్చితత్వముకంటె అతీత మైన దెద్దియు అన్వేషింపని సెప్టిక్కులను (గ్రీకుదేశమునందలి ఒకానొక దార్శనిక వర్గము) నే నిందులో అనుకరించుట మాత్రము లేదు; ఎందుకనగా: తద్విరుద్ధముగా దృఢనిశ్చయ

మున కాధారమును కనుగొన వలెననియు, కఠిన శిలలను, లేక పాటిమట్టిని పొందుటకుగాను, ఒదులు ఒదులుగానుండు మట్టిని ఇసుకను అవతల పారవేయవలె ననియు, నా యేకో ద్దేశ్యము. నాకు జూడగా ఇందులో నేను సఫలుడ నైనట్లే; ఎందుకనగా: నేను పరీక్షించిన ప్రతిజ్ఞావాక్యముల సత్య రాహిత్యమును లేక నిశ్చయరాహిత్యమును దుర్బలములైన ఊహలతోగాక, సృష్టములు, నిశ్చితములు అయిన హేతువు లతో కనుగొన ప్రయత్నించితిని కాబట్టి, నిశ్చితమైన దేదియు నందు లేదనునది కేవలము అనుమానము మాత్రమే అయి నను, పర్యాప్తనిశ్చయముతో కూడిన ఏదో ఒక నిగమనమును నేను చేయలేనంతగా సంశయాస్పదమైన దెద్దియు నాకు గన్పట్టలేదు. మరియు, ప్రాతయింటి నొకదానిని పడగొట్టి నప్పుడు పునర్నిర్మాణమున కుపయోగించుటకు సాధారణ ముగా దాని శిథిలములను భద్రము చేసినట్లు, స్వల్పాధార ములు గలవిగ నాచే నిశ్చయింపబడిన స్వాభిప్రాయములను నాశనము చేయుటలో నేను వివిధపర్యవేక్షణలను, ప్రయోగ ములను జరుపగలిగితిని. మరియు, అంతకంటె సునిశ్చితము లగు నభిప్రాయముల స్థాపించుటకు నా కుపయుక్తమైన అను భవమునుగూడ చాల గడించితిని. ఇంకను నాకై నేను ఏర్ప రచుకొనిన ప్రమాణపద్ధతి నభ్యసించుచునే యుంటిని. ఎందు కనగా, దాని నిబంధనలప్రకారము నా ఆలోచనల నన్నిటిని నడపుటకు సామాన్యముగా శ్రద్ధతీసికొనుటయే గాక, అప్పు

డప్పుడు ఈపద్ధతి నుపయోగించి గణితశాస్త్రములోని చిక్కు-లను విడదీయుటకును, ఇతర శాస్త్రములకు చెందిన కొన్ని ప్రశ్నలకు సమాధానము వడయుటకును, కొన్ని గంటలను ప్రత్యేకించితిని; కాని ఈ శాస్త్రములలోని పర్యాప్త నిశ్చయములేని సూత్రములనుండి ఈ ప్రశ్నలను నేను విడదీసినంతనే, అవి దాదాపు గణితశాస్త్రీయములుగా చేయబడెను. ఈ సంపుటములోగల అనేకోదాహరణముల * వలన దీని సత్యము వ్యక్తము కాగలదు. ఈ ప్రకారముగ, అధర్మము-నుండి సుఖమును వేరుచేయుటకు ప్రయత్నించుచు, తమ విశ్రాంతి సమయమును విసువులేకుండ అనుభవించుటకుగాను, అనింద్యములగు వినోదములందు వ్యాసక్తులగుచు, ప్రశాంతముగను, అమాయికముగను, జీవితములను గడపుట తప్ప మరేవృత్తియు లేనివారివలెనే నేనును జీవించుచున్నట్లగు పడుచు, నాఉద్దేశ్యమును అనుసరించుచునే ఉంటిని. మరియు, కేవలము పుస్తకముల ననుసంధానము చేయుటలోగాని, విద్వాంసులతో సంభాషించుటలోగాని, నిమగ్నుడనైయుండిన కలుగగల సత్యముయొక్క జ్ఞానాభివృద్ధికంటె బహుశః ఎక్కువ అభివృద్ధినే పొందితిని.

* "వెలుతురుకు సంబంధించిన శాస్త్రము", "ఉల్కాశాస్త్రము" "రేఖాగణితము" లను గ్రంథములోని విషయములు. ఉపోద్ఘాతము, చూడుడు.

పండితవాద విషయములైన క్లిష్టతలను గురించి ఎట్టి నిశ్చితాభిప్రాయమునకు రాకమునుపే, సామాన్యముగా ప్రచలితముగా నున్నదానికంటె రూఢతరమైన ఏదర్శన సూత్రములనుగాని అన్వేషింప ప్రారంభింపక మునుపే, ఈతొమ్మిది సంవత్సరములు ఎట్లో గడిచిపోయినవి. మరియు, పూర్వమెందరో ప్రఖ్యాతపురుషులీప్రయత్నములను చేసిరి. కాని వారు సఫలులైనట్లు తోపదు. దాని నుదాహరణముగా గైకొనుటచేతనే అది బహుకష్టమగు కార్యమని నేనూహించితిని. కావున నేనీవరకే ఈ జిజ్ఞాసను పూర్తిచేసినాడనను బహువ్యాప్తమగు సమకాలీన కింవదంతిని వినియుండకపోయినచో, నేనింతత్వరలో దీనిని ప్రారంభించి యుండెడివాడను గాను. ఈ కింవదంతికి ప్రోద్బలకముగా ఏయాధారములు చూపబడినవో నేనెరుగను. మరియు, నాసంభాషణ దానికేమాత్రముగనైన సహకరించి యుండినచో, దానికి కారణము, నాఅజ్ఞతను స్వల్పజ్ఞులకంటె సొచ్చు నిష్కపటముగా నేను ఒప్పుకొనుటయే అయియుండును. ఇతరులు తథ్యములని నమ్మిన అనేక విషయములు సంశయాస్పదములనుటకు నేను చూపిన హేతువులుగూడ దీనికి కారణములై యుండును. దర్శన ప్రస్థానము నెట్టిదానిని గూర్చిగాని నాచేసిన ప్రజ్ఞావాదము లిందులకు కారణములు గాజాలవు. కాని నిజముగా నున్నది యున్నట్లు గాక వేరు విధముగా నేను శ్లాఘింపబడుట

నాకిష్టములేదు. కావున నాకు వచ్చిన ప్రఖ్యాతికి యోగ్యుడనగుటకు అన్నివిధముల ప్రయత్నించుట అవసరమని తలంచితిని.

ఇప్పటికి సరిగా ఎనిమిదేండ్లకు పూర్వము ఈ కోర్కెవలన నేనొక తీర్మానమునకు వచ్చితిని. ఆతీర్మాన మిది: పరిచితులను గలియుట కవకాశముగల సమస్తప్రదేశములకు దూరముగా నుండుట: ఈ దేశమునకు తరలుట: ఈ దేశమునకే నేను తరలుటకు గారణము లివి: ఇచ్చట యుద్ధము చాలకాలము జరిగినది. ఈ దీర్ఘయుద్ధము సక్రమమగు శిక్షణ స్థాపింపఁబడుటకు సహకరించినది. సురక్షితముగా జనులు శాంతిలాభము లనుభవించునట్లు చేయుటయే, శాశ్వతముగా భరింపబడు సైన్యముల ముఖ్యోపయోగముగ జూపట్టుచున్నది. ఈ దేశీయులు చాల చురుకైనవారు. ఇతరుల వ్యవహారములందు కౌతుకము చూపుటకంటె స్వవ్యవహారములందే మిక్కిలి జాగరూకులై యుందురు. ఈ మహాజన సమూహ మధ్యమున, మిక్కుటముగ జనసమ్మర్దముగల మహానగరములలో లభ్యములగు నెట్టి సదుపాయములను గోల్పోకుండ, సుదూరములగు నెడారులయందువలె ఏకాకిగను, ఉపహృత వ్యవహారుడుగను, నేను జీవింప శక్తుడనైతిని.

---

* Hollard ఇచటి కాతడు 1629 లో వెళ్ళెను. ఉపోద్ఘాతము చూడుడు.

చతుర్థభాగము

అచ్చట నేను చేసిన ప్రథమ మననములను గూర్చి చెప్పుటకు సంశయించుచున్నాడను. ఎందుకనగా: సామాన్యముగా ఇవి ప్రతి వ్యక్తియు నంగీకరింపలేనంతగా ఆధ్యాత్మికములు, అసాధారణములును. అట్లయ్యు, నేను వేసిన పునాదులు తగినంత సురక్షితముగా ఉన్నదియు లేనిదియు నిశ్చయించుటకు అవి అవసరము గావున వానిని గూర్చి ప్రసంగించుటకంటె నాకు మార్గాంతరములేదు. ఇదివరకే చెప్పబడినట్లు, అత్యంతము అనిశ్చితములని మనము గ్రహించిన అభిప్రాయములనుగూడ, వ్యవహారమునకు సంబంధించినంతవరకు, కొన్నిసారులు సంశయాతీతములుగా అవలంబించుట అవసరమని నేనిదివరకెప్పుడో గమనించియుంటిని; కాని నాశ్రద్ధను కేవలము సత్యాన్వేషణకే అప్పుడుపయోగింపదలచితిని. అందుచే సరిగా తద్విరుద్ధపద్ధతియే నాకు ఆవశ్యకమైనది. అటుతరువాత నావిశ్వాసములలో పూర్ణముగా నిస్సంశయమైన దేమైనను ఉన్నదో లేదో నిశ్చయించుటకుగాను, కొంచెమైనను సంశయాస్పదములని అనుకొనుటకు వీలైన అభిప్రాయములన్నిటిని త్రోసివేయ తలంచితిని. తదనుకూలముగా, మన యింద్రియములు కొన్నిసారులు మనలను భ్రాంతులుగా చేయుట చూచి అవి మన కుపస్థాపితము చేయునట్టి దేదియు నిజముగా లేదు అని యనుకొనుటకు ఇష్టపడితిని. మరియు,

కొందరు మనుష్యులు హేతువాదములలో పొరపడి, రేఖా గణిత సంబంధములైన అతి సరళ విషయములలో గూడ హేత్వాభాసములకు లోనగుచున్నారు గావున, ఇతరులెంతటి దోషభూయిష్ఠులో నేనును అంతటి దోషభూయిష్ఠుడనే అని నమ్మినవాడనై నేనిదివరకు అనుమానములుగా తీసికొనిన సమస్త తర్కములను అసత్యములుగా త్రోసివేసితిని. మరియు, చివరకు, మనము జాగరూకులమై యున్నప్పుడు అనుభూతములైన ఆలోచనలే, నిద్రితులమైయున్నప్పుడుగూడ అనుభూతములు గావచ్చుననియు, ఆస్థితిలో అందొక్కటియు నిజముగాదనియు, ఎప్పుడు గమనించితినో, అప్పుడు, జాగరూకుడనై యున్నతరి నామనస్సులోనికి ఎప్పుడైనను సరే ప్రవేశించిన సమస్త విషయములలోను నాస్వప్నభ్రాంతుల లోని సత్యమునకంటె ఎక్కువ సత్యములేదని అనుకొంటిని. కాని, నేనిట్లు అంతయు కల్లయేయని తలంపగోరగనే, అట్లు తలచిన నేను ఏదో ఒకటిగా ఉండవలెననుట, అత్యంతావశ్యక మని కనిపెట్టితిని; నేను ఆలోచించుచున్నాను, కాబట్టి, నేనున్నాను. అను నీసత్యము, 'సెప్టిక్కులు' ఆపాదింపగల ఎంతటి విపరీతమైన సంశయమునకు కారణమైనను, దాని నాందోళితము చేయలేనంత నిశ్చితముగాను, స్పష్టముగాను ఉండుట కనిపెట్టినందున, నే ననన్వేషించుచున్న దర్శనము యొక్క ప్రథమసూత్రముగా, ముందువెనుకలు చూడకుండ నేను దానిని గ్రహింపవచ్చునని నిశ్చయించితిని.

తరువాత 'నేనేమిటి' అనుదానిని శ్రద్ధగా పరీక్షించితిని. మరియు నాకు శరీరము లేదనియు, నేనుండునట్టి ప్రపంచముగాని ప్రదేశముగాని లేదనియు నేను అనుకొనగల్గినను అందువలన నేను లేను అని అనుకొనలేనని గమనించితిని. పైగా, ఇతరవస్తువుల సత్యమును సందేహింపవలెనని ఆలోచించుట, అను పరిస్థితినుండియే అతి స్పష్టముగను నిశ్చితముగను నేనుంటినని తేలెను; వేరొక వంక, నేనాలోచించుటయే మానియుంటినేని, నేనెన్నడైనను సరే భావించిన సమస్తేతర వస్తువులు నిజముగా ఉండి యుండినను, నేనుంటినని నమ్మకు నాకు కారణమేదియు ఉండకపోయెడిది: అందుచే నేను కేవలము ఆలోచించుటయే సంపూర్ణస్వభావముగా, లేక, సత్తుగా గల ద్రవ్యమునని యు, తానుండగలందులకై అద్రవ్యమునకు ఏదేశాపేక్షయు లేదనియు, అది ఏభౌతికవస్తువు మీదగాని ఆధారపడి యుండలేదనియు తెలిసికొంటిని. కావున, ఈ 'నేను', అనగా, దేనివలన నేను నేనుగనున్నానో ఆయాత్మ, శరీరముకంటె కేవలము భిన్నమనియు, దీనిని గూర్చి తెలిసికొనుట శరీరమును గూర్చి తెలిసికొనుట కంటె సులభతరమనియు, శరీరము నశించినను ఆత్మ తన యస్తిత్వమును గోల్పోదనియు తెలిసికొంటిని.

దీని తరువాత, ఒక ప్రతిజ్ఞావాక్యము సత్యమును, నిశ్చయమును అగుటకు అవశ్యకమైన దేది అను సామాన్య

గహింపణ చేసితిని. ఏలయన నేనుసత్యమనియు నిశ్చితమనియు నెరింగినట్టి దానిని (నే నాలోచించుచున్నాను కాబట్టి నేను న్నాను) కనిపెట్టితిని గావున ఈ నిశ్చితత్వ, మెందు గలదో అది తెలిసికొనవలసి యున్నదని తలంచితిని. మరియు 'నే నాలోచించుచున్నాను, కాబట్టి నేనున్నాను' అను మాటలలో ఆలోచింపగలందులకు ఉండుట అవసరమని స్పష్టముగా కన్పట్టు చున్నది. ఇట్లు కన్పట్టు తప్ప తత్సత్యమును గూర్చిన విశ్వా సము గల్పింపగల దెద్దియు విశిష్టమైనది లేదని గమనించుటచే, మనము స్పష్టముగను, విశదముగను ఊహింపగల వస్తువులన్ని యు సత్యములే అను సూత్రమును నేను సామాన్య నిబంధనగా తీసుకొనవచ్చునని నిశ్చయించితిని. అయినను మనము విశదము గా ఊహించు వస్తువులెవ్వియో సరిగా నిర్ణయించుటలో కొంత కష్టమున్నదనియు నేను గమనించి యుంటిని. నేను సంశయించి తిని; అందువలన నా సత్త్వము కేవలము సంపూర్ణము కాదు అని, ఈ నిబంధన ననుసరించి, మననము చేయుటవలన, (సంశయించుటకంటె తెలిసియుండుట ఎక్కువ సంపూర్ణతయని నేను స్పష్టముగా చూచినందున) నాకంటె ఎక్కువ సంపూర్ణ మైన యత్కించిద్వస్తువును గురించి చింతించుట ఎచ్చటనుండి నేర్చుకొంటినో గవేషింప నిశ్చయించితిని. మరియు, వాస్తవ ముగా సంపూర్ణతరమగు ఒకానొక (వస్తు) స్వభావమునుండియే నేనీభావనను తప్పక గ్రహించియుండవలెనని స్పష్టముగా గుర్తించితిని. ఇక నాకు బాహిరములగు గగనము, భూమి,

ప్రకాశము, ఉష్ణము మొదలగు వేలకొలది వస్తువుల భావనలు ఎక్కడనుండి వచ్చినవో తెలిసికొనుటకు నాకంత కష్టము కలుగలేదు. ఏలయన: వానిని నాకంటె శ్రేష్టతరములుగా చేయగలిగిన దానిని దేనిని వానిలో నేను గమనింపనందున, అవి సత్యములైనచో, నాస్వభావము కొంత సంపూర్ణతగలిగి యున్నంతవరకు, అవి దానిపై నే ఆధారపడియున్నవనియు, అవి అసత్యములైనచో వానిని నే నెచటనుండియు గ్రహింప లేదనియు, అనగా నాస్వభావములోని యేదో ఒక అసంపూ ర్ణతవలననే అవి నాలో ఉన్నవనియు నేను నమ్మగలిగెడి వాడను. కాని నాకంటె సంపూర్ణతరమగు స్వభావమును గూర్చిన భావనవిషయములో ఇది అసంభవము. ఏలయన, దాని నెటనుండియు గైకొనకుండనుండుట అనునది అసంభవ మనుట తెల్లము; మరియు అభావమునుండి భావముద్భవించుట కంటె, సంపూర్ణతరమైనది ఈషత్సంపూర్ణమగు దాని కార్యమో, ఆధేయమో అగుట తక్కువ అనుపన్నముకాదు గావున, దానిని (అట్టి భావనను) నానుండియే గ్రహింపగల్గుట అట్లే అసంభవము.

కావున వాస్తవముగా నాకంటె సంపూర్ణతరమైనట్టియు నేనూహింపగల యావత్సంపూర్ణతలనుగూడ తనయందే కలిగి యున్నట్టియు, స్వభావముచేతనే అదినాయందు నిక్షిప్తమనుట ఒకటియే పరిశిష్టము; అనగా: ఒక్కమాటలో, అదియే,

ఈశ్వరుడనుట, మరియు, నాకులేని సంపూర్ణతలను కొన్నిటిని నే నెరుగుదును గావున, నేనొక్కడనే అస్తిత్వమందున్న సత్త్వమును గాదనియు, (ఇక్కడ మీ అనుమతితో దర్శన ప్రస్థానముల పరిభాషా పదములను విరివిగా వాడెదను) సంపూర్ణతరమగు అన్యసత్త్వమొకటి అవశ్యముగ నున్నదనియు దానిపై నే నాధారపడియున్నాననియు, దానినుండియే నాకున్న దంతయు పొందితిననియు తీర్మానించితిని. ఏలయన, ఎంత అల్పమైనను నాకుగల సంపూర్ణత అంతయు నానుండియేవచ్చి యుండునట్లుగా నే నొక్కడనే ఒంటరిగను, ఇతరములగు ప్రతిసత్త్వమునుండియు స్వతంత్రముగను ఉంటినేని, ఆ కారణముచేతనే, నాకులేదని నేనెరింగియున్న సంపూర్ణతా పరిశిష్టమంతయుగూడ నానుండియే పొందగలవాడనే. మరియు ఆప్రకారము స్వయముగ అనంతుడుగను, శాశ్వతుడుగను, పరిణామరహితుడుగను, సర్వజ్ఞుడుగను, సర్వశక్తిమంతుడుగను కాగల్గెడివాడనే; సారాంశమేమన, ఈశ్వరునిలో నేను గుర్తింపగల సంపూర్ణతల నన్నిటిని కలిగి యుండెడివాడనే, (పై హేతువాదములచే నిరూపితాస్తిత్వము గల) ఈశ్వరుని స్వభావమును నా స్వభావము అనుమతించినంతవరకు, తెలిసికొనుటకుగాను నామనస్సులో కొంత భావనగల గుణములకు సంబంధించినంతవరకు ఆగుణములను కలిగియుండుట సంపూర్ణతాచిహ్నమగునా? కాదా? అనుట మాత్రమే నేను గమనింప వలసియుండెను; మరియు, ఈశ్వరునియందు అసంపూర్ణతను

సూచించునది యొక్కటికూడ లేదనియు, మిగిలినవానిలో నేదియు కొరతగాదనియు నేను దృఢముగా నమ్మితిని. ఇటుల సంశయాదులనుండి విముక్తినందుటకు నేనే సంతసించెడివాడను గావున, సంశయము, చాంచల్యము, శోకము, మొదలగునవి ఈశ్వరుని యందుండజాలవని నేను కనుగొంటిని. ఇవికాక, ఇంద్రియగోచరములైనట్టియు, భౌతికములైనట్టియు, ఆసేక వస్తువుల భావనలను నేను కలిగియుంటిని; ఏలన, నేను కల గనుచున్నాననియు, నేను చూచుచున్నట్టిది, లేక, ఊహించునట్టిది, అంతయు అసత్యమేఅనియు అనుకొనినను, నా ఆలోచనలలో వాస్తవముగా ఆభావములున్నవని నిరాకరింప నశక్తుడనైతిని. కాని, నే నీవరకే నాయందలి చిత్స్వభావము భౌతికమునుండి భిన్నమని అతిస్పష్టముగా గుర్తించితిని. గావున, నిర్మాణమంతయు ఆధేయత్వమునకు నిదర్శనమనియును, ఆధేయస్థితి అసంపూర్ణతయగుట ప్రకటమే అనియు, అందువలన, ఈ రెండుస్వభావములతో సమ్మిశ్రితుడగుట ఈశ్వరునిలో సంపూర్ణతకాజాలదనియు, తత్కారణము వలననే ఆతడు అట్లు సమ్మిశ్రితుడు కాడనియు, నిశ్చయించితిని. కాని సమగ్రముగా పూర్ణములుకానట్టి దేహములుగాని, చిద్వస్తుస్థితులుగాని, లేక, తదితర స్వభావములుగాని ప్రపంచమంచుండినచో, ఆతడు లేకుండ వానికి క్షణమాత్రస్థితియైన నుండదు. అంతగా వాని అస్తిత్వము ఆతని శక్తిపై ఆధారపడియున్నదనికూడ నిశ్చయించితిని.

తరువాత ఇతరసత్యముల నన్వేషింప ప్రవృత్తుడనైతిని; మరియు రేఖాగణితజ్ఞుల (శాస్త్ర) విషయమును ముందుంచుకొని వారియొక్క సరళమైన కొన్నినిరూపణలను, సమీక్షించితిని (ఆవస్తువు) పొడుగుగను, వెడల్పుగను, ఎత్తుగను, లోతుగనుండి నిరవధిగావ్యాపించి, విభిన్నాకృతులకు, పరిమాణములకు తావిచ్చి విభిన్నభాగములుగా విభాజ్యమై, అన్నివిధముల కదలింపబడుటకును, ఇతస్తము చేయబడుటకును, వీలైన నిరంతరపదార్థము, లేక అవకాశమునని ఊహించితిని. (ఎందుకన, రేఖాగణితజ్ఞులు తమ చింతనా విషయమందు ఇదియంతయు ఉన్నదని అనుకొనెదరు.) మరియు, మొట్ట మొదట నేనుగమనించిన దిది: ఈనిరూపణలయందు సర్వసమ్మతితోనున్న గొప్పదృఢనిశ్చితత్వమునకు కారణము, నే నీవరకే ప్రతిపాదితించిన నిబంధనల కనుగుణముగా, అతిస్పష్టముగా, అవి ఊహింపబడుటయే. ఆతరువాత, ఈనిరూపణలన్నిటిలో వాని విషయాస్తిత్వము గూర్చి నాకు దృఢవిశ్వాసము కలిగింపగల్గిన దేదియు లేదని కనుగొంటిని. ఉదా: త్రికోణమొకటీయబడినదని యనుకొనినచో, దానిమూడు కోణములును రెండు సమకోణములకు నియతముగా సమానములని నేను విశదముగా చూచితిని. కాని, అది నిమిత్తముగా వీడైన త్రికోణ మున్నదని నాకు దృఢవిశ్వాసము కలిగించునట్టిదేమియు కనుగొనలేకపోతిని. పై పెచ్చు, దానికి మారుగా, సంపూర్ణ సత్త్వభావనాపరీక్షకు

తిరిగిరాగా, రెండు సమకోణములతో త్రికోణముల సమానత త్రిభుజభావనలోనే అంతర్భూతమైనట్లుగా, లేక, కేంద్రము నుండి గోళోపరితలమునపైనున్న బిందువుల సమదూరత గోళ భావనలోనే అంతర్భూతమైనట్లుగ, లేక అంతకంటెను స్పష్టతరముగా, సంపూర్ణ సత్త్వభావనలో తదస్తిత్వము అంతర్భూతమైనట్లుగా, గ్రహించి, తత్కారణముచే, ఈశ్వరుని యొక్క, అనగా, ఈసంపూర్ణ సత్త్వముయొక్క అస్తిత్వము లేదా ఉండుట, రేఖాగణితశాస్త్రములోని యేనిరూపణయైన నెంత నిశ్చయమో, కనీసము అంతనరమైన నిశ్చయము అనియు తెలిసికొంటిని.

కాని యీ సత్యమును తెలిసికొనుటలోను, తమ మనస్సును నిజముగా నేమిటో తెలిసికొనుటలోనుగూడ కష్టమున్నదను విషయము చాలమందికి నచ్చుటకు హేతువు వారు తమ ఆలోచనల నెప్పుడును ఇంద్రియగోచర వస్తువులను దాటిపోనీయక (భౌతిక వస్తువులకు మాత్రమే పరిమితమగు ఆలోచనాప్రకారము) కల్పనాశక్తి ద్వారమున తప్ప మరియేమార్గమునను దేనిని గూర్చియు నాలోచింప నభ్యాసము లేని వారగుటయే. కావున, కల్పనీయముకాని దంతయు వారికి అబోధ్యముగ భాసించును. సాంప్రదాయిక దార్శనికులు, ముందుగా నింద్రియములచే గ్రహింపబడని దేదియు అవగత్యంతర్గతము కాదను సూత్రము అంగీకరింతురనునట్టియు,

ఈశ్వరాత్మ భావనలు ఎన్నడు ఇంద్రియగ్రాహ్యములు కావనుట యెటులను నిశ్చయము అనునట్టియు, సందర్భమువలన నే దీని సత్యము పర్యాప్తముగ తెల్లమగుచున్నది; మరియు ఈభావనల నాకలనము చేసికొనుటకు తమ కల్పనాశక్తి నుపయోగించువారు, ధ్వనులను వినుటకును, గంధముల నాఘ్రాణించుటకును, తమ చక్షువుల నుపయోగింప ప్రయత్నించుట వంటిపనినే సరిగా చేయుచున్నారు; అయితే చక్షురింద్రియము ఘ్రాణ, శ్రోత్రేంద్రియము లిచ్చుదాని కంటె హీనతర ప్రతీతినిచ్చుట లేదను భేదముండినతేతప్ప వాని స్థానమందు మన అవగత్యంతర్వర్తిత్వము లేనిదే మన కల్పనాశక్తిగాని, ఇంద్రియములుగాని, దేనిని గూర్చి దృఢవిశ్వాసము నీయజాలవు.

తుదకు, సోదాహరణముగా నేను వెలువరించిన హేతువులవలన, ఇంకను, ఈశ్వరాత్మల అస్తిత్వమునుగూర్చి చాలినంత నమ్మకములేని వ్యక్తులుండినయెడల, వారు తాము బహుశః దృఢతర సత్యములుగ విశ్వసించుచున్నారమని యెంచునట్టి, 'మనకు శరీరమున్నది, భూమియు, నక్షత్రములున్నవి' ఇత్యాది సమస్తములైన ఇతర ప్రతిజ్ఞావాక్యములును అంతకంటె తక్కువ నిశ్చితములుగా ఎరుంగవలెనని నేను కోరుచున్నాడను; ఎందుకనగా వాని యునికిని సందేహించుటలో, వైపరీత్యము భాసించునంతటి బలీయమైన

నైతిక దృఢవిశ్వాసము మనకీ వస్తువులను గురించి యున్నను, భౌతికాతీత దృఢవిశ్వాసమున కీప్రశ్న సంబంధించినంతదనుక, వానిని సంపూర్ణముగా విశ్వసింపకుండుటకు తగిన యూహారము మనకు గలదను విషయమును వివేకహీనుడు తప్ప ఎవ్వడైన నంగీకరించును. కారణము: నిద్రితులమై యుండగా మనము అన్యశరీరమును గలిగియున్నారమనియు, అన్యనక్షత్రములను, అన్యపృథ్విని చూచుచున్నారమనియు, ఊహింపగలము. వాస్తవమున కచ్చట నట్టివి లేనేలేవు. మనము కలగనుచున్నప్పుడు కలుగు నాలోచనలు, జాగ్రదవస్థలో నున్నప్పు డనుభూతములగు వానికంటె స్ఫుటత్వమున, వైశద్యమున తక్కువ కానప్పుడు, ఇందు రెండవవి అసత్యములు కావనియు మొదటివే అసత్యములనియు మన మెట్లు ఎరుంగుదుము? మరియు, అత్యంత ప్రతిభావంతులైన పురుషులు తమ ఇష్టము వచ్చినంత పర్యంతము, ఈప్రశ్నను పర్యాలోచించినను, ఈశ్వరాస్తిత్వ పూర్వసంభావన చేయనిదే ఈసంశయమును నిరస్తముచేయ పర్యాప్తమైన హేతువు నెద్దానిని ఈయగలరని నేను నమ్మను. ఎందుకన, ప్రప్రథమమున కొలది కాలము క్రితమే నిబంధనగా తీసికొనిన "మనము స్పష్టముగను, విశదముగను, ఊహింపగల వస్తువులన్నియు సత్యములే" అనుసూత్రముగూడ విశ్వసనీయమగుటకు ఈశ్వరుడున్నాడు, లేక విద్యమానుడు, ఆతడు సంపూర్ణసత్త్వము; మనకున్న దంతయు తజ్జన్యము అనునవిదే కారా

ణములు. దానినుండి నిగమనమిది: మనభావనలులేక ఊహలు ఎంతవరకు స్పష్టములు, విశదములు అయి ఉన్నవో అంత వరకు యథార్థములును, ఈశ్వర ప్రసాదితములును అగును. అందుచే అంతవరకు అవి సత్యములును కావలసినదే. కావున, కొంత అసత్యముతో కూడిన భావములు తరచుగా మనకు కలుగుచున్నను కలంతయో, గూఢతయోఉన్న వాని విషయమునమాత్రమే యిది సంభవించును. అనగా: ఈయంశమున నవి శూన్యమునందు పాల్గొనుటయే కారణము. అనగా, అవి మనలో అట్లు తారుమారుగా నుండుటకు కారణము. మనము సమగ్రముగా సంపూర్ణులము కాకపోవుటయే. మరియు, సత్యము, లేక సంపూర్ణత శూన్యమునుండి ప్రసారితము కావలెననుటయు, అసత్యము లేక అసంపూర్ణత, అది అసంపూర్ణత యైనంతవరకు, ఈశ్వరునినుండి ప్రసారితము కావలెనను టయు, సమానముగా అనుపపన్నములే అనుట తెల్లము. కాని, మనయందలి సత్యము యథార్థము అయిన దంతయు సంపూర్ణమును, అనంతము నగు సత్త్వము నుండియే వచ్చుచున్నది అని మన మెరుగక పోయినచో, ఎంత స్పష్టములు విశదములు అయినను, మనస్వభావములు సత్యవత్త్వము అను సంపూర్ణతనుగూడ కలిగియున్నవి అనుదృఢ విశ్వాసము కలుగుట కాధారము మనకు లేదు.

ఈశ్వరాత్మల జ్ఞానము మనలను ఈ నిబంధననుగూర్చి నిశ్చితులుగా చేసిన పిదప, జాగరూకులమై యున్నప్పుడు,

మనచే అనుభూతములగు ఆలోచనల సత్యము, మనస్వప్నములు భ్రమలు అను కారణముచే ఏమాత్రమును సంశయింపబడరాదని మనకు సులభముగనే అవగతము. ఎందుకనగా, ఒక వ్యక్తికి నిద్రించునప్పుడుకూడ అత్యంతము విశదమగు భావన కలిగెనేని, ఉదాహరణకు రేఖాగణితజ్ఞు డొకడు ఏదో యొక క్రొత్తనిరూపణను కనిపెట్టెనేని, అతడు నిద్రితుడై యున్నాడు అను పరిస్థితి దాని సత్యమును వివాదగ్రస్తముగా చేయలేదు. మరియు, వివిధ వస్తువులను మన బాహ్యేంద్రియములు వ్యక్తము చేసిన రీతిగనే స్వప్నములుకూడ వ్యక్తము చేయుచున్నవి. ఇది స్వప్నములలోని అతిసామాన్యదోషము. అట్టి యభిప్రాయముల సత్యమును మనము సందేహించునట్లది చేయవచ్చును. కాని దానికేమి? జాగరూకులమై యున్నప్పుడుకూడ అవి మనలను మోసగించును. ఉదాహరణ: కామెర్లు వచ్చినవారికి సమస్త వస్తువులును పసుపుపచ్చగా తోచుట; లేదా సుదూరమున నున్న నక్షత్రములు లేదా పదార్థములు, వాని స్వరూపముకంటె మనకు చిన్నవిగా గన్పడుట; సారాంశమేమనగా, జాగరూకులమై యున్నను, బుద్ధిప్రామాణ్యము లేనిదే యేవస్తువుయొక్క సత్యమునుగాని దృఢముగా నమ్ముటకు మనము అంగీకరింపరాదు. నేను మన "బుద్ధియొక్క, అని యనుచున్నాననియు, మన కల్పనాశక్తి యొక్క అనిగాని మన యింద్రియములయొక్క అనిగాని అనుటలేదనియు గుర్తింపవలసి యున్నది. ఎట్లనగా, ఉదా

హరణకు, మనము సూర్య్యని అతిస్పష్టముగా చూచుచున్నను, సూర్య్యుడు మన కగపడు పరిమాణమును మాత్రమే కలిగి యున్నాడని, తత్కారణముచే నిర్ణయింపరాదు; మరియు, అభూతకల్పన యొకటి యున్నదని పర్య్యవసితులము కానక్కర లేకుండగనే, సింహశీర్ష్షము మేషశరీరమునకు అతుకుకొని యున్నదని అతి విశదముగా కల్పన చేయవచ్చును; ఏలయన మనమట్లు చూచునది, లేక కల్పించునది యథార్థముగ నున్నదని బుద్ధితీర్మానింపలేదు. కాని, మనభావనలు, లేదా అస్పష్ట భావనలుకూడ కొంత సత్య్యమును కలిగియున్నవని అది తేట తెల్లముగ మనకు చెప్పుచున్నది. ఎందుకనగా: లేక పోయినచో, సమగ్ర సంపూర్ణుడును, సత్య్యశీలుడును అగు నీశ్వరుడు, వీనిని మనయందు నిక్షిప్తము చేయుట సంభవముకాదు; మరియు, జాగ్రదవస్థయం దున్నంత స్పష్టముగ, సంపూర్ణముగ, నిద్రావస్థయందు మనహేతువాదము లుండవు. (కొన్ని సమయములందు మనస్స్వప్న రూపములును అంత సజీవములుగా నిశితములుగాఁ లేక అంతకంటె అధికతరముగా ఉండియున్నను) మనము సమగ్ర పరిపూర్ణులముకాదు కావునను, అందువలననే మనయాలోచన లన్నియు సత్య్యములుకాజాలవు కావునను, జాగ్రదవస్థయందలి యనుభవములలోనే వాని యందలి సత్య్యము గ్రహింప నగును; స్వప్నావస్థయందుకాదు, అని మనబుద్ధి చెప్పుచున్నది.

పంచమ భాగము

ఈ ప్రధానసత్య్యములనుండి నేను నిగమనముచేసినట్టి సమగ్రసత్య్య పరంపరను మిక్కిలి సంతోషముతో ప్రవర్శింప బూనుకొనువాడనే. కాని పండితుల వాదోపవాదములకు లోనైన పెక్కు ప్రశ్నలనుగూర్చి నేను ప్రసంగింపవలసియుండును గావునను, అట్లు వారితో విరోధింప నభిలాషనాకులేదు గావునను, వానినిగూర్చి వివరింపకుండుటయే మంచిదని నేను విశ్వసించితిని. ఈ సత్య్యము లెవ్వియో మాత్రము స్థూలముగా చెప్పెదను. వానినిగూర్చి స్పష్టతరముగా వివరించుట ప్రజలకు లాభదాయకమగునో, కాదో, ఉత్తమార్హతగల వివేకులు తరువాత నిర్ణయింపవచ్చును. ఈశ్వరాత్మల యస్తిత్వమును నిరూపించుటలో నేనుపయోగించుచున్న సూత్రముదక్క అన్యము నెద్దానిని స్వీకరింపను అను నాతీర్మానమునందు నే నచంచలుడనైయుంటిని. అనగా, పూర్వము రేఖాగణితజ్ఞుల నిరూపణలకంటె మిక్కిలి స్పష్టముగను, నిశ్చితముగను నాకు జూపట్టనిదాని నెద్దానిని సత్య్యమని యంగీకరింపకుండుట. అయినను ఈయంశములను ప్రకటింప సాహసించుచున్నాడను. దర్శనశాస్త్రములో సామాన్యముగా చర్చింపబడు ముఖ్యములగు క్లిష్టతల విషయమున సంతృప్తికరములగు సాధనలను కొలది కాలములోనే కనుగొంటిని. అంతేకాదు. ప్రకృతిలో ఈశ్వరుడు స్థాపించిన కొన్ని నియమములను గమనించితిని. వానిని

గూర్చి మన మనస్సులో కొన్నియభిప్రాయములు నాటుకొను నట్లతడుచేసెను. ఒకమారు మనము వానిపై చాలినంతగా మననము చేసినచో, ప్రపంచమందున్నటువంటి, లేక సంభవించునట్టి అన్నిటియందును సరిగా అవి గమనింపబడుచుండెనను విషయమున మనము సంశయింపబనియుండదు. మరియు, ఈనియమముల క్రమమునుగూర్చి విచారించుటలో, నేను పూర్వమునేర్చుకొనిన, లేక నేర్చుకొన నాశించినవానికంటె, మిక్కిలి యుపయోగకరములును ముఖ్యములును అగు పెక్కు సత్యములను కనుగొంటినని నాకుతోచినది.

అందు ముఖ్యమైన వాని నొక గ్రంథములో వివరింపయత్నించి యున్నాడను, కాని కొన్ని యోజనలు తత్ప్రకటన కాతంకములై యున్నవి. నేనాగ్రంథమందలి విషయముల నిచ్చట సంక్షేపించుటకంటె సులభతరముగా తత్ఫలితములను తెలియజేయలేను. దానిని వ్రాయబూనుటకు పూర్వము భౌతికపదార్థముల స్వభావములను గూర్చి నాకు తెలిసినదంతయు అందిముడ్చవలెనని నాయుద్దేశ్యము. కాని, ఒక ఘన పదార్థపు వివిధముఖముల నన్నిటిని ఒకేరీతిని భాగుగా సమతలముపై వ్యక్తముసేయ తా మశక్తులమని కనుగొనిన చిత్రకారులు, ముఖ్యమగు దాని నొక్కటి యెంచుకొని, దాని మీద మాత్రమే ప్రకాశము పడునట్లుగా చేసి, మిగిలినవాని నన్నిటిని ఛాయలోనికి త్రోసి, ముఖ్యమైన వానిని చూచు

నప్పుడు అవి యెంతదనుక కానవచ్చునో అంతవరకే వానిని కనబడనిచ్చినట్లుగనే, నామనస్సులో నున్నదంతయు నాప్రసంగములో నిముడ్చ శక్తుడను గానను భయముచే, ప్రకాశములను గూర్చిన నాఅభిప్రాయములను మాత్రమే, ఒకింత విపులముగా నైననుసరే వివరింపదలచితిని. ఆ తరువాత, నమయము వచ్చునపుడు, కాంతి దాదాపు సమగ్రముగా వాని నుండియే వెలువడును కావున, సూర్యునిగూర్చియు, స్థిరనక్షత్రముల గూర్చియు కొంత చేర్వ నిశ్చయించితిని. కాంతిని ప్రసరించును గావున అంతరిక్షము గూర్చియు, దానిని ప్రతిబింబించును గావున గ్రహములను, ఉల్కలను, భూమిని గూర్చియు, భూమిపైనున్న పదార్థములన్నియు రంగుగలవియో, లేదా ప్రకాశసుగమములో, లేదా భాస్వరములో అయినందున, విశేషించి వానిని గూర్చియు, చిట్టచివరకు ఈ అన్నిపదార్థముల ద్రష్ట గావున మనుష్యుని గూర్చియు కొంత చేర్చదలంచితిని. ఇంకను ఈవిషయములన్నిటిని కొంత వరకు ఛాయలోనుంచుటకును, పండితులు అంగీకరించిన అభిప్రాయములనుగైకొను లేదా ఖండించు నవసరములేకుండగనే వానినన్నిటినిగూర్చి నాఅభిప్రాయములను స్వతంత్రముగా వ్యక్తీకరింపగల్గుటకును, ఎల్లప్రజలను వారివారి వాదములకు వదల నిశ్చయించితిని. ఈశ్వరుడు కల్పితావకాశములలో ఎక్కడనైన ఒక ప్రపంచమును నిర్మించుటకు పర్యాప్తమగు ప్రకృతిని యిప్పుడు సృజించునేని, ఆ ప్రకృతి విభిన్నభాగము

లను రకరకములుగాను, తారుమారుగాను చలింపజేయునేని, తద్వారమున కవులు ఎన్నడుగాని పరికల్పించనంతటి అప క్రమము గలిగిన అవ్యవస్థ బయలుదేరునేని, తాను స్థాపించిన నియమముల కనుగుణముగ ప్రవర్తించునట్లు ప్రకృతిని వద లుచు, మామూలు ప్రకారము తన యనుమతిని ప్రకృతికిచ్చి ఈశ్వరుడు తన పని ముగించునేని ఆ నూతనప్రపంచములో ఏమి జరుగునో దానిని గూర్చి మాత్రమే చెప్ప సంకల్పించి తిని. ఈ భావము తోడనే, నేను మొట్టమొదట ఈవిషయ మును వివరించితిని. మరియు, ఈశ్వరుని గూర్చియు, ఇటీవల నేను చెప్పిన దానికంటె మరేదియు నామనస్సునకు స్పష్టతర ముగను, బోధ్యతరముగను ఉండజాలదు అని దానిని ప్రదర్శిం చుటకు యత్నించితిని. ఎందుకన, దార్శనిక పద్ధతులలో వాదోపవాదములకు గురియగు రూపములుగాని, గుణములు గాని దానికి లేవనియు, సాధారణముగ నెవరైన నజ్ఞులమని భావింపగలంతటి యస్వాభావికమగు విషయమెద్దియైనను నందు లేదనియు, నేను స్పష్టముగా భావించితిని. పైగా, నేను ప్రకృతి నియమము లెవ్వియో గుర్తించి చూపితిని; మరియు, ఈశ్వరుని యనంత సంపూర్ణత్వమునై తప్ప నితరములగు సిద్ధాంతములపై నా తర్కక్రమమును నిలుపకుండ, సందేహ మున కెట్టి యవకాశమైన గల సర్వమునుగూర్చి నిరూపించు టకు ప్రయత్నించితిని. మరియు నీశ్వరుడు మరికొన్ని ప్రపంచ ములను సృజించెనేని ఈ నియమములు అనుష్ఠింపబడని ప్రపం

చమును సృజింపజాలడనియు, ఆ నియమముల స్వభావమట్టి దనియు నిరూపింప యత్నించితిని. ఆ తరువాత, ఈ నియమ ముల కనుగుణముగా, అవ్యవస్థగా నేర్పడిన ద్రవ్యము చాల వరకు అంతరిక్షమువలె వ్యక్తమగుటకు తగినరీతి నెట్లు క్రమత నేర్పరచుకొనినదో, ఆ లోగా, దాని భాగములు కొన్ని భూమిగను, కొన్ని గ్రహములుగను, తోకచుక్కలుగను, తక్కినవి సూర్యునిగను, స్థిరనక్షత్రములుగను ఎట్లు రూపంది నవో చూపితిని. మరియు ఈస్థితియందు కాంతికి సంబంధించిన విషయములను విస్తరించుచు, సూర్యునియందు, నక్షత్రము లందు చూపట్టు నాకాంతి స్వభావమెట్టిదో, ఎట్లు క్షణ మాత్రమున నది అక్కడనుండి అపరిమితమగు నంతరిక్షావ కాశముల బయనించునో, ఎట్లు గ్రహములనుండియు, తోక చుక్కలనుండియు నది భూమిపై ప్రతిబింబించునో, చాల దూరము నేను వివరించితిని. అంతరిక్షములయు, నక్షత్రము లయు ద్రవ్యము, స్థితి, గతి మొదలగు వివిధములగు వాని గుణములను గూర్చియు అనేకాంశములను దీనికి చేర్చితిని; తత్ఫలముగ, నేను వర్ణించిన వ్యవస్థయందలి వానితో సరి సమానముగా చూపట్టరానిది, లేదా కనీసము చూపట్టక పోవచ్చునది, అంతరిక్షమునగాని, నక్షత్రములయందుగాని, దర్శనీయమేగున దెద్దియు లేదని విశదీకరించుటకు, వానిని గూర్చి చెప్పదగినదంతయు చెప్పితినని నాతలంపు. తరువాత నేను ముఖ్యముగా భూమిని గూర్చి చెప్పదలంచితిని. ఏద్రవ్య

ముతో భూమి సంఘటితమైనదో, అద్దానికి నెట్టిగౌరవమూ నీశ్వరు డీయలేడని నేను స్పష్టముగ ముందే భావించినను, దాని భాగములన్నియు సరిగా కేంద్రాభిముఖము లగుటకు ఇది యెట్లు అడ్డము కాకాదో; ఉపరిభాగమున నీరును, గాలియు గల్గుటచే అంతరిక్షముయొక్కయు, విశేషించి చంద్రునియొక్కయు ప్రవృత్తి సర్వపరిస్థితులయందును, సముద్రములందు గన్పట్టునట్టి పాటుపోటులను, ఉష్ణ (అయనాంతర) దేశములందు గన్పట్టు జలవాయు ప్రవాహములను ఎట్లు కలిగించునో; పర్వతములు, సముద్రములు, నీటియూటలు, నదులు, ప్రకృతి సిద్ధముగా నండెట్లు రూపమునందునో, గనులయండెట్లు లోహములు జనించునో, పొలములలో మొక్కలెట్లు పెరుగునో, మరియు సాధారణముగ, మిశ్రితములు, లేక సంయుక్తములు అని సామాన్యముగ పిలువబడు వస్తువులన్నియు నెట్లుత్పత్తి చేయనగునో నేను చూపితిని; నక్షత్రములుగాక కాంతిజనకములగువానిలో నిప్పు తప్ప మరొకటి నాకు తెలియదు. కావున దాని స్వభావమునకు సంబంధించి సంతవరకు సర్వమును, అనగా:— దాని యుత్పత్త్యాధారకేతులెట్టివో—ఒక్కొక్కప్పుడు కాంతిలేకుండ ఉష్ణమును, ఉష్ణములేకుండ కాంతియును ఎట్లుండునో, అది వివిధవస్తువులపై వివిధములగు రంగులను నానావిధములగు గుణములను ఎట్లు కలుగజేయునో; ఎట్లది కొన్నిపదార్థములను ద్రవరూపమును పొందించి కొన్నిటిని గట్టిపరచునో; అది ఇంచుమించుగ

అన్ని వస్తువుల నెట్లూహారించునో, లేక ఎట్లు బూడిదగ, పొడిగ మార్చునో; తుదకు, దాని రసాయనిక క్రియా వైలక్షణ్యమాత్రమున నది ఆ భస్మమునుండి గాజు నెట్లు తయారు చేయునో చూపుటకును నేనెట్టి కష్టమును గణింపలేదు: ఎందుకనగా: బూడిద గాజుగా రూపాంతరమునందుట ప్రకృతి యందలి యొక అద్భుతవిశేషము. కావున నద్దానిని వివరించుట యందు నేను ప్రత్యేకమగు నానందము నందుచున్నాడను.

ఎట్లైనను ఈవిషయములఁబట్టి యీశ్వరునిచే ఈ ప్రపంచము నేను వినరించినట్లే సృజింపబడినదని తీర్మానించుటకు పవృత్తుడనై యుండలేదు; ఎందుకనగా, ఈశ్వరుడు ప్రప్రథమమున, అది యిప్పుడెట్లుండెనో అట్లే సృజించి యుండుట మరియు సంభావ్యము, కాని ఈశ్వరు డీ ప్రపంచమును ఏ ప్రక్రియా పుంజముతో భరించుచున్నాడో, ఆ ప్రక్రియాపుంజముతోడనే మొట్టమొదట ఈప్రపంచమును సృజించెననుట తథ్యము. మతశాస్త్రజ్ఞులందరు ఈయభిప్రాయమును ఏకముఖముననే స్వీకరించిరి. అందువలన ప్రారంభమునుండియు ఈశ్వరుడు ఈప్రపంచమునకు అవ్యవస్థితతప్ప మరొక రూప మీయకపోయినను, ప్రకృతి సూత్రములను కొన్నిటిని స్థాపించి అవియిప్పుడు ప్రవర్తించుచున్నట్లు ప్రవర్తించుటకు తన యామోదము నొసంగినచో, సృష్ట్యద్భుత

ప్రకారముయొక్క గణ్యతకు లోపములేకుండ, ఈప్రకారము గనే, భౌతికములగు వస్తువులన్నియు, కాలక్రమముగ ఇప్పుడు మనకవి యగుపడునట్లే కాగలిగెడివని నమ్మవచ్చును. ఈ భౌతిక వస్తువులు ఒక్కమారుగ పరిపూర్ణస్థితిలో ఉత్పత్తి యైనట్లు పరిగణించుటకంటె, అవి క్రమముగా ఈప్రకార మున ఈస్థితికి వచ్చినవని కనుగొనినచో, వీని స్వభావము మరియు సులభముగ నూహింపనగును.

నిర్జీవములను గూర్చియు, మొలకలను గూర్చియు, వివరించిన తరువాత జంతువులను గూర్చియు, అందు ముఖ్యముగా మానవుని గూర్చియు, వివరింప దలంచితిని. కాని, తక్కిన వానినిగూర్చి నే నేప్రకారముగ చెప్పితినో, ఆప్రకారముగ వీనిని గూర్చి చెప్పుటకు తగిన జ్ఞానము నాకిప్పుడు లేకుండుటచే, అనగా, కారణములనుండి కార్యములను నిగమనము చేసి, ఏమూలద్రవ్యములనుండి ఏప్రకారముగ ప్రకృతి వానిని సృజించెనో చూపుటకు తగిన జ్ఞానము లేకపోవుటచే, శరీరావయవముల బాహిరరూపమునందును, అంతరావయవముల ఆనుగుణ్యమునందును మనదేహమునకు అంతటను సరియగునట్టి మానవదేహమును, ముందు నేను వివరించిన ద్రవ్యము తప్ప నన్యమగు ద్రవ్యము నుపయోగింపకుండ ఈశ్వరుడు చేసెనని యు, ప్రథమమున ఆదేహమందు వివేకయుతమగు నాత్మను గాని, లేదా, వర్ధమానము లేక సూక్ష్మగ్రాహ్యమగు నాత్మగా

బనికివచ్చు మరేపదార్థమునుగాని, ప్రవేశపెట్ట లేదనియు నూహించి తృప్తుడనై యుంటిని. కాని, ఆతడు కాంతిహీన మగు నగ్నిని హృదయకోశమందు రగిల్చియున్నాడు. దానిని గూర్చి వివరించియేయుంటిని. ఎండకుండగనే ముందు ప్రోగు చేయబడిన గడ్డియందలి యుష్ణమునకును, క్రొత్త సారాయము పులిసి నురగెక్కుటకు గారణమైన యుష్ణమునకును, ఈయగ్ని యెవ్విధమువను భిన్నము కాదని నాతలంపు. ఈ దేహమందు, ఈయూహా ప్రకారము ఉండదగు ప్రవృత్తులను పరీక్షించునపుడు ఆలోచనాశక్తి మనకు లేకుండగనే, అందు వలన మనకాత్మలేకుండగనే, మనయందుండదగు వానినన్నిటిని సరిగా నేను గమనించితిని. అనగా, ఆలోచించుటయే స్వభావముగాగల, శరీరభిన్నమగు మనయీ భాగము వివేక హీనములగు జంతువులు ఏప్రవృత్తులలో మనను పోలియున్నవని చెప్పవచ్చునో, ఆప్రవృత్తులను దానికి ఇచ్చుచున్నదనుట. కాని, ఆలోచనపై నాధారపడి యుండుటచే ఈప్రవృత్తులలో మనకు మాత్రమే సంబంధించిన దాని నెద్దానిని నేను కనుగొనలేక పోతిని. తరువాత, ఈశ్వరుడు వివేకయుతమగు ఆత్మను సృజించి, దానిని, నేనుముందు వివరించినట్లొక ప్రత్యేక రీతిగ ఈశరీరమునకు చేర్చెనని నేను భావించి సంతసించినన్నిటిని నేను కనుగొన గల్గితిని.

కాని, అచ్చట నేనెట్లు ఆవిషయమును నడిపితినో చూపుటకునై, ఇచ్చట, హృదయకోశథమనుల గతినిగూర్చి

వినరించుటకు ద్దేశించితిని. జంతువులయందుచూపట్టునది ముఖ్యమును అత్యంత సాధారణమును అగు గతిగావున, అది తక్కిన వానినిగూర్చి యేమి తలంపవలెనో, దానిని వెంటనే నిర్ణయింపదగు సాధనమునిచ్చును. ఈ విషయమునుగూర్చి నేను చెప్పబోవునది తెలిసికొనుటలోగల కష్టము తగ్గుటకై, శరీర విజ్ఞేదన శాస్త్రమునందు ప్రవీణులుకానివారు, ఈ నిరూపణలను శ్రద్ధగాచదువ నారంభించుటకుముందు, వారిసమక్షమున నూపిరితిత్తులుగల (ఎందుకన ఇది అంతట చాలినంతదనుక మానవతుల్యమే) ఒక పెద్దజంతువుయొక్క హృదయకోశమును ఛేదింపించుకొని, అద్దానియందలి హృదయ వివరములను రెండు ను నిరూపింపబడునట్లు శ్రమనైకొన నుపదేశించుచున్నాను.

ప్రప్రథమమున కుడివైపున రెండు విస్తృతములగు నాళికలు, అనుగుణముగ నుండునట్టియు, రక్తమును పరిగ్రహించువానిలో ముఖ్యమగునట్టియు, దేహమునందలి తక్కిన సిరలన్నియు తనకు శాఖాప్రాయములుకాగా, వానికి తాను కాండమువలె నున్నట్టియు, మహత్సిరయు (vena cava; Hollow vein); నాడికాథమనియు (vena Artiriosa; Arterial vein) గలవు. నాడికాథమని కాపేరనుచితము; ఎందుకనగా, అదియు ఒక థమనియే. అది హృదయకోశమున జనించును. ఆకోశమును దాటిన తరువాత ఊపిరితిత్తులంతటను వ్యాపించుచు వివిధశాఖలుగా మారును. రెండు ఎడమ

ప్రక్కనున్న కుహరము. దానితో, పూర్వోక్తములగు వానికి పరిమాణమున సమానములు, లేక వానికంటె విశాలములు అగు రెండు ప్రవాహికలు సంగమించుచుండును. అదియే సిరాథమనిక (Arteria venosa venous artery) అదియు అనుచితముగనే అట్లు పిలువబడుచున్నది. ఎందుకన అది మామూలు సిరయే. అది ఊపిరితిత్తులనుండి వచ్చును. అచ్చటి నాడికాథమనితో అల్లుకొనియున్నట్టియు, మనము పీల్చుగాలి ప్రవేశించు శ్వాసనాళికతో అల్లుకొనియున్నట్టియు, నానా శాఖలుగ అది విభజింపబడును. మరియు, హృదయకోశమునుండి బయల్వెడలి శరీరమంతటకు తన శాఖలనుపంపు మహాథమని కలదు. అట్టివారికి, జాగరూకతతో, ఈరెండు కుహరములందున్న నాల్గువివరములును, మడతతలుపులవలె తెరచుకొనుచు మూసికొనుచుండు పదునొకండు సూక్ష్మత్వక్కులును చూపబడవలెనని నేను కోరుచున్నాను. అసగా, శూన్యగర్భమగు శిరయొక్క ముఖద్వారమున మూడు సూక్ష్మత్వక్కులుండును. అవి అచ్చట, ఆశిరయందున్న రక్తము హృదయముయొక్క దక్షిణ కర్ణికలోనికి సర్వదా ప్రవహించునట్లుగను, మరియు ఆరక్తము పైకి ప్రవహింపకుండ అపునట్లుగను, వ్యవస్థితములైయున్నవి; నాడికాథమని (Anterial vein) ముఖద్వారమున మూడు సూక్ష్మత్వక్కులుండును; అవి పూర్వోక్తములగువానికి కేవల విరుద్ధముగ నేర్పరుపబడియున్నవి. అవి, ఈకుహరమందున్న రక్తమును

వెంటనే ఊపిరితిత్తులలోనికి పోవునట్లు చేయును. కాని ఊపిరి తిత్తులలోనికి రక్తము హృదయకుహరములోనికి రాకుండ అరి కట్టును; మరియు ఈరీతిగనే, సిరాధమనికాముఖమున, రెండు మడతతలుపులున్నవి. అవి, ఊపిరితిత్తులనుండి రక్తమును హృదయముయొక్క ఎడమ వివరమునకు పోనిచ్చునుగాని, ఆరక్తమును తిరిగి రానీయవు; మరియు, మహాధమనియొక్క ముఖమున మూడు మడతతలుపులు గలవు. అవి హృదయ కోశమునుండి రక్తము పైకి ప్రవహించునట్లు చేయును. కాని పైనుండి రక్తము లోపలకు రాకుండ ఆపును. సిరాధమనికా ముఖము కోడిగ్రుడ్డువంటి ఆకారము గలదగుటచే, రెండు మడతతలుపులతో చక్కగా మూయబడును. తక్కినవి గుండ్రముగ నుండుటచే మూడు మడతతలుపులతో సుకరముగ మూయబడును. ఈ సూక్ష్మత్వమును లిన్నియుండుటకు మీద వివరించిన హేతువుకంటె భిన్నమగు హేతువు చూపట్టదు. మరియు, మహాధమనియు, నాడికాధమనియు, సిరాధమని కంటెను శూన్యగర్భసిర కంటెను, కఠినతరమును, దృఢతర మును అగు నిర్మాణము గలవనియు, వారు గమనింపవలెనని నాకోరిక; ఆతుది రెండును, హృదయకోశమును ప్రవేశించు టకు ముందు వ్యాకోచమునందును. అచ్చటినుండి, హృదయ కోశముతో సమానమగు పదార్థముతోడనే చేయబడిన, ద్వికోష్ఠసంజ్ఞాకములగు హృదయకర్ణికలుండును. తక్కిన శరీర భాగము లన్నిటికంటె, హృదయకోశమున హెచ్చు వేడి

యుండును. తుదకు, అత్యంతము వేడిచేయబడిన పాత్రలోనికి చుక్కలు చుక్కలుగ పోయబడిన ద్రవములన్నియు వ్యాకో చము నందునట్లుగనే, హృదయకుహరములోనికి పోవు ఏరక్త బిందువునైనను, త్వరలో వ్యాకోచము నంది విస్తరించునట్లు చేయుశక్తి ఈయుష్ణమునకు కలదు.

ఎందుకన: హృదయకోశముయొక్క కుహరములు, రక్త శూన్యములు కానప్పుడు, కుడినుండి శూన్యగర్భమగు శిర నుండియు, ఎడమనుండి నాడికాధమనిక నుండియు రక్తము వీని లోనికి అత్యవసరముగ ప్రవహించునని చెప్పుటకంటె హృద యకోశచలన విషయమున నాకు చెప్పవలసినదిలేదు; ఎందు కన: ఈనాళములు రెండును సదా రక్తపూర్ణములై యుండును. మరియు, హృదయకోశమువంకకు తిరిగియున్న వాని ద్వారములు మూయబడజాలవు. కాని, ఈహృదయ కుహర ములు రెండింటిలోనికి ఒక్కొక్క రక్తబిందువు పోయినంతనే ఈరక్తబిందువులు పోవుద్వారములు విశాలములగుట చేతను, అవి వచ్చు నాళములు రక్తపూర్ణములగుటచేతను, స్థూలము లగు నారక్తబిందువులు వెంటనే ఉష్ణసంగతి వలన విరళీకృత ములును, విస్తృతములును అగును. ఈప్రకారముగ, హృదయ కోశము వ్యాకోచమందునట్లు అవిచేయును. మరియు, అప్పుడే నాళీముఖమునగల కవాట పంచకమును వీడించి మూసి హృదయకోశములోనికి మరి రక్తము ప్రవహింపకుండజేయును.

మరియు, విరళీకృతములైన కొలదియు, తక్కిన రెండునాళములయొక్క ద్వాస్థిత కవాటములను ముందుకు త్రోసితీయును. అందువలన, ఈప్రకారముగా, ధమనికాసిరయొక్క శాఖలన్నింటిని, మరియు మహాధమనిని, ఒక్కసారిగనే హృదకోశముతోకూడ వ్యాకోచమునందునట్లు చేయును. ఆతరువాత, వెంటనే హృదయ కుహరములందు ప్రవేశించిన రక్తము చల్లబడును కావునను, చిన్నకవాటము లూగును, మూయబడును కావునను, శూన్యగర్భసిర యొక్కయు, నాడికాధమనిక యొక్కయు అయిదు కవాటములు నూత్నముగ తెరచుకొని హృదయకోశధమనికలను పూర్వమువలెనే వ్యాకోచమునందునట్లు మరల చేయు రక్తబిందువులకు రెండింటికిని మార్గము నొసంగును గావునను, హృదయకోశము, ధమనికల వలెనే సంకోచము నందును. మరియు, హృదయకోశమునందు ప్రవేశించు రక్తము, కర్ణికలనబడు రెండు కోష్ఠముల ద్వారమున పోవును గావున వానిగతి హృదయగతికి విరుద్ధముగ నుండును. హృదయము వ్యాకోచమునందు నప్పుడు అవి సంకోచమునందును. కాని, గణితశాస్త్ర నిరూపణ బలమునెడ నజ్ఞులగువారును, యథార్థహేతువులనుండి సత్యాభాసములను విడమరచు నభ్యాసము లేనివారును, పరీక్షింప కుండగనేపూర్వోక్తవిషయములను నిరాకరింప సాహసింపకుండ ఈక్రింది సత్యవిషయమును వీరికి చెప్పదలచితిని. సరితూగుటకై వేయు బరువు యొక్కయు, చక్రముల యొక్కయు, శక్తి, స్థితి, ఆకారములను గడియారముయొక్క చలనము అనుసరించి వచ్చును. అట్లే నేనిప్పుడు వివరించిన చలనములు హృదయకోశమునందు ప్రత్యక్షముగ జూడనగు ఆయా భాగముల యేర్పాటు నుండియు, వ్రేళ్ళతో స్పృశించి, గ్రహింపనగు నుష్ణము నుండియు, అనుభవమునుబట్టి తెలిసికొనగు రక్తస్వభావము నుండియు, అవశ్యము అనుసరించి వచ్చుచున్నది.

కాని, ఈప్రకారముగ హృదయకోశములోనికి సిరల నుండి నిరంతరము ప్రవహించు రక్తము సంపూర్ణముగ వ్యయము కాకపోవుటయు, హృదయకోశద్వారమున పోవు రక్తమంతయు తమలోనికేవచ్చు ధమనులు అత్యంతము సంపూర్ణముకాకపోవుటయు, ఎట్లు సంభవించుచున్నదని ప్రశ్నింతునేని, ఈవిషయమున ప్రప్రథమముగ త్రోవచూపిన ఇంగ్లాండు దేశపు వైద్యుని వ్రాతలనే సమాధానముగ నేనిచ్చట చెప్పవలసియుండును. ధమనులయొక్క చిట్టచివరను చిన్నమార్గములు పెక్కుగలవనియు, హృదయమునుండి ధమనులు గ్రహించురక్తము ఈచిన్నమార్గముల ద్వారముననే సిరలయొక్క చిన్న శాఖలకుపోయి తిరుగ హృదయకోశమునకు వచ్చుననియు, తన్మూలమున ఆరక్తమార్గము ఒక నిరంతర వ్యాపనముగనున్నదనియు, ఆతడు ప్రప్రథమముగ బోధించెను. ఈవిషయమున శస్త్రవైద్యుల సామాన్యానుభవము మనకు ప్రబల దృష్టాంతము. తగు పొడుగుగల గుడ్డపీలికతో, కోయ

బోవు శిరకు మీదిభాగమున, చేతికి కట్టుకట్టి, వారు రక్తమును ఇనుమడిగా ప్రవహింపజేయుదురు. ఆబంధమే లేనిచో రక్తమంతగా ప్రవహింపదు. వారు చేతికిని రంధ్రమునకును మధ్యగా క్రిందను కట్టుకట్టినను, లేదా మీదను గట్టిగాకట్టినను సరిగా తద్విరుద్ధమగు ఫలము కలుగును. ఎందుకనగా, తగు రీతిని బిగించిన కట్టు చేతియందప్పటికేయున్న రక్తము శిరాముఖమున హృదయకోశమువంకకు రాకుండ నరికట్టజాలునే కాని, ధమనుల ద్వారమున క్రొత్తరక్తము ముందుకురాకుండ ఆపజాలదు. ఏలన, ధమనులు శిరలక్రిందనున్నవి. మరియు, వాని పైపొరలు దృఢతరములుగావున నొక్కుట కష్టసాధ్యము. మరియు, శిరాద్వారమున, చేతినుండి రక్తము హృదయమునకు తిరిగివచ్చుటకంటె, హృదయముననుండి ధమనులద్వారమున చేతికివచ్చు రక్తము శక్తిమత్తరముగా ప్రవహించును. మరియు, శిరయందు గావింపబడిన ఛిద్రమువలన ఈరక్తము చేతినుండి పైకిపోవునుగావున, బంధమునకు క్రింద కొన్ని మార్గము లవశ్యముగానుండవలెను. అనగా, ధమనులనుండి రక్తమిచ్చటికి వేని మార్గమునవచ్చునో, అట్టి చేతిచిట్టచివరి భాగములనుట. ఈవైద్యుడు రక్తప్రసారవిషయమున తాను చెప్పిన యంశములను కొన్ని సూక్ష్మత్వక్కుల యునికినిబట్టి, బాగుగా స్థాపించుచున్నాడు. ఆ సూక్ష్మత్వక్కులు చిన్నకవాటములట్లు శిరామార్గమున నక్క డక్కడ నుండును. ఆయునికి యెట్టిదనగా: ఆచిన్నకవాటములు శరీరమధ్యమునుండిరక్తమును అగ్రములకు పోనీయవు; అగ్రములనుండి రక్తమును హృదయకోశమునకు రానిచ్చును. అంతమాత్రమే. మరియు, అవైద్యుడే ఒకయనుభవమును బట్టి, తన రక్తప్రసార సిద్ధాంతమును స్థాపించెను. ఆయనుభవ మిది: హృదయ కోశమునకు చాలదగ్గరగా ధమనిని గట్టిగా బంధించి, హృదయ కోశమునకు ఆ బంధమునకు మధ్యభాగమున కోసినచో అట్లు తెగిన ధమనినుండి కొలదికాలములోనే, శరీరమందలి రక్తమంతయు పైకి పోవును అందువలన ధమనినుండి పైకి ప్రవహించు రక్తము హృదయకోశమునుండి గాక, మరి యేభాగమునుండి యైన వచ్చుచున్నదిఅను నూహా కాధారమేయుండజాలదు.

కాని, నేను చెప్పినదే రక్తప్రసారమునకు నిజమగు కారణమని స్పష్టముగా బుజువుచేయు పరిస్థితులనేకములు గలవు: అట్లు మొట్టమొదట సిరలనుండి ప్రవహించు రక్తమునకును, ధమనులనుండి ప్రవహించు రక్తమునకును గల భేదము ఈక్రింద చెప్పబడు వానినుండి మాత్రమే కలుగగలదు. శిరములయందుండు నప్పటికంటె ధమనులయందుండు నపుడు, రక్తము హృదయకోశద్వారమున పోవుటచే, విరళము, శుద్ధమునై, పలుచబడి, ప్రకాశవంతమై, వేడిగనుండును. సావధానముగ చూచినచో ఈ భేదము, హృదయకోశ ప్రాంతమునసే మిక్కిలి విశేషించి యుండుననియు, దానికి చాల దూరముగానున్న భాగములందు అంత స్పష్టముగా

నుండదనియు తెలియనగును. రెండవ విషయము: నాడికాధమనియు, మహాధమనియు నిర్మింపబడిన చర్మముయొక్క దార్ఢ్యము, దీనిచే శిరలవైపుకంటె ధమనులవైపు రక్తము శక్తిమత్తరముగా ప్రోయబడుచున్నదని చక్కగ తెల్లమగును. హృదయకోశ ద్వారమున పోయిన తరువాత శ్వాసకోశమున మాత్రమే యుండిన శిరాధమనికా రక్తము, మిక్కిలి పలుచగను, విరళముగను, వెంటనే అగును. అది శూన్యగర్భశిరనుండి తత్క్షణమే నిర్గమించు రక్తముకంటె పలుచగనుండి, సులభతరముగా, అమోఘముగా మిక్కిలి విరళముకానిచో, హృదయకోశముయొక్క దక్షిణ కుహరము కంటెను, నాడికాధమని కంటెను, తద్వామ కుహరమును, మహాధమనియు ఎందులకు మిక్కిలి విస్తృతములును విశాలములును కావలెను? మరియు, రక్తము, తన స్వభావమును మార్చుకొనుట కనుగుణముగా, అధికతరమానముననో, న్యూనతరమానముననో, పూర్వముకంటె హెచ్చువేగముననో తక్కువ వేగముననో హృదయకోశముయొక్క వేడిమి వలన విరళీకృతమగునని తెలిసికొనినచో నాడిని పరిశీలించునప్పుడు వైద్యులేమి యూహింపగలరు? ఈవేడిమి తక్కిన అవయవములకెట్లు పంపబడు చున్నదను విషయమును గూర్చి విచారించినచో, సయ్యది హృదయకోశ ద్వారమునపోయి, అందు వేడిమి నంది తరువాత శరీరమందంతటను వ్యాపించిన రక్తము వలన నగుచున్నదని అంగీకరింపవలదా? అందువలన

ఒకభాగమునుండి రక్తము తీయబడినచో, ఆభాగమునుండి ఉష్ణముకూడ అట్లే తీయబడుట సంభవించుచున్నది. మండుచున్న యినుమువలె హృదయము వేడిమిగలదైనను, కాలుచేతులను వేడిమిగల వానినిగా అక్కడకు నిరంతరము రక్తమును పంపనిచో, చేయజాలదు. నిశ్వసించుట వలన నిజమగు నుపయోగము తగినంత స్వచ్ఛమగు గాలిని శ్వాసకోశములలోనికి తెచ్చి, హృదయకోశము యొక్క దక్షిణ జఠరికయందు విరళీకృతమై ఆవిరిగ మారినట్లుండి శ్వాసకోశములందు ప్రవేశించిన రక్తమును, హృదయకోశముయొక్క యెడమ కుహరమునందు ప్రవేశించుటకు పూర్వము, చిక్కబరచి క్రొత్తగా రక్తములోనికి మార్చుటయే. ఈప్రక్రియ యంతయు జరుగనిచో అందున్న ఉష్ణోగ్రతయొక్క పోషణమున కది యుపయోగపడదు. ఈక్రింది పరిస్థితినిబట్టి యీవిషయము దృఢపడుచున్నది. శ్వాసకోశములు లేని జంతువులకు హృదయకోశమున నొక్క కుహరమే యుండుననియు, గర్భాశయమందున్నప్పుడు శ్వాసకోశము నుపయోగింపలేని బిడ్డలకు శూన్యగర్భశిరనుండి హృదయకోశముయొక్క దక్షిణ కుహరములోనికి రక్తముపోవు నొకరంధ్రమును, నాడికాధమనికనుండి బృహద్ధమనికలోనికి శ్వాసకోశముల ద్వారమున పోకుండగనే రక్తము ప్రవహింపనగు నాళమును, ఉండుననియు కనుగొనబడినది. మరియు, హృదయకోశము ధమనికల ద్వారమున ఉష్ణమును జీర్ణాశయ

మునకు పంపనియెడలను, ఆహారమును విద్రవీకరించుటయందు తోడ్పడు రక్తద్రావణములను కొన్నిటిని పంపక పోయిన యెడలను, జీర్ణక్రియ యెట్లు నడచుచున్నది? హృదయకోశ ద్వారమున బహిశ్శః దినమునకు ఒకటి లేక రెండు వందల సార్లకు పైగా రక్తము వచ్చుచు పోవుచు పరిశుద్ధమగుచుండె నని తెలిసికొనినప్పుడు, ఆహారద్రవమును రక్తములోనికి మార్చు ప్రక్రియ సులభముగా అర్థముకాదా? విరళీకృతమగు చున్నప్పుడు హృదయకోశమునుండి ధమనుల యగ్రములకు పోవు రక్తశక్తి తాముచేరిన అవయవములందు తన యంశము లను కొన్నిటిని నిలుచునట్లుచేసి, తమచే పరిభ్రష్టములగు కొన్నిటి స్థానమును ఆక్రమించునని చెప్పుటకంటె శరీరము యొక్క వివిధ ధాతువుల పోషణోత్పత్తులను గూర్చి బుజువు చేసి వివరింపదగిన దేమున్నది? అవి కలియు ఛిద్రములయొక్క స్థితి, ఆకృతి, లేదా స్వల్పత్వము,- వీని కనుగుణముగా కొన్ని భాగములలోనికి కొన్ని ప్రవహించును. ఈ ప్రకారము గనే, నానావిధములుగ ఛిద్రములగు జల్లెడలుకూడ నానా విధములగు ధాన్యజాతులను విడదీయుట కుపయోగించును. ఈవిధముగ చెప్పుటకంటె శరీరమునందలి వివిధ ధాతువుల పోషణోత్పత్తుల వివరణ విషయమున బుజువుచేయ దగినది లేదు. మరియు, తుట్టతుదకు అన్నిటికంటె పశుతత్వ ప్రాదు ర్భావమే ముఖ్యముగా పరిశీలింప దగినది. ఆతత్త్వములు సూక్ష్మవాయువువలెను, లేదా, మిక్కిలి స్వచ్ఛమును విశ

దమును అగు జ్వాలవలెను, హృదయకోశమునుండి సమృ ద్ధిగా మెదడువరకు ఎడతెరపి లేకుండ ఆరోహించుచు, అందుండి నరముల ద్వారమున కండరములలోనికి చొచ్చు కొనిపోయి అన్ని అవయవములకును చలనమును కలిగించును. అత్యంతము సంభ్రమితములై లోనికి గ్రుచ్చుకొని పోవుట వలన, మెదడు వంకకు నిర్గమించు నీతత్త్వములను సంఘ టింపగల తక్కిన రక్తాణువులనుగూర్చి యీక్రింది కారణముల కంటె అన్యము ఊహించవలసిన యవసరములేదు. వాని నిచ్చటికి గొనివచ్చు ధమనులు హృదయకోశమునుండి మిక్కిలి తిన్నని రేఖలలో నిర్గమించును. యంత్రజ్ఞుల నియ మముల కనుగుణముగా - ఆ నియమములు ప్రకృతి విషయము నను సమానములే - ఒక్కమారుగా అనేక వస్తువులు ఒకే బిందువు వంకకు ప్రొయ్యగునప్పుడు, అచ్చట వాని యన్నిటికి తగినంత స్థలము లేకపోవుచో (హృదయకోశముయొక్క యెడమ కుహరమునుండి ముందుకు ప్రవహించుచు మెదడు వంకకు పోవురక్తాణువుల విషయమును ఇంతే.) బలహీనము లును, సంభ్రమము తగ్గినవియు నగు భాగములు తప్పక ఆ బిందువునుండి బలీయములగు వానిచే ప్రక్కకు తోయబడును. ఈప్రకారము, ఆ బలీయములగు భాగములే ఆ బిందువును చేరును.

నేను మొట్టమొదట ప్రకటింప దలంచుకొనిన వ్యాస ములో మిక్కిలి సూక్ష్మవిషయములతో గూడ ఈ యంశము

లన్నియు వివరించి యుంటిని. తెగిన వెంటనే స్వల్పకాలము వరకు తల నిర్జీవమైనప్పటికిని, కదలుచు, భూమిని కరచుచు నుండుట మనము చూచుచున్నాము. ఇట్లగుటచే శరీరమం దున్న పశుతత్త్వములకు అవయవములను కదల్పజాలు శక్తి సిచ్చుటకు, మానవశరీరముయొక్క నరములయు, కండరము లయు రచనా విధానమెట్టిదో; జాగ్రదవస్థ స్వప్ననిద్రావస్థలను కల్గించుటకు మెదడులో ఎట్టిమార్పులు, కలుగవలెనో; తేజస్సు, శబ్దములు, గంధములు, రుచులు, వేడిమి, మరియు బాహిరవస్తువులయొక్క సమస్తగుణములును, ఇంద్రియముల ద్వారమున వివిధాభిప్రాయముల నెట్లు దానియందు నాటు నట్లుగ చేయునో; తృష్ణాపాసలు మొదలగు నాంతర వికార ములు, మనస్సుపై వాని భావముల నెట్లు నాటునట్లు చేయ గలవో; ఈ యభిప్రాయముల నన్నిటిని పరిగ్రహించు సామాన్యబుద్ధివలననేమి తెలిసికొనవలెనో, వీనిని నిల్పుకొను చున్న స్మృతి కర్థమేమో; వానిని పెక్కు విధములుగ మార్పగలట్టియు, వానినుండి నూత్న భావములను సంఘటింప గలట్టియు కల్పనాశక్తి కర్థమేమో; పశుతత్త్వములను ఆ సాధనము తోడనే కండరముల ద్వారమున వ్యాపింపఁ జేయుచు, ఇచ్ఛాశక్తియొక్క దర్శకత్వమటుండగా, మన స్వవిషయమున నెన్నిసంభవింపగలవో వివిధములగు నన్ని మార్గములందును, దాని యింద్రియములకు ప్రత్యుపస్థాపితము లగు వస్తువులకుగాని, లేక ఆంతరములగు నుద్రేకములకు

గాని, యెద్ది తగునో ఆరీతి యందున్ను, అట్టి శరీరావయవము లను గదలునట్లు చేయగల కల్పనాశక్తి కర్థమేమో; నేను చూపియున్నాడను. మానవ పరిశ్రమచే కల్పింపబడిన వివిధ స్వయం చలన యంత్రములు చేయు నానావిధ భ్రమణముల నెరింగినవారికి ఈ విషయము అచ్చెరువు గొల్పదు. అందును జంతుశరీరమునందు జూపట్టు అసంఖ్యాకములగు నెముకలు, కండరములు, నరములు, ధమనులు, శిరలు, మరియు తదితర భాగములు—వీనితో సరిపోల్చిన యెడల, ఈ యంత్రనిర్మాణ మునకు సాహాయ్యపడిన భాగములు చాల తక్కువ. అట్టి వారు, ఈ శరీరమును ఈశ్వర నిర్మితమగు నొక యంత్రముగ తలంపవలయును. అయ్యది నిరుపమానముగ నేర్పరుపబడినది. మానవ నిర్మితమగు ఏ యంత్రముయొక్క భ్రమణముకంటెను, ప్రశస్తతరములగు భ్రమణములకు అది తగియున్నది. మరియు, ఇచ్చట ముఖ్యముగా నాగి చూపదలంచిన దొకటి కలదు. అవయవములందును, బాహ్యాకారము నందును, ఒక కోతిని గాని, లేదా వివేకహీనమైన మరి యే జంతువునైనగాని, సరిగా సరిపోలు యంత్రము లున్న యెడల వానికిని, ఈ జంతు వులకును స్వభావమునందెట్టి భేదము కలదని తెలిసికొనుటకు మనకు సాధనములు లేవు; కాని, మన శరీరముతో సరియగు రూపములు గల యంత్రములుండి, అవి మన పనులను అవ కాశ మున్నంతదనుక అనుకరింపగల్గినచో, అప్పటికిని అవి నిజముగా మనుష్యులు కావని తెలిసికొనదగిన శోధనలు

అత్యంతము నిశ్చితములు రెండు గలవు. అందు మొదటిది: ఒరులకు మన యాలోచనలను ప్రకటించుటకు సమర్థమగు రీతిని, మాటలనుగాని, లేక ఇతర సంజ్ఞలనుగాని, మన మేర్ప రచునట్లు అవి యుపయోగింపజాలవు. ఎందుకనగా: పద ముల నుచ్చరించునట్లుగను, దాని యవయవములందు మార్పును కలిగించు బాహ్యవస్తువుల కనుగుణముగా, కొన్ని క్రియలు వ్యక్తము చేయునట్లుగను, మనమొక యంత్రమును సులభముగా సృజించవచ్చును. ఉదాహరణకు: ఒకప్రత్యేక స్థలమునందు స్పృశించినచో, దానితో మనమేమి చెప్పగోరి యుంటిమో దానిని ఆ యంత్రము అడుగవచ్చును. మరొక చోట నైనచో, అద్దానికి బాధ కలిగినట్లు అరువవచ్చును. అట్లే మరికొన్ని పనులను చేయవచ్చును. కాని, అత్యంతము స్వల్పబుద్ధిగల మానవుడైనను చేయగల యట్లు సమ్ముఖమున చెప్పబడిన దానికి యుక్తముగా ప్రత్యుత్తర మిచ్చుటకై అది పలువిధముల తనమాటల నేర్పరచు టెన్నడు సంభవింపదు. రెండవ శోధన: అట్టి యంత్రములు పెక్కింటిని, మనతో సమముగ, బహుశః మనకంటె అధికముగ లోపరహితముగ చేయగలిగినను, నిస్సందేహముగ అవి మరికొన్నిటియందు తప్పగలవు. అందువలన నవి జ్ఞానమూలకముగ ప్రవర్తింప లేదనియు, కేవలము వాని యవయవముల ఏర్పాటు మూలముననే, అట్లు చేయుచున్నవనియు, కనుగొనగలము. ఎందుకనగా, వివేకము విశ్వజనీనమగు నుపకరణము.

అది ప్రతి సమయమునందును లభ్యమగును. ఇక, ఈ యవయవములు, తద్విరుద్ధముగా, ప్రత్యేకకార్యము నకును ప్రత్యేకమగు నేర్పాటును గోరును. జీవితమునందలి ప్రత్యవసరమునందును మనకుగల వివేకము మనల నెట్లు వ్యవహర్తలుగ చేయుచున్నదో, అట్లుచేయ సమర్థతగల అవయవ వైవిధ్యము ఏ యంత్రమునందైన నుండుట విపేచింపగా నసాధ్యము. మరియు, ఈరెండుశోధనలమూలమున, ఆప్రకారమే, మానవులకును, పశువులకునుగల భేదమును మనము తెలిసికొనవచ్చును. ఇట నొక్కిచెప్పదగిన విషయ మొకటి గలదు. మానవులయందు, భిన్నపదములనుగలిపి తమ యభిప్రాయమును సుబోధకముగ ప్రకటించి చెప్పలేనిమంద బుద్ధి ఎవ్వడును లేడు. ఇంకొకవంక, ఎంతసంపూర్ణమైనదైనను, లేదా ఎంతటి అదృష్టములగు స్థితులయందున్నను అట్టిది చేయగల జంతువెద్దియును లేదు. ఈ యశక్తి అవయవలోప ముచే నేర్పడినదికాదు. ఎందుకనగా, గోరువంకలు, చిలుకలు మనకువలెనే పదముల నుచ్చరింపగలవు. అయినను మనము మాటలాడినట్లు మాటలాడజాలవు. అనగా, అవి చెప్పునది వాని కర్థమైనదని చూపగలట్లు మాటలాడజాలవనుట. అట్టి యెడ పుట్టుచెమిటి, మూగవారినిచూడుడు. ఇతరులు మాట లాడునెడ నుపయోగించు నవయవములు వారికిలేవు. వారు స్వచ్ఛందముగా కొన్ని సంజ్ఞలను సృజించి, తమ యభిప్రాయ ములను వెల్లడింతురు. వారి సాంగత్యమున తరచుగానుండు

టచే, వారిభాషను గ్రహించుట కవకాశముగలవారికి, వారి భావములు తెలియజేయుదురు. ఇది మానవులకంటె పశువులకు తక్కువ వివేకము కలదనుటయేకాక, ఉపరివాని కెట్టి వివేకమును లేదని ఋజువుచేయుచున్నది. ఎందుకనగా, మనుష్యుని మాటలాడ శక్తిగలవానినిగా జేయుటకు కావలసినది చాల తక్కువ. మరియు, ఒకేజాతికిచెందిన జంతువులందు, మానవులందువలెనే, సామర్థ్యవిషయమున హెచ్చుతగ్గులు చూడనగును గావునను, ఉపదేశింపబడుటకు కొందరికంటె కొందరు శక్తిమత్తరులగుమరు కావునను జంతువుల యాత్మ మన యాత్మకంటె సంపూర్ణ భిన్నస్వరూపముగలదైనప్పుడు తప్ప, తమజాతిలో అత్యంతము లోపరహితమగు కోతిగాని, చిలుకగాని, అత్యంతము మందబుద్ధిగల శిశువుతోడగాని, లేదా అధమము మతిపోయిన శిశువుతోగాని, సరికాకూడదనుట నమ్మదగిన విషయము కాదు. మరియు, ఉద్రేకములను సూచించునట్టియు, జంతువులు విశదపరచునట్లే యంత్రము లనుకరింపగలట్టియు స్వభావసిద్ధములగు చేష్టలను సంభాషణ శక్తిగా భ్రమింపరాదు. జంతువులుకూడ మాటలాడుననియు, వానిభాష మన కర్థముకాదనియు, మనప్రాచీనులవలె తలంపరాదు. ఎందుకనగా: అది యట్లే యయినచో, మన యవయనములతో సరిపోలు నవయవము లనేకములు వానికిని గలవు గావున, తమసహచరులకు తెలియజేయునట్లే వాని యాలోచనలను మనకుగూడ తెలియజేయగలిగియుండెడివి.

ముఖ్యవిషయ మింకొకటి గలదు: కొన్ని పనులలో మనకంటె నధికతరమగు నేర్పును వ్యక్తముసేయు జంతువు లనేకములున్నను, అవేజంతువులు మరికొన్నింటియందు, ఎట్టి నేర్పును చూపకపోవుట గమనింపదగిన విషయము కావున, మనకంటె బాగుగా అవి పనిసేయుట వానికి మతిగలదను విషయమును నిరూపింపదు. ఎందుకనగా, దానివలన జంతువులకు మనకంటె నధికతరమగు వివేకము గలదనియు, మనలనవి సర్వవిషయములందు నతిక్రమింపగలవనియు తేలును. తద్వ్యతిరేకముగ, అవి వివేకహీనములనియు వాని యవయవక్రమమున కనుగుణముగా తత్స్వభావమే పనిచేయుచున్నదనియు నిరూపింపబడుచున్నది. అట్లు చక్రములతోడను, భారవాహికల (Weights) తోడను చేయబడిన గడియారము మన నైపుణ్యమంతటితో మనము చెప్పినదానికంటె సరిగా గంటలుచెప్పి కాలమానమును కొలువగలదని తెలియుచున్నది.

దీని తరువాత నేను వివేకయుతమగు ఆత్మనుగూర్చి వివరించియుంటిని. నేనింతకుముందు ప్రసంగించిన యితర వస్తువులకువలె, అద్దానిని భౌతికశక్తినుండి బయలు దీయుటకు ఎవ్విధమునను వీలులేదనియు, అయ్యది స్పష్టముగా సృజింపబడియుండుట తథ్యమనియు తెలియజేసియుంటిని; మరియు శరీరావయవ విన్యాస విషయమున తప్ప తక్కిన విషయములలో ఓడయందు తచ్ఛోదకుడున్నట్లు అది శరీరమందున్న చాలదు. ఇక నది, మనకున్న వానితో సమానమగు ఇంద్రియ

జ్ఞానము, ఆశలు కలుగునట్లుచేసి నిజమగు మానవుని నిర్మించుటకై శరీరముతో కలిపి జతచేయబడియుండుట అవసరము. చిట్టచివరకు, ఆత్మ మిక్కిలి ముఖ్యమగుటచే దానినిగూర్చి సుదూరము చెప్పితిని. ఎందుకనగా, కొందరు ఈశ్వరుడు లేడందురు. ఆ తప్పును నేను చాలినంతగా ఖండించితినని తలంచుచున్నాడను. మనయాత్మయు, జంతువుల యాత్మయు సమాన స్వభావము గలవే యనియు, అందువలన ఈజీవితానంతరము ఈగలకంటె, చీమలకంటె ఆశింపవలసినదిగాని, భయపడ వలసినదిగాని ఎద్దియు లేదనియు, తలంచుటకంటె, నిర్వక్రనైతిక మార్గమునుండి దుర్బల మనస్కుల నమార్గమునకు ద్రిప్ప శక్తిమంతమగు దోషము, నాస్తికత్వము దప్ప మరొకటిలేదు. మనయాత్మలును, జంతువుల యాత్మలును ఎంతగా భిన్నములో, మనకు తెలిసినప్పుడు, ఆత్మస్వభావమును, శరీర స్వభావమును ఒండొంటితో సంబంధములేని వనియు, అందుచేత ఆత్మ, శరీరముతో మరణింపదనియు, స్థాపించు హేతువులను మనము అవగాహన చేసికొనగలము. చివరకు, దానిని నశింపజేయగల కారణములు గన్పట్టుట లేదు. కావున, అది అమరమని తీర్మానించుటకు మనము సహజముగా ఇష్టపడుదుము.

షష్ఠభాగము

ఈ విషయములన్నియుగల వ్యాసమును నేను ముగించి మూడేండ్లయినది. ముద్రాపకుల కిచ్చునుద్దేశముతో దానిని

నేను తిరిగి సరిచూచు చుంటిని. అప్పుడు కొందరు కొలది కాలము క్రిందట ఒకవ్యక్తి* ప్రచురించిన ఆధిభౌతిక శాస్త్రసిద్ధాంతము నొకానొక దానిని ఖండించిరని నేను తెలుసుకొంటిని. ఆ ఖండించిన వ్యక్తులయెడ నాకు మిక్కిలి గౌరవము కలదు. నాకార్యకలాపముపై వారికి గల యధికారము, నాయాలోచనలపై నావివేకమునకుగల ప్రభావముతో సమానము. ఆసిద్ధాంతమును నేను సమ్మతించితినని నేను చెప్పుటలేదు. కాని వారియాక్షేపణకు పూర్వము దానియందు, మతమునకుగాని, రాష్ట్రమునకుగాని అపాయకరమగునని నేను భావింపదగినదాని నెద్దానిని నేను కనుగొనలేదు. కావున, నాబుద్ధికది సత్యమని తోచినచో దానిని గూర్చి యాలోచించుటలో నన్నాపునదియు లేదని కనుగొంటిని. అత్యంతము నిశ్చితముగా నేను నిరూపింపజాలనిచో క్రొత్త నమ్మకముల నంగీకరింపకుండుటకును, ఎవ్వరికైన నష్టదాయకమగుదాని నెద్దానిని ప్రాయకుండుటకును నేను సర్వదా మిక్కిలి జాగరూకుడనై యున్నను నాసిద్ధాంతము లంచుగూడ నపార్థమునకు గురియగునవి గన్పట్టునేమో అని నేను భయపడితిని. గ్రంథమును ప్రకటింపవలెనను నాయుద్దేశమును మార్చుకొనుట కీయాలోచనలు చాలును. నా పూర్వనిశ్చయమునకుగల హేతువులు మిక్కిలి బలీయములే. అయినను, గ్రంథరచనయెడ నాకభిరుచిలేదు. ఆవై ముఖ్యము కారణ

* గలీలియో

ముగ (గ్రంథ రచన) ఆపనినుండి తప్పించుకొనుటకై అనేకములగు నితర హేతువులను వెంటనే నేను కనుగొనగల్గితిని. ఇట్టి నంకల నా హేతువుల స్వభావమిట్టిది: ఇచ్చట వానిని వ్యక్తీకరించుటలో నాకు శ్రద్ధయుండుటయేగాదు; వానిని గూర్చి తెలిసికొనుటలో జనసామాన్యమునకును కొంతశ్రద్ధ యుండవచ్చును.

నా మానసికశక్తులనుండి ప్రసారితములగు వానికి నేనెన్నడు నధికమగు విలువనీయలేమ. ఎంతదనుక విచారణాత్మకములగు శాస్త్రములకు సంబంధించిన కొన్ని చిక్కుల విషయమున నేను సంతృప్తి నందుటకంటెగాని, లేదా, తచ్ఛాస్త్రోపదిష్ట హేతువులతో నాప్రవర్తనను సరిచేసికొనుటకు యత్నించుటకంటెకాని, అధికమగు ఫలమును నేనుపయోగించు పద్ధతియందు నేను సేకరింపనో, అంతదనుక, దానికి సంబంధించిన దాని నెద్దానిని ప్రకటింపవలసిన బాధ్యత నాకు గలదని నేను విశ్వసింపలేదు. ఇక ప్రవర్తన విషయము: ప్రతివ్యక్తియు సమృద్ధమగు తన సద్బుద్ధియెడ గట్టి నమ్మకము గలవాడే. కావున, ఈశ్వరునిచే సర్వోత్కృష్టులగు ప్రజాపరిపాలకులుగ స్థాపింపబడినవారుగాని, లేదా తాము ప్రవక్తలు కావగినంత కృపయు, నుత్సాహము నీశ్వరునిచే గాంచినవారుగాని, కాక మరెవ్వరైనగాని, మన యాచార మూర్ఖముల యెన్నికలో పాల్గొన ననుమతి గాంచినచో

ఒక్కొక్క వ్యక్తికి ఒక్కొక్క సంఘసంస్కారి కానుపింపగలడు. నాయూహలు నాకు ముదావహములగుగాక; ఇతరులకుగూడ వారి వారి యూహలుండును. అవి వారికి మరియు సంతోషదాయకములు కావచ్చును. ఆధిభౌతికశాస్త్రమునకు సంబంధించిన సాధారణాభిప్రాయములను కొన్నిటిని నేను సంపాదించి విశిష్టములగు వివిధ క్లిష్టతలయందు నిరూపణల చేయ నారంభించినంతనే, అయ్యవి యెంతదనుక మనలను తీసికొని పోగలవో, నేటివరకు నుపయుక్తములై యున్న సూత్రములకు అవియెట్లు భిన్నములై యున్నవో, కనుగొంటిని. నేను, అంతట వానిని దాచియుంచినచో జగత్కల్యాణ సంధాయకమగు ధర్మమునెడ మహోపచారము గావించుచున్నాడనని నమ్మితిని. ఆ సూత్రముల మూలమున జీవితమునకు చాల నుపయోగకరమగు జ్ఞానమును సంపాదించుట కవకాశము కలదని నేను తెలిసికొంటిని. సామాన్యముగా దర్శనశాస్త్రములందు చెప్పబడు విచారణాత్మక తత్త్వశాస్త్రమునకు బదులుగా, వాస్తవమగు తత్త్వశాస్త్రమును కనుగొనవచ్చుననియు, అద్దాని సాహాయ్యమున అగ్ని జల వాయు నక్ష త్రాకాశములయొక్కయు, మనలను చుట్టియున్న సమస్తపదార్థములయొక్కయు, శక్తిని, పనిని — శిల్పుల వివిధములగు చేతిపనులను ఎంత స్పష్టముగా తెలిసికొందుమో, అంత స్పష్టముగా తెలిసికొని, ఆవిధముగానే ఏ ఉపయోగములకవి తగునో వానికి వానిని అనువర్తింపజేసి, ప్రకృతికి ప్రభువులమును, హక్కుదారులమును మనము కాగల

మని కనుగొంటిని. బహుశ్రమలేకుండ భూమిఇచ్చు ఫలము లను, సకలసుఖములను, ఆనందముగ అనుభవించినట్లు మనలను చేయగల అనంతములగు కళలను క్రొత్తగా కనుగొనుటకే గాక, ముఖ్యముగా ఆరోగ్యరక్షణమునకుగూడ ఇది కోర దగినఫలము. ముఖ్యముగా ఆరోగ్యము జీవితానందకర హేతువులలో ప్రథమమును, ప్రముఖమును. ఎందుకనగా, శరీరావయవ గుణప్రవణతలపై మనస్సు చాలహెచ్చుగా ఆధారపడియున్నది కావున, మానవులను పూర్వముకంటె ఘనతరులగు మేధావులుగను, సహజశక్తియుతులుగను చేయు సాధనము ఎప్పుడైన కనుగొనబడినచో అద్దానికై వైద్య శాస్త్రమునందే వెదుకవలెనని నానమ్మకము. ఇప్పు డున్న ప్రకారముచూచినచో, వైద్యశాస్త్రము,సుప్రసిద్ధోపయోగము గలవానిని కొలదిగనే కలిగియున్నదనుట సత్యము. కాని, ఇప్పుడందు తెలిసికొన్నది, కనుగొనవలసినదానితో సరిపోల్చి నచో, ఇంచుమించుగా శూన్యమే అని అంగీకరింపనివాడు వైద్యమే వృత్తిగా కలవారిలోకూడ ఉండడని నేను నమ్ము చున్నాను. ఇందు వైద్యశాస్త్రమును తక్కువపరచు నుద్దేశము నాకులేదు. మనకు వాని కారణములనుగూర్చియు, ప్రకృతి యొసంగిన పరిహారములగూర్చియు తగినంత సంపూర్ణ జ్ఞాన మున్నచో, అనంతములగు శారీరక మానసికజాడ్యములు నుండియు, బహుశః, వార్ధక్యాశక్తినుండియుగూడ మనము విముక్తులము కాగలమనియు నేను విశ్వసింతును. నేను నా

జీవితమంతయు అత్యావశ్యకమగు ఆ శాస్త్రశోధనమునందు వినియోగించుట కుద్దేశించితిని కావునను, జీవితపరిమాణము తక్కువగుట లేక, ప్రయోగములు చాలకపోవుట అనువానిచే అడ్డగింపబడినప్పుడుతప్ప, ఎవ్వడైనను ఎట్టిమార్గము ననుస రించినచో తప్పనిసరిగ కోరిన చరమస్థానమును చేరగలడో, అట్టిమార్గమును నే ననుసరించితిని కావునను, నేను కనుగొనిన అస్వల్పవిషయమును ప్రజలకు తెలియజేయుటకంటెను, అధిక ప్రజ్ఞావంతులను, తమతమ ప్రవీణత్వమునకును, శక్తికిని అను గుణముగ ప్రజానీకమునకు వారు క్రొత్తగా కనుగొనిన విష యముల నెరుకపరచుచు, చేయదగిన ప్రయోగములకు తోడ్పడుచు, ముందుకుపోవ యత్నింపవలెనని ప్రేరేపించుటకంటెను ఈ రెండుఅడ్డంకులకు అమోఘమగునేర్పాటు మరొకటిలేదని నేను నిర్ణయించితిని. అందువలన తుది నారంభించినవాడు తనకుముందు గావించినవారు వదలినచోట ప్రారంభింప వచ్చును. అట్లుబహుజనుల జీవితమును, శ్రమను కలిసినచో ఎవరికివారే చేయగలిగినదానికంటె, ఏకముఖమున మనము ముందుకు పోగలము.

మరియు, జ్ఞాన మధికమగుచున్నకొలదియు, ప్రయో గావశ్యకతయు సదా అధికమగుచుండునని నేను నొక్కి చెప్పి యున్నాడను. ఎందుకనగా, ప్రారంభమందు అసాధారణ ములు, దురహగాహములు అగు దృశ్యములయెడ శ్రద్ధవహిం

చుటకంకె ఏ కొలదిపాటిగ యోజించినను సరే ఎద్దాని విషయమున మనము అజ్ఞతయందుండ జాలమో, ఎయ్యది మన యింద్రియములకు స్వచ్ఛందముగ చూపట్టునో, అట్టిదానినే ఉపయోగించుకొనుట చాలమంచిది. కారణమేమనగా, ఎంత దనుక మిక్కిలి సామాన్యములగు వాని హేతువులు మన కింకను తెలియవో, అంతదనుక, మరియు నసాధారణములు తరచుగ మనల నపమార్గమున పెట్టును. మరియు, అవి యాధారపడు పరిస్థితులు ఎల్లప్పుడును ఇంచుమించుగా మనము కనుగొనలేనంత విశిష్టములు, సూక్ష్మములునై యుండును. కాని, అందు నే నీక్రింది వరుసను గైకొనుచున్నాడను. ఒకటి: సామాన్యముగ ఈ ప్రపంచమందున్న, లేదా, ఉండగల సర్వముయొక్క ప్రథమ సూత్రములను, లేదా, కారణములను తెలిసికొనుటకు యత్నింతును. ఈ యుద్దేశము తోడనే, ప్రపంచమును సృజించిన ఈశ్వరుని తప్ప మరి యే యితరమును విచారణలోనికి తేదలుచుకొనలేదు; సహజముగ మన మనస్సులందున్న కొన్ని సత్యబీజములనుండి తప్పమరియే యితరాధారముల నుండియు వీనిని రాబట్టు నూహ చేయ దలుచుకొనలేదు. రెండు: ఈ హేతువులనుండి నిగమనము చేయగలిగిన సర్వసామాన్య ప్రథమ ఫలితము లెవ్వియో నేను పరీక్షించితిని. ఈ ప్రకారముగ సర్వసాధారణములు, అక్లిష్టములు కావుననే, తెలిసికొనుటకు మిక్కిలి సుకరములు అగు ఆకసము, నక్షత్రములు, భూమి, ఆభూమిపైగూడ నీరు

గాలి, అగ్ని, లోహములు, ఈజాతికి చెందినవే మరికొన్నియు నేను కనుగొనియున్నాడనని నాకు తోచినది. తరువాత, నేను మరియు ప్రత్యేకాంశములకు దిగ నుద్దేశింపగా, నానావిధములగు పదార్థములు నాకు చూపట్టినవి. తత్ఫలముగ అచ్చట వాని నుంచుట ఈశ్వరునకామోదకరమగునో అచ్చట నుండియుండెడి అనంతములగు మరికొన్ని వస్తువులనుండి భూమిపై నున్న వస్తురూపములను, లేక జాతులను వేరుచేయుటకు గాని, తత్ఫలితముగ, వానిని మన యుపయోగములకై వినియోగించుటకుగాని, తత్ఫలితములను చక్కగా పరిశీలించుటవలన మనము వాని కారణములకు పోయి, వివిధ ప్రత్యేకానుభవములను మనకు పనికివచ్చునట్లు చేయనిచో, మానవ బుద్ధి సమర్థముకాదని నేను నమ్మితిని. అందుపై, ఇంద్రియగోచరమైన సమస్త వస్తువులను గూర్చియు ఆలోచింపగా, నేను కనుగొనిన సూత్రములనుబట్టి నేను సంతృప్తికరముగా వివరింపజాలని వెవ్వియు నే నెప్పుడు గమనింపలేదని నేను నిరాఘాటముగా తీర్మానించి చెప్పుటకు సాహసించుచున్నాను. కాని, యీక్రింది విషయము లొప్పుకొనక తీరదు: ప్రకృతి శక్తి సమృద్ధము; విస్తృతము; ఈ సూత్రములు సూక్ష్మములు, సాధారణములు: కావున ఆ సూత్రముల నుండి భిన్నములగు నానేక మార్గముల నిగమనము చేయతగిన వని నేను వెంటనే తెలిసికొనుటకు వీలులేని ప్రత్యేక ఫలితమొక్కటియు నేను గుర్తింపలేదు. కావున, ఈ వివిధమార్గములలో, ఎద్దాని

ద్వారమున దానిని పరిశీలింపదగునో కనుగొనుట తరచుగా నాకు మిక్కిలి కష్టదాయకమైయున్నది; ఎందుకనగా ఈకష్ట మునుండి తప్పించుకొనవలెనన్నచో మరికొన్ని ప్రయోగము లను వెదకుటకంటె నాకు మార్గాంతరము లేదు. ఆ ప్రయో గము లెట్లుండవలెననగా: ఈ రీతులలో, ఒక దానితో మనము వివరింపవలసిన ప్రయోగముయొక్క ఫలితమును, మరొక్కరీతితో వివరింపవలసినదాని ఫలితమును ఒక్కటి కాకూడదు. ఇక మిగిలినదాని విషయమున, ఆలోచింపగా, ఈ ప్రయోజనమునకు తోడ్పడు ప్రయోగములలో అధిక భాగమును చేయుటకు ఏమార్గమును గైకొనవలెనో, కావలసి నంత విశదముగా కనుగొనుటకు తగిన స్థితిలో నే నున్నాడను. కాని, నాకున్న పనివారుగాని, రాబడిగాని, ఇప్పటికంటె వేయిరెట్లధికమైనను, ఆ ప్రయోగము లన్నింటికిని సరిపడవు. అంతగా అసంఖ్యాకములై అవి యున్నవని నేను, ఈప్రకా రముగనే, కనుగొంటిని. కాబట్టి, నేను ప్రకృతి జ్ఞానమున పొందు నభివృద్ధియు, నేను చేయగల ప్రయోగములును, ఈ సమనిష్పత్తిలో నుండును. ప్రయోగములు కొలదిగా చేసినచో, కొలదిగనే అభివృద్ధియు, హెచ్చుగా చేసినచో, హెచ్చుగా నభివృద్ధియు ఉండును. నావిశ్వాసములో నేను తెలియజేయుట కాశించినదియు నిదియే. అనగా, తమ హృదయములందు మానవసామాన్యమగు మంచిగలవారు, అనగా బాహిరాకారమునను గాక యథార్థముగా పవిత్రులైన

వారు తమ ప్రయోగములనుగూర్చి నాకు తెలియజేయునట్లు ప్రేరేపించుటయే నేనాశించిన ప్రయోజము. ఎవరైన చేసిన ప్రయోగము లున్నచో, నేను చేయుచున్నవానిలో నాకు సహకరించుటకై, వానిని గూర్చి నాకు తెలియజేయుడు: అందువలన ప్రజానీకమునకు సహజమగు నభివృద్ధి చాల కలుగును.

కాని, అప్పటినుండి యితరకారణములు నాకు చూపట్టినవి. వానిని బట్టి నాయభిప్రాయమును నేను మార్చుకొన వలసిన వాడ నయితిని. మరియు, ఏమైన విలువగలవని నే నూహిం చిన ఫలితములన్నిటిని వాని యాథార్థ్యమును నేను పరీక్షిం చిన వెంటనే, వ్రాసికొనవలెననియు, వానిని ప్రచురింపదలం చినచో ఎట్టిజాగ్రత్తను వహింతునో అట్టి జాగ్రత్తనే వహింప వలెననియు తలంచితిని. ఈ మార్గము నాకు క్రిందికారణముల వలన నాదరణీయమైనది: అట్లయిన, వానిని సమగ్రముగ సూక్ష్మముగ పరిశీలించుటకు నాకు సమృద్ధమగు ప్రోత్సాహము కల్గును. ఎందుకనగా, నిస్సందేహముగ, మనస్పోపయో గమునకు మాత్రమే వ్రాయబడువానికంటె, పదిమంది చిసు వుదు రను నమ్మకముతో వ్రాయబడునని బహుసూక్ష్మముగా పరిశోధింపబడును. (మరియు, తరుచుగా, మొదటనే నూహించు నపుడు సత్యముగా తోచినది, వ్రాయుటకు ప్రారంభింపగనే అసత్యముగా తోచినది.) అట్లు వ్రాయుటవలన, నాచేతనగు

నంతవరకు ప్రజానీకముయొక్క లాభము నభివృద్ధి గావించు టలో ఎట్టియవకాశమును నేను వదలుకొనను. అట్లే, నావ్రాతల యం దేమైన విలువయున్నచో, నేను చనిపోయిన తరువాత అవి యెవ్వరిచేతిలోనైన పడినచో, వారు తమ కుచితమని తోచిన పనికి వానిని వినియోగించుకొందురు. కాని నాజీవిత కాలమున వానిని ప్రకటించుట కెంతమాత్రము నంగీకరింప కుండుటకు నేను నిశ్చయించుకొంటిని. ప్రకటించినచో వాని వలన జనించు ఖండనములుగాని వివాదములుగాని, లేదా, వాని వలన నాకు గలుగు కీర్తిగాని, నా యభివృద్ధికై నేను ప్రత్యే కించియుంచుకొనిన కాలమును పోగొట్టుకొనుటకు కారణమగు నని నాయూహ. ఏమనగా, యథాశక్తి ప్రతివ్యక్తియు లోక కళ్యాణముచే పెంపుసేయవలసినవాడనుటయు, ఇతరు లెవ్వరి కిని పనికిరాకుండ నుండుట వ్యర్థజీవితమే యనుటయు సత్యమే యైనను, మన యాలోచనలు ప్రస్తుతమునకు సంబంధించిన వగుటయేకాక, ప్రస్తుతము నతిక్రమించి యుండవలెననుటయు సత్యమే. కొన్ని నేటి వారికి బహుశః కొంత లాభకరములే యైనను, రాబోవువారికి మహత్తర లాభకరములగు లక్ష్యముల నిర్వహణము మన దృక్పథములో నున్నప్పుడు, అట్టివానిని వదలుటయే మంచిది. నిజముగా నే నితఃపూర్వము గ్రహించిన స్వల్పవిషయములును, నాకు తెలియని విషయములతోడను, నిస్పృహ చెందక నేను సంపాదింపగలనను జ్ఞానముతోడను, సరిపోల్చినచో, ఇంచుమించుగా శూన్యమని యనుటకు

సర్వథా నే నంగీకరించుచున్నాడను: ఎందుకనగా, శాస్త్రసత్యముల ను క్రమముగా కనుగొనువారును, ధనమార్జించువారును సరిసమానులే; ధనవంతులకు ఉన్నదానికంటె అధికమగు ధన సంపాదనము సులభసాధ్యము. నిర్ధనులైనప్పుడు స్వల్పముగా కూడబెట్టుటకూడ కష్టతరము. లేదా, శాస్త్ర పరిశోధకులను సేనాధిపతులతో సరిపోల్చవచ్చును. ఎట్లన: వారి జయముల కనుగుణముగ వారి బలములును పెరుగును. మరియు, విజయా నంతరము పత్తనములను, రాష్ట్రములను చేకొను నప్పటికంటె, అపజయానంతరము మిగిలిన సేనలను కలిపియుంచుట కధిక తరమగు వివేకము కావలెను. ఎందుకనగా, ఎవడు, సత్యజ్ఞాన సంపాదనయందు తన్ను నిరోధించు కష్టములను, తప్పిదములను అధిగమింప యత్నించునో, అతడు నిజముగ యుద్ధమున పాల్గొనిన వాడే. ఎట్టి సామాన్యతగాని, ప్రాధాన్యముగాని గల విషయమును స్పృశించు అసత్యాభిప్రాయమును అంగీక రించినను, ఆతడు యుద్ధమున జయింపబడినవాడే. ఒకమారు సమ్యగ్నిశ్చిత సూత్రములు తన యధీనమున నున్నప్పుడు పురోగమించుటకంటె, ఆ తరువాత తన పూర్వస్థితికి తిరిగి పొందుటకు మహత్తర నైపుణ్యము కావలెను. ఇక నా విష యము: శాస్త్రసంబంధిసత్యములలో నేమైనను కనుగొనుట యందు నేను జయముగాంచినచో (ఈ భాగమునందున్నవి నేను కొన్ని కనుగొన్నట్లు చూపునని నమ్ముచున్నాను) అవి నే నధిగమించిన అయిదారు ముఖ్యక్లిష్టసమస్యల ఫలితములు

మాత్రమే అనియు, ఆ యెమరొక్కనుటలో — వానిని నేను యుద్ధములుగనే లెక్కించితిని — విజయము నాకే గల్గినదనియు, నేను ప్రకటింపగలను. అట్టివే, మరి రెండుమూడు విజయములను పొందుటకంటె నా యుద్దేశములు సమగ్రముగా నెరవేరుటకు మరెద్దియు పైగా అక్కరలేదను నా నమ్మకమును బహిరంగముగా వ్యక్తముసేయుటకు నేను సందేహింపను. నేను ఈడుతో మాత్రమే ముందుకు పోలేదు. ప్రకృతి సామాన్య మార్గానుగుణముగ నాకీ లక్ష్యసిద్ధికి తగినంత వ్యవధి కలదు. కాని, మిగిలిన కాలమును నేనెంత జాగరూకతతో వాడుకొనుటకు నిబద్ధుడ నగుదునో, అంత అధికముగా దానిని వినియోగింపవలె నని నేను కాచుకొనియుంటిననియు భౌతికశాస్త్ర సూత్రములను నేను ప్రకటించినయెడల నాకాలము చాల వరకు దుర్వినియోగమగుననియు నేను తలంచుచున్నాడను. ఎందుకనగా, అవి సుస్పష్టములు; వాని నంగీకరించుటకు వానిని కేవలము అర్థము చేసికొనుటకంటె కావలసిన దెద్దియు లేదు. వానియందు, నిరూపించుట కవకాశములేని దొక్కటియు లేదు. అట్లయ్యు, ఇతరులయొక్క భిన్నములగు నభిప్రాయములకన్నిటికి అనుగుణముగా అవియుండుట అసాధ్యము కావున, వానివలన తప్పక జనించు విరుద్ధాభిప్రాయములు కారణముగ, నా మహోద్దేశమునుండి నేను తరచుగా తప్పుకొనవలసియుండెనని ముందే తెలిసికొంటిని.

ఈప్రాతికూల్యములు, నాతప్పులు నేను తెలిసికొనుటకును - నాయాలోచనలను వానిలో నేపాటియైన విలువ యున్నచో - ఇతరు లర్థముచేసికొననిచ్చుటకును, పనికివచ్చుచున్నవని చెప్పనగును. మరియు, ఒకనికంటె అనేకులు ప్రశస్తతరముగ చూడగలరు కావున, నా సిద్ధాంతముల నిప్పుడే వినియోగములోనికి తెచ్చుకొనునట్లు చేయుటకును తిరిగి వారు తాము కనుగొనిన వానితో నాకు సాహాయ్యము చేయుటకును పనికివచ్చును. కాని నాకుగల దోషప్రవణత్వ తీవ్రతను నేను తెలిసికొని యున్నను, నాకుగల ప్రథమాలోచనలను నే నెప్పుడును విశ్వసింపక పోయినను, నాయభిప్రాయములయెడ రాదగిన యాక్షేపముల యనుభూతి, వానినుండి యెట్టి లాభమును ఎదురుచూడకుండ నన్ను నిరోధించు చున్నది. ఎందుకనగా గణనీయులగు నాస్నేహితుల యొక్కయు, నాయెడ తటస్థభావము గలవారియొక్కయు, పక్షపాతముచే నాస్నేహితుల కన్నుల కెయ్యది గుప్తమైయున్నదో దానిని క్రోధాసూయాద్వారమున కనుగొన నిశ్చయించుకొనిన వారియొక్కయు, నిశ్చితాభిప్రాయముల బుజువులు నాకు గలవు. కాని నేను చర్చించుచున్న విషయమున కతిదూరమైనయప్పుడు తప్ప, నేను ముందుగా తెలిసికొనని దెద్దియు నాక్షేపింపఁబడలేదు. కావున, నాయభిప్రాయములను నాయంత కఠినముగ, నిష్పాక్షికముగ విమర్శించిన వాని నొక్కనిగూడ, నేను కలియలేదు. మరియు, నేటి దార్శనిక ప్రస్థానములయందు నడచుచున్న

వివాదములవలన వ్యక్తముసేయబడిన ఇతఃపూర్వాజ్ఞాత సత్య మేదియును లేదనియు నేను గుర్తించితిని. ఎందుకనగా, ఎవరికి వారే విజయమునకు ప్రయత్నించుచుందురు; కాగా ప్రశ్న కివువంకల గల ఉపపత్తులను తూచిచూచుటకంటె, ఎవరికివారే కేవల సత్యాభాసము నత్యధికముగాజూప మరియు వ్యగ్రులై యున్నారు. చాలకాలముగా మంచి న్యాయవాదులై యున్నంత మాత్రమున, తరువాత ప్రశస్తతరులగు న్యాయ మూర్తులు గారు.

ఇక నాయాలోచనలను వ్యక్తముసేయుటవలన ఇతరులకు గలుగు నుపయోగము చాలగొప్పది కాజాలదు. కారణము నాని నింకను నేను చాలినంతదూరము గొనిపోలేదు. ఉపయో గములోనికి తెచ్చుటకు పూర్వము వానికి చేర్చవలసిన దింకను చాలగలదు. మరియు, గర్వరహితముగా నేనొక్కటి చెప్ప గల ననుకొనుచున్నాడను : వానినంతదూరము కొనిపోగలిగిన వ్యక్తి యెవ్వడైననున్నచో ఆతడు నాకంటె ఇతరుడు కాజా లడు. ప్రపంచమున, నా బుద్ధికంటె అనుపమానముగా నధి కమైన బుద్ధివిశేషముగలవారు లేరని కాదుకాని, తనకుదానై కనుగొన్నదానిని వలె తానొరునివలన గ్రహించిన దానిని ఒకడు బాగుగగ్రహించి యద్దానిని తన స్వంతముచేసికొన జాలడు. ఇది ప్రస్తుతవిషయమునందుగూడ సర్వథా సత్యము. బుద్ధినైశిత్యముగల కొందరికి నాయభిప్రాయములను వ్యాఖ్యా

నించి చెప్పితిని. నేను చెప్పుచున్నంతసేపు చక్కగా అర్థము చేసికొనినట్లే చూపట్టియు, వారు, తిరుగ చెప్పునప్పుడు, ఆయభిప్రాయములను నావానిగా నే నంగీకరింపజాల నంతటి దూరము వానిని మార్చివేసిరి. ఈయవకాశమును గ్రహించి భావిప్రజాసంతతికొక మనవిచేసికొన గల్గినందుకు సంతసించు చున్నాడను. నేను నాయంతట ప్రకటింపనిదాని నెద్దానిని కేవ లము గాలికబురులవలన నమ్మవలదని మనవి. అట్టిది నానుండి వచ్చినదని నమ్మవద్దు. గ్రంథములు లభింపని ప్రాచీన తత్త్వ శాస్త్రజ్ఞుల విషయమున చెప్పబడు నత్యుక్తులు నాకెంతమా త్రము నచ్చెరువు గొల్పలేదు. ఏమైనను, అంతమాత్రమున వారి యాలోచనలు అంత వివేకశూన్యములని నేను భావిం పను. ఆకాలమునాటి ప్రజలలో వారుమిక్కిలి శక్తిమంతులు. కాని వారి కపార్థములను గల్పించిరి. తదనుగుణముగా, వారి శిష్యులయందు మచ్చున కొక్కడుగూడ వారి నతిశయింపకుం డుట గమనింపదగినది. ప్రస్తుతము ఆరిస్టాటిలు అనుయాయు లలోఆతనియెడ అత్యంతము భక్తియుక్తులగువారు, ఆతనికిగల ప్రకృతిజ్ఞానముతో సమముగు జ్ఞానము తమకున్నచో తమ్ము తా మదృష్టవంతులుగ భావించుకొందురను విషయమున, నాకు నిస్సందేహముగ నమ్మకము గలదు. అంతకంటె నధికతర మగునది వారు పొందరనుట సత్యము. ..... ఈవిష యమున వారు ఐవీ తీగెవంటివారు. అది తన్ను భరించుచున్న చెట్టుకంటె మీదికిపోవ యత్నింపదు. సరికదా, తరచుగా,

వృక్షాగ్రమువరకుపోయి, తిరిగి క్రిందికి వచ్చును. అట్లే వారు కూడ క్రిందికి దిగుదురు. అనగా, తాము చదువుకొనినప్పటికంటె బుద్ధిహీనులుగా తమ్ము దాము చేసికొందురు. అట్టివారు గ్రంథకర్త సుగమముగా వ్రాసిన దానిని తెలిసికొనుటతో తృప్తినందక, అతడొక్కమాటయైన చెప్పని, బహుశః తలంచికూడ నుండని, క్లిష్టసమస్యలకు పరిష్కారమును పై పెచ్చు కోరుదురు. సర్వసాధారణమైన శక్తిసామర్థ్యములు కూడలేనివారికి, వారితాత్త్వికరీతి బాగుగాసరిపడును. ఎందుకనగా, వారుపయోగించు విభేదములందును, సూత్రములందును గల అస్పష్టత, జ్ఞాతవిషయములను గూర్చి వారెంత దృఢవిశ్వాసముతోమాటలాడుదురో అంతదృఢవిశ్వాసముతోడనే, సర్వవిషయములను గూర్చియు మాటలాడ గల్గునట్లును, ఏవిషయమును గూర్చియైన వారు చెప్పినదాని నంతటిని దోషదూషితమని యెవ్వరు నెత్తిచూపలేకుండ, కాపాడుకొన గల్గునట్లును, వారిని శక్తిమంతులుగా చేయుచున్నది. ఇందు కొక దృష్టాంతము. చూపుగలవానితో సరి సమానముగ పోరదలచి అంధకారబంధురమగు గుహలోనికి అతనిని గొని పోయిన గ్రుడ్డివానితో వీరు సరిపోలుదురు. అట్టివారికి నేనుపయోగించు తత్త్వశాస్త్ర సూత్రములను ప్రకటింపకుండుట లాభకరమని నేను చెప్పగలను. ఎందుకనగా, అవి అత్యంతము సూక్ష్మములు, స్పష్టములు. కావున, వానిని నేను ప్రకటించినయెడల, మీరు నేచెప్పినయోధులు దిగిన గుహ

గవాక్షములు తెరచి, యందు పగటివెలుగును ప్రవేశింప జేసినట్లే యగును. కాని యీ సూత్రములను తెలిసికొనినవలెనను నాతురత అధికతరులకు గూడ గల్గుటకు కారణములేదు. ఎందుకనగా, సర్వవిషయములనుగూర్చి ప్రసంగింపగల్గుటయు, వైదుష్య విషయమున కీర్తి గడించుటయు, వారి కోర్కియైనచో, సత్యాభాసముతో తృప్తినందియున్నచో తమ ఉద్దిష్టమును వారు సుకరముగా పొందగలరు. ఈ సత్యాభాస మన్నిటియందును అంతగా కష్టము లేకుండగనే గస్పట్టును. ఇక సత్యమన్ననో మెల - మెల్లగా వ్యక్తమగును. అదియును కొన్ని శాఖలయందే. తక్కినవాని విషయమున బాహాటముగ మన యజ్ఞత నంగీకరింపవలసినదే. ఏలాగైనను, వేని విషయముననను అజ్ఞత లేనియట్లు గన్పట్టు వ్యర్థగర్వమునకు బదులు, కొన్ని సత్యములను గూర్చిన జ్ఞానమునే, — అట్టి జ్ఞానము నిస్సందేహముగ మిక్కిలి యెన్నదగినది కావున, — గ్రహించుట మంచిదని గణించినచో, నామార్గమునకు సరియగు మార్గమునే అనుసరింప వారు వాంఛించినచో, ఈ ప్రసంగములో నే నిప్పటికి చెప్పినదానికంటె అధికముగా నెద్దియు చెప్పనవసరములేదు. ఎందుకనగా, వారు నాకంటె బాగుగా ముందంజ వేయగలిగినచో, నేను కనుగొంటి ననుకొనుచున్న వాని నన్నిటిని వారు తమంతట తామే కనుగొనగలరు. క్రమము తప్పి నేనెద్దియు పరీక్షింపలేదు కావున, ఇంకను కనుగొనుటకు మిగిలియున్నది నిశ్చ

యముగా, నేనిప్పటికి కనుగొనగలిగినదానికంటె క్లిష్టతరమును, గంభీరమును. దానిని తమంతట తాము కనుగొనుట యందు కంటె, నావలన నేర్చుకొనుటయందు సంతృప్తి చాల తక్కువ యగును. పైగా, తొలుదొల్త సులభమైనదానికి యత్నించి, తరువాత క్రమక్రమముగా, మెలమెల్లగా కష్టతరములకు బోవు మానసికమగు నభ్యాసము నా యుపదేశము లన్నిటికంటె వారికి మంచి మేలు చేయును. నా స్వవిషయమున, నాయీవన మునుండియు నేను నిరూపింప నన్వేషించుచున్న సత్యములన్నియు నాకు అప్పుడే (యీవనమునందే) బోధింపబడియున్నచో, వానిని నేనెట్టి శ్రమయు లేకుండ నేర్చుకొనియున్నచో, బహుశః, వీనికి మించి మరెవ్వియు నేను తెలిసికొనియుండెడి వాడను గాను. అథమపక్షము, నాపరిశోధన కనుగుణముగా నవ్యసత్యముల నెల్లప్పుడును నేను కనుగొనుటలో, నాకు గల వని నేను తలంచుచున్న, అభ్యాససౌలభ్యములను నేనెప్పటి కిని సంపాదించి యుండియుండను. కష్టముగా: ఒకడు ప్రారంభించిన పనిని వానియంత బాగుగా ఇంకొకడు పూర్తి చేయలేడు, అనదగుపని యెద్దియైన నీప్రపంచమున నున్నచో అయ్యది నేను శ్రమించుచున్నదే. ఈ పనికి తోడ్పడు ప్రయోగముల విషయము నాలోచించినచో వాని నన్నిటిని చేయుట కొక్కడు సరిపడడనునది సత్యము. అయినను, ఈ పనియందు, తన్ను తప్ప ఇంకొకరిని లాభకరముగ వినియోగించుకొనుటకు వీలులేదు. తాను డబ్బిచ్చి పనిచేయించు

కొనుట కవకాశముగల పనివారిని, లేక, అట్టి తెగవారిని, వినియోగించుకొనవచ్చును. లాభమునందలి యాశ (గొప్ప శక్తిగల సాధనము) నిర్ణయింపబడిన పనిని సరిగా నిర్వహింప వారిని ప్రోత్సహింపవచ్చును. ఇక కౌతుకముచే గాని, నేర్చుకోవలెనను అభిలాషచేగాని, తమంతటతామే తమ సాహాయ్యము నొసంగినవారి విషయము. సామాన్యముగా వారు నిర్వహించుదానికంటె వారి వాగ్దానము లతిశయించి యుండును. వారు చక్కని ఉద్దేశములను సూచింతురు. అందొక్కటియు నెరవేర్చ సాధ్యముకాదు. నిస్సందేహముగ, వారి కష్టమునకు పరిహారముగ వారు కొన్ని క్లిష్టసమస్యల వివరణమునుగాని, అధమము, అభినందనములనుగాని, వ్యర్థ ప్రసంగములను గాని, కోరుదురు. వీనియందు వినియోగించిన కాలమంతయు వ్యర్థముగా పోయినట్లే. ఇక, ఇతరు లిప్పటికి చేసియున్న ప్రయోగముల విషయము: తమకు దామే యీ తెగలవారు తమ ప్రయోగము·ల గూర్చి యాతనికి తెలియజేయ సమ్మతింపవలసి యుండినను (వాటిని రహస్య ములుగా గణించువారేనాడును చేయరు) ఆ ప్రయోగము లను చాలవరకు మితిమీరిన అనేక పరిస్థితులును, అంశము లును వెన్నంటియుండును. కావున అందు నిశ్చితమగు సత్య మును కనుగొనుట కష్టతరము, పైగా, అవి సరిగా వివరింప బడవు; లేక అసత్యములైన నగును. (ఎందుకనగా, ఆసమా చారమును పంపినవారు వానిని తామంగీకరించిన సూత్రముల

కనుగుణముగా అవియున్నట్లు తోపజేయ నాతురులై యుండుటచే) కావున, వానిలో గొన్ని పనికివచ్చినను, వానిని ఏర్చి యెత్తికొనుటలో వ్యయమయిన కాలమునకు సరియగు నష్ట పరిహార మిందులో లేదు.

కావున, అత్యున్నత జాతికి చెందినవియు, ప్రజానీకమునకు అత్యంతోపయోగకరములును అగువిషయములను కనుగొనుటకు తగిన శక్తిగలవాడని మనకు నిశ్చితముగా తెలిసిన వాడెవ్వడైన నున్నచో, తక్కిన ప్రజలందరు, అన్నివిధముల, ఆతనియుద్దేశములను జయప్రదముగా నడపుటకు సాహాయ్యముగా వింప నాతురత కలవారై యున్నచో, వారాతని కావశ్యకములగు ప్రయోగములకగు వ్యయమును భరించుటకంటె ఇతరుల వలని అకాల విఘ్నములచే ఆతని విశ్రాంతి కాలము పోకుండ నాపుటకంటె, చేయగలిగినది మరెద్దియు లేదని నాకు తెలియును. కాని, ఇంతకు పైగా అసామాన్యములగు వానిని వేనిని వాగ్దానముచేయ నిష్టపడునంతటియు నా యుద్దేశములందు ప్రజానీక మత్యాసక్తి చూపవలెనని యూహించునంతగా వ్యర్థభావములను పోషించు నంతటియు, మహత్తరాభిప్రాయము నాపై నాకు లేదు. నే నర్హుడను కానని భావింపదగిన సాహాయ్యము నెవరినుండియైనను అంగీకరింపగల యంతటి నీచమగు నాత్మగలవాడను నేనుగాను.

ఈ మూడేండ్ల నుండియు సిద్ధముగానున్న వ్యాసమును ప్రకటింప నిష్టపడకుండుటకును, నాజీవిత కాలమున, అంత సామాన్యమైనదానికి, లేక, నాభౌతికశాస్త్రమూల సూత్రములు తెలియగల మరిదేనికైనను ప్రాముఖ్యము నీయకుండుటకై, నేను తీర్మానించుకొని యుండుటకును, ఈ విచారణలన్నియు కలసి కారణములగుచున్నవి. కాని, అప్పటినుండి రెండు కారణముల వలన కొన్ని ప్రత్యేకములగు నూదిరుల నిచ్చట చేర్చుటకును, లోకమునకు నాచేతలను ఉద్దేశములను గూర్చిన వివరములు కొన్ని చెప్పుటకును, నేను నిశ్చయించుకొంటిని. ఈయోజనలతో మొదటిది! వీనిని నేను ప్రకటింపనిచో నా రచనలను ప్రకటింపవలెనను నాపూర్వోద్దేశముల నెరిగియున్న చాలమంది, నే నట్లు చేయకుండ తొలగుటకు నన్ను ప్రోత్సహించిన కారణములు, నాకీర్తికి తగవని యూహింతురు. ఎందుకనగా, నాకు కీర్తి యనిన నమితమగు నాసక్తి లేకపోయినను, నేను దాని నసహ్యించుకొనినను — నేనట్లు చెప్ప సాహసించినచో — నే నన్నిటికంటె నధికతరముగా నెంచు విశ్రాంతికి విరుద్ధమని కీర్తిని తలంతును గావున, నద్దానియెడ నేను విరక్తుడనైనను, నా పనులను నేరములట్లు కప్పిపుచ్చుటకు నే నపేక్షింపలేదు. ప్రఖ్యాతుడను గాకుండుటకై నేను ముందుగా జాగరూకత పడలేదు. అట్టి ప్రవర్తనచే నా యెడనే నే తప్పిద మొనర్చినట్లగునని నేను తలంపవలసియుండుట కొంతవరకును, అయ్యది నే నభిలషించు మానసిక

ప్రశాంతత్వమునకు విరుద్ధమగు వశాంతిని కలిగించుననుట కొంతవరకును, దీనికి కారణములు. నన్ను గూర్చి అందరకు తెలియుట, లేక, తెలియక పోవుట అనుదాని యెడ నేను సమానముగనే తటస్థుడనైయున్నను, కొంతకీర్తిని సంపాదింప కుండ నుండలేకపోయితిని గావున, నన్నుగూర్చి చెడ్డగా చెప్పికొనకుండ నన్ను నేను రక్షించుకొనవలసిన బాధ్యత నాపై నున్నదని నేను తలంచియుంటిని. ఈతత్త్వశాస్త్రపు మాదిరు లను నేను వ్రాయ నిశ్చయించు కొనుటకుగల రెండవ కారణ మిది. నే నభిలషించు ననంతములగు ప్రయోగములు నాకు లభిం పకపోవుటచే నా స్వయంశిక్షణోద్దేశమున గలుగు నాలస్యము నాకు ప్రతిదినము ప్రత్యక్షమగుచున్నది. ఇతరుల సాహాయ్యము లేకుండ నా ప్రయోగములను నేను గావించుట అసాధ్యము. నాకు గల యాసక్తులలో లోకము అధికముగా పాల్గొనునని యాశించు సంతగా నన్ను నే నభినందించుకొనలేక పోయితిని. అయనను, స్వవిషయమున నాకర్తవ్యమొకటి గలదు. అందు లోపముండుట నా కిష్టముగాదు. ఆ లోపము వలన నాతరు వాతి వారు నన్ను నిందించుట కవకాశము గలదు. మదుద్దేశ నిర్వహణమునకు వారెట్లు తోడ్పడగలరో తెలియజేయు టలో నేను మిక్కిలి యజాగ్రత్త వహించితిననియు, అట్లజా గ్రత్త వహింపనిచో, ఇప్పటికంటె మంచి పరిస్థితియం దనేక విషయములను నే నుంచగలిగెడి వాడననియు వారు నన్ను

నిందింపవచ్చును. అట్లు నిందించు నవకాశమును వారికి నే నీయ నిష్టపడను.

మరియు, అధికవివాదములకు కారణములు కానట్టియు, నేను కోరిన దానికంటె అధికముగా నా సూత్రములను వివరింప నన్ను నిర్బంధింప నట్టియు, అట్లయ్యు నేను శాస్త్రములందెద్ది నిర్వ హింపగలనో నిర్వహింపజాలనో స్పష్టముగా ప్రదర్శింప సమర్థ ములగునట్టియు, విషయములను కొన్నిటినేర్చి యెత్తికొనుట నాకు సులభమని నేను తలంచితిని. ఈవిషయమున నేను జయించి తినో లేదో చెప్పవలసినవాడను నేను కాదు. నారచనలనుగూర్చి ప్రసంగించుచున్నప్పుడు, వానిగూర్చి ఇతరుల తీర్మానములను ముందుగా తెలిసికొను నుద్దేశము నాకు లేదు. కాని వానిని వారు పరీక్షించినచో నేను కృతజ్ఞుడనై యుందును. మరియు అట్లు చేయువారికి అధికతరమైన అవకాశము కల్లుటకై, వాని విషయమున ఆక్షేపణలు గలవారు నాప్రచురణ కర్తలకు, తమయాక్షేపములను పంపు శ్రమతీసికొనవలెనని నేను విన్న వించు కొనుచున్నాడను. వానిని గూర్చి ఆతడు నాకు తెలియ జేయును. నా ప్రత్యుత్తరమునుగూడ వానికి కలుప నేను యత్నింపవచ్చును. మరియు, ఈప్రకారము, పాఠకు లొక్క మారే రెండింటిని (ఆక్షేపణ ప్రత్యుత్తరములను) చూచి ఎచ్చట సత్యముగలదో సులభతరముగా నిశ్చయించుకొన గలరు. ఏస్థితియందును నేను, దీర్ఘములగు ప్రత్యుత్తరముల

నిచ్చువాడను గాను. ఉపరి, నాదోషములు సహేతుకములని నేను నమ్మినచో వానిని సంపూర్ణమగు నిష్కపట్యముతో నే నంగీకరింతును. లేక, అట్టి దోషములు నాకు గన్పట్టనిచో, నేను వ్రాసిన విషయముల సమర్థించుటకు వలసిన వానిని మాత్రమే చెప్పుదును. నూత్న విషయముల వివరణలను చేర్పను.

Diaptrics, Meteorics అను వాని ప్రారంభమున నేను ప్రసంగించిన విషయములు, వానిని నేను ప్రమేయములని ఋజువుచేయునెడ తాటస్థ్యమును వహించితిని కావున, చూసీ చూడగనే, అసంతృప్తి కల్గింపుచో, వానిని సంపూర్ణముగ ఓర్మితోడను, శ్రమతోడను చదువవలెననియు, అట్లుచేయుట వలన, సందేహపడువారు సంతృప్తినందగలరనియు, నేను విన్నవించుచున్నాను. ఎందుకనగా, ఈ వ్యాసములలోని హేతువు లన్యోన్యసంబంధము కలిగియున్నవి. తుదివానికి తొలివి కారణము లగును. కావున, తొలివానివలన తుదివి నిరూపింపబడుచుండగా, తొలివి వానిక్రమమున, తుదివాని వలన నిరూపింపబడును. తొలివానికి తుదివి కార్యములగుచున్నవి. తర్కశాస్త్రజ్ఞులు వృత్తమని యను హేత్వాభాస వాదమునకు నేను గురియైతినని తలంపకుడు. ఎందుకనగా, అనుభవము ఈ కార్యములలో అధికసంఖ్య గలవానిని నిశ్చితములుగా చేసినను, ఏకారణముల నుండి నే నీకార్యములను నిగమనము చేసితినో అవి వాని యునికిని వివరింపగలిగినంతగా,

వాని యాథార్థ్యమును స్థాపించుట కుపకరింపవు. మరియు, తద్వ్యతిరేకముగ, ఆ కారణముల నిజస్థితి కార్యముల యాథార్థ్యమువలన స్థాపింపబడుచున్నది. నే నిప్పటికే వివరించియున్న ప్రథమ సత్యముల నుండి వానిని నేను నిగమనము చేయగలిగితినను నా తలంపు తెలియవలెనను నుద్దేశముతో తప్ప మరెద్దానితోడను నేను వానిని ప్రమేయము లనలేదు. అయినను, కొందరు మనీషులు నా సూత్రములుగా వారు గ్రహించిన వాని నుపయోగించి ఒక అపూర్వతత్త్వశాస్త్రమును నిర్మించుటయు, అద్దానివలన నేను నిందింపబడుటయు నిరోధించుటకు గాను, అట్లు చేయకూడదని నేను ఖండితముగా నిశ్చయించుకొంటిని. ఒక డిరువదియేండ్లాలోచించిన దానిని సర్వము నొక్కరోజులోనే, ఒకటి రెండు మాట లాతడు ఆ విషయమును గూర్చి తమతో చెప్పినంతమాత్రమున, సంపూర్ణముగా గ్రహింపగలమని యూహించువారినిగూర్చియు, తాము చూపు నక్కరకును, ఉల్లాసమునకు అనుగుణముగ ఎవరు హెచ్చుగ దోషములకు లోనగుచు సత్య దర్శనము నెడ శక్తిహీను లగుచుందురో వారినిగూర్చియు, నేను సూచించుచున్నాడను. వాస్తవముగను. సంపూర్ణముగను, మదీయములగు నభిప్రాయముల విషయమున, నూత్నములని వానికి తీర్మానము నేను చెప్పికొనను. కారణము; వాని హేతువులు చక్కగా విచారింపబడినచో మిక్కిలి సామాన్యములుగను, సామాన్యవివేకమువలన స్థిరీకృతములుగను జూపట్టుటయే. తద్విషయమున నేను చెప్ప

సగు నితరాభిప్రాయము లంత అసామాన్యములుకావు. అంత అన్యోన్యవిరుద్ధములు కావు. వానిలో నెవ్వానిని నేను మొట్ట మొదట కనుగొంటిననియు నేను బడాయికొట్టను. వానిని నేను అంగీకరించితిని; వాని నితరులు గ్రహించిరి, లేదా గ్రహింపలేదు అనుటచే కాదు; ఇక, హేతువాదము, వాని యాథార్థ్యమునెడ నాకు నమ్మకము కలుగజేసినది కావున, నేను వాని నంగీకరించితిని.

Dioptrics లో వివరింపబడిన సూత్ననకల్పనమును వెంటనే శిల్పులు ఆచరణలోనికి తేజాలక పోయినను, తత్కారణముగ నెవ్వరును దానిని ఖండింప నర్హులుకారని నా తలంపు. ఎందు కనగా, సూక్ష్మతమములగు వివరములనుగూడ మరువకుండు నట్లుగ నాచే నిర్మింపబడిన యంత్రమును చేసి చక్కదిద్దుటకు నైపుణ్యమును, అభ్యాసమును కావలయును. కావున ప్రథమ ప్రయత్నమునందే వారు జయమును పొందుచో, స్వరకల్పన గల యొక కృతి ముందున్నంతమాత్రమున ఒకవ్యక్తి ఒక్క రోజులో వీణావాదన సమర్థుడగుచో నెంతటి అచ్చెరువందునో అంతటి అచ్చెరువునే పొందవలసివచ్చును. నా గురువుల భాషయగు లాటిన్‌లోగాక, నాదేశభాషయగు ఫ్రెంచిలో నేను వ్రాయుటకు కారణము, ప్రాచీనుల రచనలయందే శ్రద్ధగల వారికంటె తమ నిష్పాక్షిక నిసర్గ వివేకము నుపయోగించు వారు నా యభిప్రాయముల విషయమున ప్రశస్తతరులగు

తీర్పరులగుదురని నే నాశించుటయే. మరియు, సద్వివేకమును పరిశీలనాభ్యాసములతో మేళవించువారినే నేను న్యాయమూర్తులుగా గోరుదును. సామాన్యభాషలో వివరింప బడినంత మాత్రమున నా హేతువాదముల నాలింప నిరాకరించు నంతగా వారు లాటిను భాషయెడ పక్షపాతము కలిగియుండరని నా నిశ్చయము.

తుదకు, భావిలో శాస్త్రములయందు నేను చేయ నాశించు నభివృద్ధి విషయమున ప్రత్యేకముగ నెద్దియు చెప్పుటకుగాని, నేను నిర్వహింపగలనని నాకు నిశ్చయములేని వాగ్దానమున ప్రజలకు బద్ధుడనై యుండుటకుగాని నే నిష్టపడను. కాని యిది మాత్రము నేను చెప్పగలను. ఇంకను, నాకు మిగిలిన కాలమంతయు, ప్రస్తుత మమలులోనున్న వానికంటె అధికతర నిశ్చితత్వముగల వైద్యశాస్త్ర సిద్ధాంతములను నిగమనము చేయగల ప్రకృతి జ్ఞానమును సముపార్జించు ప్రయత్నమునందే వినియోగించుటకు నిశ్చయించుకొంటిని. మరియు, ఇతరము లగు వృత్తులయెడ, ముఖ్యముగా ఒకరిని బాధింపకుండ ఇంకొక రికి ఉపయోగకరములు కాజాలని వానియెడ, నా యిచ్ఛ మిక్కిలి వ్యతిరేకించును. కావున, ఏ పరిస్థితులచేనైన అట్టి పనులయందు నియమింపబడుచో వానియందు నేను సఫలీకృతుడనయ్యెడివాడనని నమ్మజాలను. ఈ విషయమున నేను

బహిరంగముగా ప్రకటించుట నా యైహికాభివృద్ధికి పనికి రాదు. కాని దానితో నాకు సంబంధములేదు. మరియు, నే నెవరి అభిమానమువలన, నా విశ్రాంతి కాలమును నిర్విఘ్నముగ, ఆనందముగ అనుభవింప ననుజ్ఞ నందియుంటినో, వారియెడ, అత్యున్నత భౌతికపదవృద్ధి నొసంగు నితరు లెవ్వరి యెడకంటె ఎక్కుడు కృతజ్ఞుడుగా నుండగలను.

ఆంధ్రాంగ్లపదసూచిక

ప్రసంగము	Discourse
ప్రమాణపద్ధతి	Method
తత్త్వశాస్త్రము	Metaphysics
శాస్త్రము	Science
ప్రకృతి	Nature

ప్రథమ భాగము

సద్బుద్ధి లేక వివేకము	Good sense or Reason
స్వచ్ఛత	Clearness
భావనావైశద్యము	Distinctness of imagination
దర్శనము	Philosophy
ఆసహజగుణములు	Accidents
రూపము	Form
స్వభావము	Nature
ఒకేవర్గమునకు చెందినవి	Species
భ్రమ	Delusion
ఈశ్వర విజ్ఞానశాస్త్రము	Theology
నిర్ణయము	Judgment
యుక్తియుక్తము	Intelligible
సంవాదశాస్త్రము	Rhetoric
యదార్థత్వము	Certitudo
ప్రమాణము	Evidence
నిశ్చిత	Precise
భగవత్ప్రసాదితసత్యము	Revealed truth
సంభావ్యము	Probable
సమస్తమును హేళనపూర్వకముగ తూలనాడు కొందరు తాత్త్వికులు	Cynics

హేతువాదము	Reasoning
ఊహాచోదితము	Speculative
వ్యవహారజ్ఞానము	Common sense
వైరుధ్యము	Contradiction
(మనస్సుచే) గ్రహణము	Apprehension

ద్వితీయ భాగము

చింత రాగము	Passion
ధర్మము	Religion
నిరూపణ	Demonstration
రాజ్యవిధానము	Constitution
తర్కశాస్త్రము	Logic
తర్కశాస్త్ర న్యాయము	Syllogism
అమూర్తము	Abstract
అర్థగ్రహణశక్తి	Understanding
చిత్తవిభ్రమము	Confusion
అస్పష్టత	Obscurity
సరళ	Simple
క్లిష్ట	Complex
అవశ్యకత	Necessary
విశదము	Distinct
క్రమము	Order
పరిస్థితి	Condition
భావన	Conception

తృతీయ భాగము

శ్రద్ధ	Faith
అనుయోజన	Cognisance

ఆలోచన	Thought
ఇచ్ఛాశక్తి	Will
సుగుణము	Virtue
నీతివాక్యము	Maxim
మతసంబంధి సత్యములు	Truths of faith
గ్రీసుదేశమందలి యొకానొక దార్శనిక వర్గము.	Sceptics
అనిశ్చయత	Uncertainty
ప్రతిజ్ఞావాక్యము	Proposition
నిశ్చయము	Certainty

చతుర్థ భాగము

ద్రవ్యము	Substance
స్వభావము	Essence or nature
దృఢవిశ్వాసము	Certitude
ఊహించు	Conceive
సత్త్వము	Being
ఈశ్వరుడు	God
ఇంద్రియగోచరములు	Sensible
భావన	Idea
అధేయత్వము	Dependency
చిద్వస్తువు	Intelligence
నిరంతరవస్తువు	Continuous body
కల్పనాశక్తి	Imagination
బోధ్యము	Intelligible
స్ఫుటము	Vivid
సంభ్రమితము	Confused
అవ్యక్త	Obscure

పంచమ భాగము

స్థిరనక్షత్రము	Fixed star
గ్రహము	Planet
అవకాశము	Space
ప్రకృతి	Matter
అవ్యవస్థ	Chaos
నియమము	Law
అంతరిక్షము	Heavens
చేష్టారహిత లేక సూక్ష్మగ్రాహి	Vegetative or sensitive soul
ప్రవృత్తి	Function
వివేకము	Reason
గతి	Motion
హృదయకోశము	Heart
ధమని	Artery
శరీరనిర్మాణశాస్త్రము	Anatomy
హృదయవివరము	Ventricle or Cavity
నాళిక	Tube
మహత్సిర	Hollow Vein
నాడికాధమని	Arterial Vein
సిరాధమనిక	Venous artery
శ్వాసనాళిక	Wind pipe
సూక్ష్మత్వక్కు	Pellicle
వివరము	Orifice
హృదయకర్ణిక	Pouch
కోష్ఠము	Auricle
కవాటము (మడత)	Valves
నాళము	Vessel
శూన్యగర్భసిర	Hollow vein

వ్యాకోచించు	Expand
సత్యాభాసము	Verisimilitude
సమతోలనచక్రములు	Counter weights
బంధము	Ligature
విరళీకృతముచేయు	Rarefy
అనురూప్య	Consistency
చర్మము	Coat
ధాతువు	Humour
పశుతత్త్వము	Animal spirit
యాంత్రికుడు	Mechanic
ఆంతరవికారము	Internal affection
సామాన్యబుద్ధి	Common sense
స్వయంచలన యంత్రము	Automaton
ఉద్రేకము	Passion
వివేకయుతమగు నాత్మ	Reasonable soul
ఇంద్రియజ్ఞానము	Sensation
ఆశ	Appetite

షష్ఠ భాగము

విచారణాత్మక శాస్త్రము	Speculative science
(ఈశ్వర) కృప	Grace
అభిప్రాయము	Notion
వైద్యశాస్త్రము	Medicine
ప్రయోగము	Experiment
దృశ్యములు	Phenomena
నిగమనముచేయు	Deduce
విశేషము	Particular
ఆకృతులు లేక జాతులు	Forms or species

సూక్ష్మము	Simple
సాధారణము	General
ప్రకారము	Mode
ప్రయోజనము	End
కనుగొనినది	Discovery
వివాదము	Disputation
దార్శనికరీతి	Philosophic fashion
సత్యాభాసము	Appearance of truth
కిరణవక్రీభవనశాస్త్రము	Dioptrics
ఉల్కా-విషయికశాస్త్రము	Meteorics
హేత్వాభాసము	Fallacy
వృత్తము	Circle
అన్యోన్యవిరుద్ధ	Paradox
నైసర్గికవివేకము	Natural Reason.

తప్పొప్పులపట్టిక

పేజీ	పంక్తి	తప్పు	ఒప్పు
i	4	పియిరీ	పియరె
iii	17	Syllopidm	Syllogism
vi	2	బకాక్	బజాక్
vii	16	ఫ్రాంక్‌ఫర్డ్	ఫ్రాంక్‌ఫర్ట్
xiii	4	Scientiuum	Scientiarum
	13	Poel	Poêle (ఉష్ణప్రదేశము)
xv	21	revelatation	revelation
xviii	12	Coitationes	Cogitationes
		Privalai	Privatae
	17	Sententias	sententiae
xxii	8	Meteogloroical	Meteorological
xxiii	5	Papaln uncio	Papal nuncio
xxiv	5,6,12,17	భాండో	భాందో
xxxvii	11	టీలోస్	టౌలోస్
	12	ఫొంటీనియర్	ఫోంటేనియర్
xxxviii	12	ecxi	ccxi
xLiii	1	రొమున్	రేమున్
	21	Poele	Poêle(ఉష్ణప్రదేశము)
xLvi	2	Meditations	Meditationes

సరస్వతీ పవర్ ప్రెస్
రాజమహేంద్రవరము

X

	మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KR01A115
పుస్తకం పేరు	[illegible]
తారీఖు	25/07/23
ముందు అట్ట	లేదు
వెనుక అట్ట	లేదు
మొత్తం పేజీలు	206
పెద్ద సైజు పేజీలు	లేవు
ఖాళీ పేజీలు	IV, VI, IX, X
లేని పేజీలు	లేవు
తయారు చేసినది	[illegible]
పేజీలు విడదీసినది	[illegible]
స్కాన్ చేసినది	[illegible]
పరీక్ష చేసినది	[illegible]
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యనివి	